WWW.ninadam.co.in

తెలుగు దినపత్రిక

# నినాదం

నిఖార్సైన జర్నలిజం

ఆదివారం, మార్చి 9, 2025 | సంపుటి - 21 | సంచిక 172 | వెల - 7 | పేజీలు -12 + 8

Published from Hyderabad and Vijayawada Circulated from TS and AP.. Hyderabad, Karimnagar, Khammam, Mahabubnagar, Nalgonda, Nizamabad, Warangal, Vijayawada, Guntur, Ongole, Nellore, Tirupati, Kadapa, Anantapur, Kurnool, Tadepalligudem, Rajahmundry, Visakhapatnam, Srikakulam



ఎపి విభజన చట్టం మేరకు

## సీట్లు పెంచాల్సిందే

- పదేళ్లయినా నేటికీ అమలు కాని నియోజకవర్గాల పెంపు
- డీలిమిటేషన్‌తో న్యాయం జరుగుతుందా అన్న అనుమానం

4లో..

## జనగణనతో తేలనున్న అసలు జనాభా

- జనాభా ప్రాతిపదికన ప్రణాళికలు అవసరం



# నినాదం ఎఫెక్టు.. సీఎం చెక్ పోస్టు



ఒక్క బిల్లు.. దొంగలారీలు ఫుల్లు

దోపిడికి గురవుతున్న ఎన్టీపీసీ

- బొమ్మకల్ చౌరస్తాలో ఏర్పాటు
- బూడిదలారీల ఓవర్ లోడ్ పై ఆగ్రహం
- రవాణా కమిషనర్ కు ఆదేశాలు
- రెండురోజులుగా తనిఖీలు 15 లారీలపై కేసులు



కరీంనగర్, మార్చి 08(నినాదం):

పెద్దపల్లి జిల్లా ఎన్టీపీసీ బూడిద లారీల ఓవర్ లోడ్ తంతును తొలిగా 'నినాదం' దినపత్రిక తెరపైకి తెచ్చింది.వెరసీ ఇతర పత్రికలు,ఛానెల్లలో మరిన్ని వార్తలు రావటంతో సమస్య రాష్ట్రస్థాయిలో వైరల్ అయ్యింది.విషయం సీఎం రేవంత్ రెడ్డి దృష్టికి వెళ్లటంతో సంబంధిత శాఖా ఉన్నతాధికారులపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసినట్లు సమాచారం.కాగా రాష్ట్ర రవాణా శాఖా కమిషనర్ ఆదేశానుసారం పెద్దపల్లి జిల్లా ముగింపు,కరీంనగర్ సరిహద్దున గల బొమ్మకల్ చౌరస్తాలో ఆర్టీఏ అధికారులు రెండు రోజుల క్రితం ఓ ప్రత్యేక చెక్ పోస్టును ఏర్పాటుచేసారు. బాడీ లెవల్ కు మించి వచ్చే ప్రతీ లారీని ఆపి తగిన ఫెనాల్టీలు వేస్తున్నారు. ఈ క్రమంలో శుక్రవారం సాయంత్రంనుండి శనివారం వరకు 15 లారీలను సీజ్ చేసినట్లు అధికారులు తెలిపారు. రాష్ట్ర కేంద్ర కార్యాలయంనుండి జరిగే ఈ ఆపరేషన్ లో రొటేషన్ పద్దతిన వివిధ ప్రాంతాలకు చెందిన అధికారులు పాల్గొంటారని పెద్దపల్లి డిటీఓ రంగారావు తెలిపారు. శనివారం నాటి తనిఖీల్లో కోలా రవీందర్, మాసూద్ అలీ మొదలగు ఇద్దరు ఎంవీఐలు ఒక హోమ్ గార్డ్ పాల్గొన్నారు.



రోడ్డుపై భారీగా నిలిచిన బూడిద లారీలు



కేవలం బాడీ మట్టంతో లారీ..

### బూడిద చెరువుకు వెళ్లే రోడ్డు..



ఓవర్ లోడ్ లారీల కట్టడికి ముందు..



తర్వాత..

# రూ. 9,852 కోట్ల పెట్టుబడులు..

- 4,500 మందికి ఉపాధి
- పలు ప్లాంట్లను ప్రారంభించిన మంత్రి శ్రీధర్ బాబు
- పారిశ్రామికవేత్తలకు ప్రభుత్వం అండగా ఉంటుందని వెల్లడి



హైదరాబాద్, మార్చి 08(నినాదం):

మహబూబ్ నగర్ జిల్లా దివిటిపల్లిలో రూ. 3,225 కోట్ల పెట్టుబడులతో ఏర్పాటు కానున్న "అమరరాజా గిగా ఫ్యాక్టరీ -1", "ఆల్టిమిన్ ప్రైవేట్ లిమిటెడ్", "లోహమ్ మెటీరియల్స్ ప్రైవేట్ లిమిటెడ్", "ఎస్సెల్ ఎనర్జీ ప్రైవేట్ లిమిటెడ్" ప్లాంట్లకు కేంద్ర మంత్రి అశ్విని వైష్ణవ్ తో కలిసి రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు గారు భూమి పూజ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడారు.

వివరాలు 2లో..

ఏఐ సాయంతో ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు

### స్కిల్ డెవలప్మెంట్‌లో శిక్షణ

- మంత్రి శ్రీధర్ బాబు



# అధికారులను పనిచేయనిస్తలేరు

- రామగుండాన్ని అక్రమాలకు అడ్డాగా మార్చారు
- ప్రజాప్రతినిధుల అండతోనే ముర్మూరు మట్టిదోపిడీ
- స్వార్థంకోసం సర్కారు ఖజానాకే గండికొడుతున్నరు
- లెక్కా పత్రం లేకుండా తరలుతున్న కోట్ల సంపద
- బీఆర్ఎస్ సీనియర్ నేత కౌశికహరి



గోదావరిఖని,మార్చి 08(నినాదం):

జిల్లాలో సిన్సియర్ అధికారులున్నా స్థానిక ప్రజాప్రతినిధులే వారిని పనిచేయనిస్తలేరని బీఆర్ఎస్ సీనియర్ నేత కౌశిక హరి ఆరోపించారు.కోట్ల విలువ చేసే పెద్దపల్లి జిల్లా,అంతర్గాం మండలం,ముర్మూరు మట్టి అక్రమ రవాణాపై ఆయన స్పందించారు. ఈ మేరకు శనివారం ఆయన సదరు మట్టి డంపును సందర్శించారు.అక్కడ జరుగుతున్న తతంగమంతా పరిశీలించారు.ఈ క్రమంలో అక్కడి వ్యక్తులు చూపించిన తలాతోకా లేని పత్రాలపై వారిని ప్రశ్నించారు.అనంతరం వివరణకోసం జిల్లా కలెక్టర్ కు ఫోన్ కాల్ ప్రయత్నించగా ఆయన అందుబాటులోకి రాలేదు.దీంతో ఏడీ మైనింగ్,ఇరిగేషన్ తదితర అధికారులకు మాట్లాడే ప్రయత్నం చేసినా ఫలితం లేకపోవటంతో మీడియాతో మాట్లాడారు.అధికారుల పర్యవేక్షణ, వే బిల్లు మొదలగు నిబంధనలేవీ పాటించకుండా వేలాది టన్నుల మట్టిని అక్రమంగా తరలిస్తున్నారన్నారు.సమాచార చట్టం కింద వివరాలు అడిగితే కూడా తగిన వివరాలు ఇవ్వకుండా అధికారులను కట్టడిచేస్తున్నారని హరి అన్నారు.దీన్ని వదిలేది లేదని,సోమవారం పూర్తి వివరాలకోసం కలెక్టరు సహా సంబంధిత అధికారులందరినీ కలవనున్నట్లు తెలిపారు. ఈ విషయంలో ప్రభుత్వ ఖజానా పరిరక్షణే ధ్యేయంగా బీఆర్ఎస్ పక్షాన తమ పోరాటముంటుందని ఆయన స్పష్టంచేసారు.

## అఖిల పక్షానికి రెండు పార్టీల డుమ్మా

- రెండు పార్టీలది ఒకటే వైఖరి అని తేలిపోయింది
- కావాలనే హాజరు కాలేదంటున్న కాంగ్రెస్
- రెండు పార్టీల తీరును ఎండగట్టేందుకు మరో అవకాశం

వివరాలు 2లో..

## మీ ఆహ్వానాన్ని మన్నించలేక పోతున్నాం

- ముందస్తు కార్యక్రమాలతో అఖిలపక్షానికి రాలేం
- డిప్యూటీ సీఎం భట్టికి కిషన్ రెడ్డి లేఖ





## రైల్వే పెండింగ్ ప్రాజెక్టులకు

# నిధులు ఇవ్వండి

- కాజీపేట కేంద్రంగా డివిజన్ ఏర్పాటు చేయాలి
- రైల్వేశాఖ మంత్రి అశ్విన్ వైష్ణవ్‌కు రాష్ట్ర మంత్రులు వినతి

రాష్ట్రంలోని పెండిరగ్ ప్రాజెక్టులకు నిధులు ఇవ్వాలని కేంద్ర రైల్వేశాఖ మంత్రి అశ్విన్ వైష్ణవ్‌కు రాష్ట్ర మంత్రులు కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, సీతక్క, కొండా సురేఖ, వరంగల్ ఎంపీ కడియం కావ్య విజ్ఞప్తి చేశారు. కాజీపేటలో కోచ్ ఫ్యాక్టరీ ఏర్పాటు చేయాలని కోరారు. కాజీపేట కేంద్రంగా డివిజన్ ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు.

హైదరాబాద్,మార్చి8(నినాదం):

మహబూబ్ నగర్ జిల్లా దివిటిపల్లిలో జరిగే కార్యక్రమానికి హాజరవుతున్న ఆయనను శనివారం శంషాబాద్ విమానాశ్రయంలో రాష్ట్ర మంత్రలు కలిశారు. దాదాపు అరగంట సేపు రాష్ట్రంలోని పెండిరగ్ ప్రాజెక్టులపై చర్చించారు. మంత్రుల విజ్ఞప్తిపై అశ్విన్ వైష్ణవ్ సానుకూలంగా స్పందించారు. అనంతరం మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి మాట్లాడుతూ.. ఎంపీ కడియం కావ్య విజ్ఞప్తి మేరకు వరంగల్ కు రింగ్ రోడ్డు ఇస్తామని మంత్రి ఒప్పుకున్నారని చెప్పారు.





## కరీంనగర్ తిరుపతి మధ్య రోజూ రైలు నడపండి

- రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్‌కు మంత్రి పొన్నం లేఖ
- ఎంపీ బండి సంజయ్‌కే విజ్ఞప్తి చేస్తున్నాని వెల్లడి..

తిరుమల శ్రీవారి దర్శనానికి ఉత్తర తెలంగాణ నుంచి భారీగా భక్తులు వెళ్తారని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. తిరుపతి వెళ్ళ వారి ప్రయాణికుల సమస్యలను దృష్టిలో ఉంచుకుని కరీంనగర్ నుంచి తిరుపతికి నిత్యం రైలు నడపాలని కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ కు మంత్రి పొన్నం ప్రభాకర్ విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ఆయనకు లేఖ రాశారు.

02



స్వయం సహాయక సంఘాల సభ్యుల

## వయోపరిమితి పెంపు

- 15 నుంచి 65 ఏళ్ల వరకు మహిళలకు అవకాశం
- ఇందిరాశక్తి సభలో సిఎం రేవంత్ ప్రకటన
- మహిళలు అన్నిరంగాల్లో రాణించాలి
- మహిళా వర్సిటీకి అంతర్జాతీయ ఖ్యాతి తేవాలి
- చాకలి ఐలమ్మ వర్సిటీలో పలు పనులకు శంకుస్థాపన

ఆడపిల్లలకు ప్రోత్సాహం ఉంటుందన్న సిఎం రేవంత్

వివరాలు 2లో..

## సిరియాలో ఊచకోతలు.. 600 మంది మృతి



- రెండు గ్రూపుల మధ్య దాడులు, ప్రతీకార హత్యలు
- 14 ఏళ్ల సిరియా సంక్షోభంలో ఇదే అతిపెద్ద మారణకాండ
- రోడ్లు, వీధుల్లో శవాల గుట్టలు
- ప్రాణభయంతో కొండల్లోకి పారిపోయిన ప్రజలు

# రూ. 9,852 కోట్ల పెట్టుబడులు..

**మొదటిపేజీ తరువాయి**

అమరరాజా అడ్వాన్స్డ్ సెల్ టెక్నాలజీస్ ప్రైవేట్ లిమిటెడ్" తెలంగాణలో 262 ఎకరాల విస్తీర్ణంలో పదేళ్లలో రూ. 9,852 కోట్ల పెట్టుబడులు పెట్టనుంది. ఈ ప్రాజెక్ట్ ద్వారా సుమారు 4,500 మందికి ప్రత్యక్ష ఉపాధి లభించనుంది. ఇప్పటికే రెండు యూనిట్లు నిర్మాణంలో ఉండగా, తాజాగా రూ. 1,900 కోట్లతో మూడో యూనిట్ నిర్మాణానికి ఈరోజు భూమి పూజ చేయడం సంతోషంగా ఉందని మంత్రి శ్రీధర్ బాబు అన్నారు.ఆల్టిమిన్ ప్రైవేట్ లిమిటెడ్" లిథియం ఫెర్రో ఫాస్ఫేట్ (ఎల్ఎఫ్ పీ) టెక్నాలజీ ఆధారంగా బ్యాటరీలు, ఇతర కీలక పదార్థాలను ఉత్పత్తి చేయనుంది. దివిటిపల్లిలో 20 ఎకరాల విస్తీర్ణంలో రూ. 800 కోట్ల వ్యయంతో మూడేళ్లలో రెండు దశల్లో ఈ ప్లాంట్ నిర్మాణం పూర్తి కానుంది. సుమారు 300 మందికి ఉపాధి లభిస్తుందని మంత్రి తెలిపారు. లోహమ్ మెటీరియల్స్ ప్రైవేట్ లిమిటెడ్" దివిటిపల్లిలో 20 ఎకరాల విస్తీర్ణంలో... రూ. 502 కోట్ల వ్యయంతో వ్యర్థాల ప్రాసెసింగ్ పరిశ్రమను ఏర్పాటు చేస్తోందని, ఐదేళ్లలో రెండు దశల్లో విస్తరించనున్న ఈ పరిశ్రమకు ఏడాదికి 12.50 లక్షల టన్నుల వ్యర్థాలను ప్రాసెసింగ్ చేసే సామర్థ్యం ఉంది. సుమారు 120 మందికి ఉపాధి లభించనుందని శ్రీధర్ బాబు అన్నారు. సెల్ ఎనర్జీ ప్రైవేట్ లిమిటెడ్"క్యాన్స్, క్యాప్స్ తయారీ సంస్థ. ఇది నికెల్ పూతతో స్టీల్ క్యాన్లు, లిథియం అయాన్ సెల్స్ కోసం క్యాప్స్ ను ఉత్పత్తి చేయనుంది. రూ.23 కోట్ల వ్యయంతో 6 ఎకరాల విస్తీర్ణంలో నిర్మించనున్న ఈ ప్లాంట్ ద్వారా 150 మందికి ఉపాధి కల్పించనుందన్నారు. సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వం పై విశ్వాసం ఉంచి... పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు వస్తున్న పారిశ్రామికవేత్తలకు కృతజ్ఞతలు. ప్రభుత్వం తరపున అన్ని రకాలుగా అండగా ఉంటామని ఆయన భరోసాని ఇచ్చారు. ఇతర రాష్ట్రాలకు ధీటుగా అభివృద్ధి చెందుతున్న తెలంగాణకు కేంద్రం అండగా



నిలవాలని విజ్ఞప్తి చేస్తున్నానని, తెలంగాణలో పారిశ్రామికాభివృద్ధిని ప్రోత్సహించాలని కోరుతున్నానన్నారు. సెమీ కండక్టర్స్ పరిశ్రమల ఏర్పాటుకు, అభివృద్ధికితెలంగాణ అనుకూలంగా ఉంది. కేంద్ర మంత్రి అశ్విని వైష్ణవ్ చొరవ తీసుకుని... తెలంగాణ లో సెమీ కండక్టర్స్ పరిశ్రమల అభివృద్ధికి సహకరించాలని మంత్రి శ్రీధర్ బాబు విజ్ఞప్తి చేశారు.పారిశ్రామికాభివృద్ధిలో తెలంగాణను మరింత ముందుకు తీసుకెళ్లేందుకు అనేక చర్యలను తీసుకుంటున్నామని,ప్రత్యేకంగా తెలంగాణ ఎలక్ట్రిక్ వెహికల్ & ఎనర్జీ స్టోరేజ్ పాలసీ, తెలంగాణ క్లీన్ అండ్ గ్రీన్ ఎనర్జీ పాలసీని తీసుకొచ్చామన్నారు. దివిటిపల్లిలో ఎలక్ట్రానిక్ మాన్యుఫాక్చరింగ్ క్లస్టర్(ఈఎంసీ) కోసం భూములు త్యాగం చేసిన రైతులకు కృతజ్ఞతలు. ప్రభుత్వం చొరవ తీసుకొని ఈ క్లస్టర్ ను మరింత అభివృద్ధి చేసి... తెలంగాణ బ్రాండ్ ను విశ్వవ్యాప్తం చేస్తామన్నారు.

తెలంగాణలో చదువుకున్న యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడం మా లక్ష్యమని, పరిశ్రమలను ఒక్క ప్రాంతానికే పరిమితం చేయకుండా... అన్ని ప్రాంతాలకు విస్తరిస్తామని శ్రీధర్ బాబు పునరుద్ఘాటించారు

**ఏఐ సాయంతో ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు స్కిల్ డెవలప్మెంట్ లో శిక్షణ...**

కృత్రిమ మేధస్సు (ఏఐ) సాయంతో ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు "స్కిల్ డెవలప్‌మెంట్" లో శిక్షణ ఇవ్వనున్నట్లు రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు తెలిపారు. మారుతున్న టెక్నాలజీకి అనుగుణంగా తమ బోధనా సామర్థ్యాలను మరింత పెంపొందించుకునేందుకు ప్రభుత్వ ఉపాధ్యాయులను ప్రోత్సహిస్తామన్నారు. శనివారం డా.బీఆర్ అంబేద్కర్ సచివాలయంలో తెలంగాణ ఫిల్మ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ చైర్మన్ దిల్ రాజు ఆధ్వర్యంలో కోణం ఫౌండేషన్ నిర్వాహకులు సందీప్ కుమార్ మంత్రిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ... అన్ని రంగాల్లో ఎమర్జింగ్ టెక్నాలజీస్ ను సమర్థవంతంగా వినియోగించుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని వివరించారు. ప్రభుత్వ, ప్రైవేట్ భాగస్వామ్య(పీపీపీ) విధానంలో అత్యంత ప్రతిష్ఠాత్మకంగా "ఏఐ సిటీ"ను ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. ఇక్కడే అంతర్జాతీయ ప్రమాణాలతో ఏఐ యూనివర్సిటీని కూడా ప్రారంభించబోతున్నామన్నారు. నల్గొండ జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు ఏఐ సాయంతో ఉచితంగా స్కిల్ డెవలప్‌మెంట్ లో శిక్షణ ఇస్తున్న ఫౌండేషన్ సేవలను అభినందించారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న అన్ని ప్రభుత్వ పాఠశాలలకు ఈ ఫౌండేషన్ సేవలను విస్తరించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. విదేశాల్లో ఉన్నత స్థాయిలో స్థిరపడిన సందీప్ కుమార్.. పుట్టిన ఊరిని మర్చిపోకుండా ఫౌండేషన్ తరపున అనేక సామాజిక సేవా కార్యక్రమాలు చేస్తున్నారని ప్రశంసించారు.

## రైల్వే పెండింగ్ ప్రాజెక్టులకు నిధులు ఇవ్వండి



కాజీపేట రైల్వే డివిజన్ ఏర్పాటు చేయాలని కోరినట్టు చెప్పారు. వికారాబాద్ రైల్వేలైన్ పెండిరగ్‌లో ఉందని, డోర్నకల్-భద్రాచలం రైల్వే లైన్ పెండిరగ్ లో ఉందని చెప్పారు. నస్కల్-హసన్ పర్తి- చింతలపల్లి లైన్ గురించి అడిగామన్నారు. మంత్రి సీతక్క మాట్లాడుతూ.. గత బీఆర్ఎస్ ప్రభుత్వం వరంగల్ ను అభివృద్ధి చేస్తామని మాటలతో కోటలు కట్టింది తప్ప పని చేయలేదన్నారు. మంత్రి కొండా సురేఖ మాట్లాడుతూ.. దశాబ్దాల కాలంగా పెండిరగ్లో ఉన్న రైల్వే కోచ్ ఫ్యాక్టరీ రైల్వే డివిజన్ సహా తదితర అంశాలపై విజ్ఞప్తి చేశామని చెప్పారు. బీజేపీ తరఫున కేంద్ర మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు రాష్ట్ర అభివృద్ధిపై దృష్టి పెట్టాలని కోరారు. వరంగల్ లో ఎయిర్ పోర్టు అందుబాటులోకి వస్తే అన్ని రంగాల్లో అభివృద్ధి జరుగుతుందని చెప్పారు. ఎంపీ కడియం కావ్య మాట్లాడుతూ.. కాజీపేట రైల్వే కోచ్ ఫ్యాక్టరీపై కేంద్ర మంత్రి సానుకూలంగా స్పందించారని చెప్పారు. రైల్వే డివిజన్ గా మార్చాలన్న అంశాన్నీ ప్రస్తావించామని ఆమె చెప్పారు. కాకతీయ టెక్స్టైల్ పార్కుకు కావలసిన విధంగా రైలు మార్గాలను ఏర్పాటు చేయాలని రైల్వే అధికారులకు మంత్రి ఆదేశాలు జారీ చేశారని చెప్పారు. వరంగల్ ఎయిర్పోర్ట్ ,టెక్స్టైల్ ఇండస్ట్రీ మధ్య కావలసిన రైల్వే లైన్ పై పార్లమెంటు సమావేశాల్లో చర్చించనున్నట్టు కావ్య చెప్పారు.

**కరీంనగర్-తిరుపతి మధ్య రోజూ రైలు నడపండి**

కరీంనగర్ నుంచి తిరుపతి రైలు (12762) (ఆది ,గురు) ,తిరుపతి నుంచి కరీంనగర్ (12761)(బుధ,శని) రైలు ప్రస్తుతం వారానికి రెండు సార్లు మాత్రమే నడుస్తుంది. ఈ రైలును తాను ఎంపీగా ఉన్నప్పుడు ఉత్తర తెలంగాణ ప్రజలు తిరుపతి వెళ్ళడానికి సులభతరంగా ఉంటుందని యూపీఏ ప్రభుత్వంలో ప్రారంభించడం జరిగింది. తరువాత ఈ రైలుని ప్రతిరోజూ నడిచేలా చర్యలు తీసుకోవాలని కేంద్రంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి గత 10 సంవత్సరాలుగా రైల్వే శాఖ మంత్రిగా మీకు , స్థానిక ఎంపీ బండి సంజయ్ కి విజ్ఞప్తి చేస్తున్నా. కరీంనగర్ నుంచి తిరుపతికి ప్రతి రోజు రైలు నడిపేలా చర్యలు తీసుకోండని మంత్రి పొన్నం కోరారు.



## మీ ఆహ్వానాన్ని మన్నించలేక పోతున్నాం

**హైదరాబాద్, నినాదం:**

డిప్యూటి సిఎం భట్టి విక్రమార్క ఆహ్వానంపై తెలంగాణ బీజేపీ కీలక నిర్ణయం తీసుకుంది. ఎంపీల సమావేశానికి హాజరుకాకూడదని బీజేపీ నిర్ణయించింది. ఈ మేరకు డిప్యూటీ సీఎం భట్టికి కిషన్ రెడ్డి లేఖ రాశారు. భట్టి పంపిన లేఖ ఆలస్యంగా అందిందని.. ఇప్పటికే నిర్ణయించుకున్న కార్యక్రమాల కారణంగా ఆల్ పార్టీ ఎంపీల సమావేశానికి హాజరుకాలేకపోతున్నట్లు లేఖలో కిషన్ రెడ్డి తెలిపారు. శనివారం) ప్రజాభవన్‌లో జరిగే అఖిలపక్ష సమావేశానికి రావాల్సిందిగా అన్ని పార్టీల ఎంపీలతో పాటు కేంద్రమంత్రులు కిషన్ రెడ్డి , బండి సంజయ్‌లకు స్వయంగా భట్టి విక్రమార్క ఫోన్ చేసి ఆహ్వానించారు. అయితే భట్టి పంపించిన ఆహ్వానం ఆలస్యంగా అందిందని... సమావేశంపై పార్టీలో చర్చించుకునే సమయం లేదని కిషన్ రెడ్డి లేఖలో తెలిపారు. ఇప్పటికే నిర్ణయించుకున్న అధికార, అనధికార కార్యక్రమాలతో ఎంపీల సమావేశానికి హాజరుకాలేకపోతున్నామని చెప్పారు. భవిష్యత్‌లో ఇలాంటి సమావేశాలు నిర్వహించాలనుకుంటే ముందస్తు సమాచారం ఇవ్వాలని కోరుతున్నట్లు తెలిపారు. అయితే తెలంగాణ అభివృద్ధికి ప్రధాని నరేంద్ర మోడీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం, బీజేపీ కట్టుబడి ఉందని.. చిత్తశుద్ధి, అంకితభావంతో తెలంగాణ అభివృద్ధికి తాము కృషి చేస్తూనే ఉంటామని లేఖలో కిషన్ రెడ్డి స్పష్టం చేశారు. కాగా.. ఆల్ పార్టీ ఎంపీల సమావేశానికి హాజరుకాకూడదని ఇప్పటికే బీఆర్ఎస్ నిర్ణయం తీసుకున్న విషయం తెలిసిందే.

## సిరియాలో ఊచకోతలు.. 600 మంది మృతి

**న్యూఢిల్లీ, నినాదం:**

రాజకీయ సంక్షోభం, అంతర్యుద్ధంతో అల్లకల్లోలంగా మారిన సిరియాలో అతిపెద్ద మారణకాండ చోటు చేసుకుంది. భద్రతా దళాలు, బహిష్కరణకు గురైన ప్రెసిడెంట్ బషార్ అసాద్ విధేయుల మధ్య చోటు చేసుకున్న ఘర్షణలు కాస్తా.. హింసా కాండకు దారి తీసింది. ఈ దాడులు, ప్రతీకార హత్యల కారణంగా 600 మందికి పైగా మృత్యువాత పడినట్లు సిరియా పరిస్థితిని మానిటర్ చేస్తున్న ఒక సంస్థ శనివారం తెలిపింది. 14 ఏళ్ల సిరియా సంక్షోభంలో ఇంత దారుణమైన మారణకాండ చోటు చేసుకోవడం ఇదే తొలి సారని తెలుస్తుంది. గురువారం మొదలైన ఘర్షణలు మరింతగా ముదరడంతో సిరియాలో ఏర్పడిన కొత్త సర్కారుకు ఇబ్బందిగా మారింది. అసాద్‌ను పదవీచ్యుతుడ్ని చేసిన తర్వాత తిరుగుబాటుదారులు సిరియాలో అధికారాన్ని హస్తగతం చేసుకున్నారు. అయితే బషార్ అసద్ విధేయులే ఈ హింసాకాండకు బాధ్యత వహించాలని, ఇలాంటి వ్యక్తిగతమైన చర్యలు తగదని కొత్త ప్రభుత్వం అంటోంది. శుక్రవారం ప్రభుత్వానికి విధేయులైన సున్నీ ముస్లింలు ఆయుధాలు చేపట్టి.. అసద్ వర్గానికి చెందిన మైనార్టీలైన అలావైట్ గ్రూపుపై దాడులకు తెగబడ్డారు. దశాబ్దాలుగా అలావైట్ ప్రాంతం అసాద్‌కు సపోర్ట్ బేస్‌గా ఉంటూ వస్తోంది. ఈ ప్రాంతంపై సున్నీ ముస్లింలు దాడి చేసి అలావైట్లను దారుణంగా చంపేశారు. దుకాణాలు, ఇండ్లలోకి చొరబడి దొరికిన వారిని దొరికినట్లు కాల్చేశారు. వీధుల్లో, రోడ్లపై ఈ కాల్పుల కారణంగా వందలాది మంది మృతి చెందారు. పైగా అలావైట్ల ఇండ్లలోకి చొరబడి సామాన్లు లూటీ చేశారు. అనంతరం ఇండ్లను తగలబెట్టినట్లు ప్రత్యక్ష సాక్ష్యులు చెబుతున్నారు. ఇక బనియాస్ ప్రాంతంలో కూడా హింసాకాండ చెలరేగింది. అక్కడ ప్రతీ వీధిలో, రోడ్లపై, ఇండ్ల పైకప్పులపై శవాల గుట్టలు పేరుకొని పోయాయి. వాటిని తీసుకొని పోవడానికి కూడా సున్నీ ముస్లింలు ఒప్పుకోలేదని తెలిసింది. బషార్ అసాద్‌కు మద్దతుగా ఉన్నందుకే ఈ ప్రతీకార హత్యలు జరిగినట్లు తెలిసింది. ఈ హింసాకాండకు భయపడి చాలా మంది తమ కుటుంబాలతో సహా పర్వత ప్రాంతాలకు వెళ్లి దాక్కున్నట్లు సమాచారం. బ్రిటన్‌లని సిరియన్ అబ్జర్వేటరీ ఫర్ హ్యూమన్ రైట్స్ ఈ యుద్ధాన్ని మానిటర్ చేస్తుంది. దీనికి బాధ్యుడైన రమీ అబ్దుర్‌రెహ్మాన్ మాట్లాడుతూ 428 మంలి అలావైట్లు ఈ ఎటాక్‌లో చనిపోయారని తెలిపారు. దీంతో పాటు 120 మంది అసద్ ఫైటర్లు, 89 మంది భద్రతా సిబ్బంది కూడా మరణించినట్లు పేర్కొన్నారు. అయితే శనివారం ఈ ప్రతీకార హత్యలు ఆగిపోయినట్లు రమీ తెలిపారు. అయితే కచ్చితంగా ఎంత మంది మరణించారనే విషయం ఇంకా వెల్లడి కాలేదని అన్నారు.

## కాలిఫోర్నియా గవర్నర్ రేసులో కమలాహారిస్

కాలిఫోర్నియా : అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో ఓటమిపాలయిన ఉపాధ్యక్షురాలు కమలా హారిస్ జాగా ఆమె కాలిఫోర్నియా గవర్నర్‌గా పోటీ చేసేందుకు సిద్ధమైనట్లు తెలుస్తోంది. ఈ మేరకు పలు వార్తా పత్రికల్లో కథనాలు వెల్లడిస్తున్నాయి. ఇటీవల జరిగిన పలు కార్యక్రమాల్లో కాలిఫోర్నియా గవర్నర్‌గా పోటీకి సిద్ధమైనట్లు సూచనప్రాయంగా తెలిపారు. మరికొన్ని రోజుల్లో దీనిపై తుది నిర్ణయం తీసుకోనున్నట్లు వెల్లడిరచారు. ప్రస్తుతం గావిన్ న్యూసమ్ కాలిఫోర్నియా గవర్నర్‌గా వ్యవహరిస్తున్నారు. ఇక, ఆమె 2028 అధ్యక్ష ఎన్నికల్లో పోటీకి దూరంగా ఉండాలని యోచిస్తున్నట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. దశాబ్దాలుగా కాలిఫోర్నియా వాసులు డెమోక్రట్లకే మొగ్గుచూపుతున్నారు. దీంతో ఆమె ఈ ఎన్నికల్లో పోటీకి దిగితే.. తప్పక విజయం సాధిస్తారని పార్టీ వర్గాలు ఆశాభావం వ్యక్తం చేశారు. అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో రిపబ్లికన్ పార్టీ అభ్యర్థి డొనాల్డ్ ట్రంప్ పై డెమోక్రటిక్ అభ్యర్థి కమలాహారిస్ పోటీ చేసి ఓడిపోయారు. అధికారం చేజిక్కించుకోవడానికి కీలకమైన స్వింగ్ రాష్ట్రాలను సొంతం చేసుకుంటూ ట్రంప్ 312 ఎలక్టోరల్ ఓట్లతో విజయం సాధించగా, హారిస్ 226 ఎలక్టోరల్ ఓట్లను కైవసం చేసుకున్నారు. ఓటమి అనంతరం హారిస్ మాట్లాడుతూ.. కొన్నిసార్లు సానుకూల ఫలితాలకు సమయం పడుతుందని.. అంతేకాని గెలవలేమని కాదని పేర్కొన్నారు. స్వేచ్ఛ, న్యాయం, భవిష్యత్తు కోసం మళ్లీ నిలబడాల్సిన, నిమగ్నం కావాల్సిన సమయం ఇదేనని తన మద్దతుదారులకు పిలుపునిచ్చారు.

## అఖిలపక్షానికి రెండు పార్టీల డుమ్మా

**రెండు పార్టీలది ఒకటే వైఖరి అని తేలిపోయింది**

**కావాలనే హాజరు కాలేందంటున్న కాంగ్రెస్**

**రెండు పార్టీల తీరును ఎండగట్టేందుకు మరో అవకాశం**

హైదరాబాద్ : కేంద్రం నుంచి రావాల్సిన నిధులు రాబట్టేందుకు, పార్లమెంటులో వివిధ అంశాలపై ఉమ్మడిగా పోరాడేందుకు ఉద్దేశించిన రాష్ట్ర ప్రభుత్వం ప్రజాభవన్‌లో ఏర్పాటు చేసిన అఖిలపక్ష సమావేశానికి బీజేపీ, బీఆర్ఎస్ ఎంపీలు దూరంగా ఉండడం రాజకీయ దుమారం రేపుతోంది. ఈ రెండుపార్టీలను ఇరుకున పెట్టేలా సిఎం రేవంత్ రెడ్డి చేసిన ప్రయత్నం ఫలించింది. అలాగే ఈ రెండు పార్టీలు ఒక్కటే అని ప్రచారం చేసుకునే అవకాశం వచ్చింది. ఈ రెండు పార్టీల మధ్య లోపాయకారి అవగాహన ఉందని మొన్నటి ఎమ్మెల్సీ ఎన్నికల్లో బయటపడిరదని ఇప్పటికే కాంగ్రెస్ ఆరోపిస్తోంది. ఇప్పుడు అఖిలపక్షానికి ఎఐఎం హాజరుకాగా, బిజెపి, బిఆర్ఎస్ పార్టీలు దూరంగా ఉన్నాయి. ముఖ్యంగా మెట్రో విస్తరణ, మూసీ ప్రక్షాళన, ఆర్ఆర్ఆర్‌కు నిధులు, ఫ్యూచర్ సిటీకి కేంద్రం నుంచి నిధులు రాబట్టేందుకు పార్లమెంటులో అనుసరించాల్సిన వ్యూహంపై చర్చించేందుకు డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క అధ్యక్షతన శనివారం ప్రజాభవన్‌లో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశానికి రావాలని కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్‌కి భట్టి విక్రమార్క స్వయంగా ఫోన్ చేసి ఆహ్వానించారు. బీఆర్ఎస్ రాజ్యసభ్య సభ్యులకు కూడా ఆహ్వానం పంపారు. వీరితోపాటు ఎంఐఎం అధినేత, హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్‌ను సైతం ఆహ్వానించారు. ఉదయం ఈ మేరకు కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ఒక నోట్ విడుదల చేశారు. తాము సమావేశానికి రాలేమని, మహిళా దినోత్సవం కార్యక్రమాల్లో బిజీగా ఉన్నామని పేర్కొన్నారు. ముందుగా చెబితే ప్లాన్ చేసుకునేవారమని అన్నారు. బీజేపీ తెలంగాణ అభివృద్ధికి కట్టుబడి ఉందని పేర్కొన్నారు. పదేండ్లలో పది లక్షల కోట్ల రూపాయలను తెలంగాణ అభివృద్ధి కోసం ఖర్చు చేసిందని తెలిపారు. తెలంగాణ అభివృద్ధి కోసం చిత్తశుద్ధితో కృషి చేస్తామని ప్రకటించారు. మరోవైపు బీఆర్ఎస్ రాజ్యసభ సభ్యులు కూడా ఈ సమావేశానికి దూరంగా ఉన్నారు. ప్రస్తుతం కేఆర్ సురేశ్ రెడ్డి, వద్దిరాజు రవిచంద్ర, పార్థసారథి రెడ్డి, దామోదర్ రావు బీఆర్ఎస్ తరఫున రాజ్యసభ సభ్యులుగా కొనసాగుతున్నారు. వీళ్లు నలుగురు కూడా సమావేశానికి హాజరు కాలేదు. పార్టీ అధినేత కేసీఆర్ నిర్ణయం మేరకే సమావేశానికి దూరంగా ఉన్నట్టు చెబుతున్నారు. ఈ సమావేశానికి కాంగ్రెస్ నుంచి గెలుపొందిన లోక్ సభ సభ్యులు, రాజ్యసభ ఎంపీలు సమావేశానికి హాజరయ్యారు. వీరితో పాటు ఎంఐఎం అధినేత, హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఓవైసీ వచ్చారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాష్ట్రానికి రావాల్సిన నిధులు, చేపట్టాల్సిన అభివృద్ధి కార్యక్రమాలపై ప్రధాన మంత్రి నరేంద్ర మోదీని, కేంద్ర మంత్రులను పలుమార్లు కలిసి విజ్ఞాపన పత్రాలు సమర్పించారు. ముఖ్యంగా మూసీ నది ప్రక్షాళన, మెట్రో విస్తరణ, రీజినల్ రింగ్ రోడ్డు, ఫ్యూచర్ సిటీతో పాలు ఐటీఐఆర్, ఐఐఎం, బయ్యారం ఉక్కు పరిశ్రమ తదితర అంశాలను ప్రస్తావించారు. వినతి పత్రాలు తీసుకుంటున్న కేంద్ర ప్రభుత్వం నిధుల మంజూరు విషయాన్ని అటకెక్కించింది. దీంతో కేంద్ర మంత్రులు ఇద్దరున్నా నిధులు తేవడం లేదంటూ సీఎం రేవంత్ రెడ్డి విమర్శలు చేశారు. మెట్రో విస్తరణకు, మూసీ ప్రక్షాళను కిషన్ రెడ్డే అడ్డుపడుతున్నారంటూ ఫైర్ అయ్యారు. మూసీ ప్రక్షాళన చేస్తే మొదటి తట్ట తానే మోస్తానని, తాను అడ్డుపడటం లేదని కిషన్ రెడ్డి క్లారిటీ ఇచ్చారు. ఆర్ఆర్ఆర్ అలైన్ మెంట్ మార్చుకుంటే బాగుండేదనే అభిప్రాయం వ్యక్తం కూడా చేశారు. మెట్రోకు తాను అడ్డుకాదని క్లారిటీ ఇచ్చారు. సమావేశానికి హాజరైతే ఇటు బీజేపీ, అటు బీఆర్ఎస్ తమ పార్టీ స్టాండ్‌ను కచ్చితంగా చెప్పాల్సి ఉంటుంది.

## స్వయం సహాయక సంఘాల సభ్యుల వయోపరిమితి పెంపు




**హైదరాబాద్,మార్చి8(నినాదం):**


మహిళలు అన్ని రంగాల్లో రాణించాలన్న రాజీవ్‌గాంధీ కలల్ని.. మహిళా వర్సిటీ విద్యార్థులు నిజం చేయాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పిలుపునిచ్చారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా కోఠిలోని వీరనారి చాకలి ఐలమ్మ మహిళా విశ్వవిద్యాలయంలో రూ.550 కోట్ల విలువైన నూతన భవన నిర్మాణాలు, చారిత్రక కట్టడాల పునరుద్ధరణ పనులకు సీఎం.. శంకుస్థాపనలు చేశారు. ఎన్నికల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పించే సందర్భం వస్తుందని, అందులో మీ ప్రాతినిధ్యం ఉండాలని ఆకాంక్షిస్తున్నట్లు సీఎం పేర్కొన్నారు. మహిళలకు అవకాశం ఇస్తే తమ చిత్తశుద్ధిని నిరూపించుకుని ఆదర్శంగా నిలుస్తున్నారని కొనియాడారు. ఈ యూనివర్సిటీలో చదువుకోవడం ఇక్కడి విద్యార్థుల అదృష్టమని, మీ అన్నగా ఆడబిడ్డలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం పథకాన్ని అమలు చేస్తున్నానన్న సీఎం రేవంత్ రెడ్డి.. స్వయం సహాయక సంఘాలను ప్రోత్సహించి వారికి పాఠశాలల నిర్వహణ బాధ్యత అప్పగించామని వివరించారు. ఆడబిడ్డలు వంటింటి కుందేళ్లు కాదని.. వారు వ్యాపారవేత్తలుగా రాణిస్తారన్న భావనతో ప్రభుత్వం ప్రోత్సహిస్తోందన్నారు. అదానీ, అంబానీలతో మహిళలు పోటీపడేలా కార్యాచరణ తీసుకుంటున్నామని తెలిపారు. అంతకుముందు విశ్వవిద్యాలయంలో దర్బార్ హాల్‌ను సీఎం సందర్శించారు. హైదరాబాద్ కోఠి ఉమెన్స్ కాలేజీకి వందేళ్ల చరిత్ర ఉందన్నారు. ఈ వర్సిటీకి చాకలి ఐలమ్మ పేరు పెట్టడం గొప్ప కీర్తి అని అన్నారు. చాకలి ఐలమ్మ మహిళా వర్సిటీలో పలు నూతన భవనాలకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడిన ఆయన.. వర్సిటీ అభివృద్ధి పనులకు రూ. 500 కోట్లు కేటాయిస్తున్నామని చెప్పారు. ఈ యూనివర్సిటీ అంతర్జాతీయ యూనివర్సిటీలతో పోటీ పడాలన్నారు. ఇక్కడ చదివిన ప్రతి ఆడబిడ్డ ప్రపంచ స్థాయిలో రాణించాలన్నారు. రెండున్నరేళ్లలో వర్సిటీ నిర్మాణం పూర్తవుతుందన్నారు. వర్సిటీ నిర్మాణానికి నిధుల ఢోకా ఉండదన్నారు రేవంత్ .అవకాశం ఇస్తే అన్ని రంగాల్లో మహిళలు రాణిస్తారని అన్నారు రేవంత్. రాజీవ్ గాంధీ మహిళా రిజర్వేషన్లు తీసుకొచ్చారని చెప్పారు. వచ్చే ఎన్నికల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు అమలు చేస్తామన్నారు సీఎం రేవంత్. మహిళలకు ఏ పాత్ర ఇచ్చినా సమర్థవంతంగా నిర్వహిస్తారని చెప్పారు. దేశం అభివృద్ధి చెందాలంటే మహిళల భాగస్వామ్యం పెరగాలన్నారు. తాము అధికారంలోకి వచ్చాక మహిళలకు బస్సుల్లో ఫ్రీ జర్నీ అవకాశం కల్పించామన్నారు. అదానీ అంబానీలతో పోటీపడేలా మహిళలను ప్రోత్సహిస్తున్నామన్నారు రేవంత్ రెడ్డి. . మహిళా రిజర్వేషన్ కోసం సోనియా గాంధీ కృషి చేశారని సీఎం తెలిపారు. రాజకీయాల్లో మహిళలు కూడా రావాలని చెప్పారు. మహిళలకు ఐఏఎస్ ఐనా.. మంత్రులు ఐనా అవకాశం వచ్చిన వాళ్ళు చిత్తశుద్ధి నిరూపించుకుని నిలబడుతున్నారన్నారు. మహిళలకు తమ ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తుందని స్పష్టం చేశారు. ఆడ బిడ్డలు అనాపైస లేకుండా గుడికి పోయినా ఖర్చు లేకుండా చేసినట్లు తెలిపారు. 200 యూనిట్ లకు ఉచిత విద్యుత్తు, మహిళలకు పాఠశాల నిర్వహణ బాధ్యత ఇచ్చామన్నారు. మహిళలకు 10 ఎలక్ట్రిక్ బస్సులు అందిస్తున్నామని తెలిపారు. మహిళలకు వీటన్నింటితో పాటు చదువు చాలా ముఖ్యమని బాగా చదువుకొని యూనివర్సిటీకి పేరు తీసుకురావాలని కోరారు. మంత్రి పొన్నం ప్రభాకర్, ఎంపీలు అసదుద్దీన్ ఒవైసీ, అనిల్ కుమార్ యాదవ్, సీఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డి, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు ఇతర ఉన్నతాధికారులు కార్యక్రమానికి హాజరయ్యారు.

### స్వయం సహాయక సంఘాల సభ్యుల వయోపరిమితి పెంపు

ప్రపంచ మహిళా దినోత్సవం సందర్భంగా మహిళలకు సీఎం రేవంత్‌రెడ్డి గుడ్‌న్యూస్ చెప్పారు. స్వయం సహాయక సంఘాల సభ్యుల వయోపరిమితిని పెంచుతున్నట్లు ప్రకటించారు. 15యేళ్ల నుంచి 65 యేళ్లలోపు మహిళలందరూ స్వయం సహాయక సంఘాల్లో సభ్యులుగా చేరాలన్నారు. తెలంగాణ మహిళల అర్థికాభివృద్దే..రాష్ట్ర ఆర్థికాభివృద్ధి..ఇప్పటికే మహిళా సంఘాల్లో 65లక్షల మంది సభులున్నారు..కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేస్తే వన్ ట్రిలియన్ డాలర్ ఎకానమీ చాలా ఈజీ అన్నారు. మహిళల ఉన్నతికి రాష్ట్రప్రభుత్వం అనేక విధాలుగా కృషి చేస్తుందన్నారు సీఎం రేవంత్ రెడ్డి. ప్రతి జిల్లా కేంద్రానికి ఇందిరా మహిళశక్తి భవనాన్ని మంజూరు చేశామన్నారు.

1000మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి చేసేలా సోలార్ ప్లాంట్లను మహిళలకు అప్పగించామన్నారు. ఈ సందర్భంగా సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్ లో మహిళా సంఘాలు ఏర్పాటు చేసిన స్టాళ్లను సీఎం రేవంత్ రెడ్డి సందర్శించారు. మహిళా సంఘాల ఉత్పత్తుల స్టాళ్లను సందర్శించి సభ్యులతో ముచ్చటించారు. ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్ నిర్వాహకులను వ్యాపారం ఎలా సాగుతుందంటూ వివరాలు అడిగి తెలుసుకున్నారు. రోజుకు రూ. 15000 వరకు వ్యాపారం జరుగుతుందని ఆర్థికంగా నిల తొక్కుకోగలుగు తున్నామని సీఎంకు చెప్పారు. ఈ సందర్భంగా లడ్డూ టేస్ట్ చూశారు రేవంత్. అనంతరం బహిరంగ సభలో మాట్లాడిన రేవంత్ మహిళల ఉన్నతికి రాష్ట్రప్రభుత్వం అనేక విధాలుగా కృషి చేస్తుందన్నారు రేవంత్ రెడ్డి. సభలో పాల్గొన్న సీతక్క మాట్లాడుతూ.. ఇందిరా మహిళా శక్తి దేశానికి ఘనకీర్తి అన్నారు. రాష్ట్రంలోని కోటిమంది మహిళలను కోటీశ్వరులను చేస్తామన్నారు. 600 ఆర్టీసీ బస్సులకు మహిళలను ఓనర్లు చేశామన్నారు. మహాలక్ష్మీ పథకం ద్వారా ఆర్టీసీ బస్సుల్లో ఉచితంగా 115 కోట్ల మంది మహిళలు ప్రయాణించారన్నారు. 31 జిల్లాల్లో మహిళా పెట్రోల్ బంక్ లకోసం ఒప్పందం జరిగిందన్నారు.

గతంలో ఎన్నడూ లేని విధంగా మహిళా సంఘాల సభ్యులకు ప్రమాదబీమా, రుణబీమా కల్పించామన్నారు. పది లక్షల ప్రమాద బీమా , రెండు లక్షల వరకు లోన్ బీమా ఇస్తున్నట్లు మంత్రి సీతక్క చెప్పారు. మహిళలకోసం పాటుపడుతున్న కాంగ్రెస్ ప్రభుత్వాన్ని మహిళలు దీవించాలని కోరారు.





# పార్లమెంటులో రచ్చ కానున్న డీ లిమిటేషన్ !

పార్లమెంట్ బడ్జెట్ సమావేశాల రెండో సెషన్ సోమవారం నుంచి జరుగనున్నది. ఈ సమావేశంలోనే పలు కీలక అంశాలు చర్చకు రానున్నాయి. ఇప్పటికే పలు అంశాలపై విపక్షాలు ఆందోళన చేస్తున్న నేపథ్యంలో వాటిని పార్లమెంట్ వేదికగా చర్చకు పట్టుబట్టే అవకాశం ఉంది. ప్రధానంగా జనగణన, అందులోనే కులగణన చేపట్టాలని కాంగ్రెస్ డిమాండ్ చేస్తోంది. జనగణన చేపట్టేందుకు ఇప్పటికే అధికార బిజెపి సానుకూల సంకేతాలు ఇచ్చింది. అయితే కులగణకు మాత్రం ససేమిరా అంటోంది. దేశంలో కులచిచ్చు రగల్చడం సరికాదని బిజెపి వాదిస్తోంది. నిజానికి ఇప్పుడున్న కాలంలో ఇంకా కులాల కుంపట్లు పట్టుకుని వేలాడుతా మంటే కుదరదు. తెలంగాణ, బీహార్‌లో కులగణన చేసినా పెద్దగా ఒరిగిందేమీ లేదు. కులాల ఓట్లను పొందేందుకు కాంగ్రెస్ ఆడుతున్న డ్రామా తప్ప మరోటి కాదు. మరో ముఖ్య విషయం నియోజకవర్గాల పునర్విభజన అంశం. దీనిపై స్పష్టత రావాల్సి ఉంది. .నాభా ఆధారంగా నియోజకవర్గాల గణన చేస్తే తాము నష్టపోతామని దక్షిణాది రాష్ట్రాలు గగ్గోలు పెడుతున్నాయి. సీట్లు తగ్గవని అంటున్న బిజెపి..ఏ సీట్లు తగ్గవో స్పష్టంగా చెప్పడం లేదు. ఇప్పటికే తమిళనాడు సిఎం స్టాలిన్ దీనిపై యుద్ధం మొదలు పెట్టారు. దక్షిణాది రాష్ట్రాల సిఎంలకు లేఖలు రాసారు. తగ్గిన జనాభా కారణంగా నియోజకవర్గాల కుదింపు కుట్రలు జరుగు తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. తాజాగా దానికి కొనసాగింపుగా తెలంగాణ సిఎం రేవంత్ రెడ్డి కూడా పల్లవి అందుకున్నారు. సీట్ల తగ్గింపు జరగదని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి అంటున్నారు. అయితే ఉత్తరాదితో పోలిస్తే దక్షిణాదిలో కూడా సీట్లు పెరుగుతాయా లేదా అన్నది బిజెపి స్పష్టం చేయడం లేదు. ఈ క్రమంలో సోమవారం నుంచి జరిగే పార్లమెంట్ సమావేశాల్లో ఇది విపక్షాలకు ప్రధాన ఎజెండా కానుంది. జనగణన, నియోజకవర్గాల పునర్విభజన, మహిళా రిజర్వేషన్ల అమలు వంటివి రానున్న ఒకటి రెండు సంవత్సరాల్లో పూర్తి చేయాలని బిజెపి పట్టుదలగా ఉంది. ఆ తరవాత జమిలి ఎన్నికలకు వెళ్లేలా ప్రణాళిక సిద్ధం చేస్తున్నట్లు రాజకయీ వర్గాల్లో చర్చ సాగుతోంది. ఈ సమావేశాల్లోనే జమిలి ఎన్నికలపై కీలక నిర్ణయం తీసుకుంటారా లేదా అన్నది తేలాల్సి ఉంది. ఇప్పటికే జమిలి ఫీవర్ పట్టుకుంది. జమిలి ఎన్నికలు జరిపి తీరుతామన్న పట్టుదలలో మోడీ ప్రభుత్వం ఉంది. ఇది ప్రజాస్వామ్యానికి విఘాతం అని విపక్షాలు ఇప్పటికే వాదిస్తున్నాయి. ఎందుకంటే వారికి నిరంతర ఎన్నికల ప్రక్రియ ఉంటేనీ జీవితం గగడవదు. అయితే జమిలి ఎన్నికలతో వచ్చే నష్టం లేదు. తరచూ ఎన్నికల వల్ల దేశ ఖజానాకు బొక్క పడుతోంది. అలాగే రాజకీయ నాయకులు నిత్యం ఎన్నికలతో ఎంజాయ్ చేస్తున్నారు. దీంతో ప్రజా సమస్యలు ఎన్నికల గాలికి కొట్టుకు పోతున్నాయి. దేశాన్ని గాడిలో పెట్టాలంటే పలు కీలక నిర్ణయాలు తీసుకోవాల్సి ఉంది. ఇవన్నీ మోడీ ప్రభుత్వం చేయగలుగుతుందా..అంతటి చిత్తశుద్ధి ఉందా అన్నది చూడాలి. ప్రధానంగా జమిలికి ముందే దేశ జనాభా గణన జరగాలి. దీంతోపాటే ఉమ్మడి పౌరస్మృతి అమల్లోకి తీసుకుని రావాలి. ఎవరెన్ని రకాలుగా ఒత్తిళ్లు తెచ్చినా, రాజకీయ పోరాటం చేసినా..దేశానికంతటికీ ఒకేదేశం, ఒకే చట్టం అమల్లోకి రావాలి. అలాగే ప్రధానంగా పెరుగుతున్న జనాభాను కట్టడి చేయాలి. ఇందులో కులమతాలకు తావులేకుండా చేయాలి. ఇవి ప్రధాన సమస్యలుగా ఉన్నాయి. ముఖ్యంగా దక్షిణాది రాష్ట్రాల్లో నియోజకవర్గాల పునర్విభజన అంశంపై పెద్ద ఎత్తున చర్చ జరుగుతున్నది. సాధారణంగా లోక్‌సభ, శాసనసభల నియోజక వర్గాల సంఖ్య జనాభా ప్రాతిపదికన నిర్ణయిస్తారు. దేశంలో భిన్నత్వాన్ని, ప్రజాస్వామిక స్ఫూర్తిని చాటేలా చట్టసభల్లో అన్ని వర్గాలకు ప్రాతినిధ్యం లభించేలా సీట్ల కేటాయింపు ఉంటుంది. దేశ, రాష్ట్ర జనాభాను పరిగణనలోకి తీసుకొని లోక్‌సభ సీట్లసంఖ్యను నిర్ణయిస్తారు. కొత్తగా లెక్కించే జనాభా ఆధారంగా శాసనసభ,లోక్‌సభ సీట్లు పెరుగుతాయని రాజకీయవర్గాలు ఉత్కంఠగా ఎదురు చూస్తున్నాయి. సీట్లు పెరిగితే తమకు ప్రాతినిధ్యం పెరుగుతుందనే అభిప్రాయం వ్యక్తమవుతున్నది. అయితే రాజకీయ పదవులను తగ్గించే పని కూడా చేపడితే మంచిది. రాష్ట్రాల్లో గవర్నర్ వ్యవస్థతో పాటు శాసనమండలులు కేవలం రాజకీయ పునరావాస కేంద్రాలుగా ఉన్నాయి. వీటిని శాశ్వతంగా ఎత్తేస్తే మంచిది. కేంద్ర ప్రభుత్వం జనాభా లెక్కలకు మాత్రమే పరిమితం కాకుండా లోక్‌సభ, శాసనసభల సీట్ల సంఖ్యను కూడా పెంచాలని రాజకీయ పార్టీలు కోరుకుంటున్నాయి. ఎందుకంటే ఎన్ని సీట్లు పెంచితే అన్ని విధాలుగా లబ్ది పొందేది కేవలం రాకజీయ పార్టీలు మాత్రమే. దేశంలో లోక్‌సభ సీట్లను పెంచితే మాత్రం దేశ రాజకీయ ముఖచిత్రమే మారిపోతుంది. అందుకే దేశ ప్రజల దృష్టి 2025లో జరగనున్న జనాభా లెక్కలపై పడిరది. ఇకపోతే చట్టసభల్లో మహిళలకు రిజర్వేషన్లు కల్పిస్తూ చట్టాన్ని ఆమోదించారు. దీనికి జనాభగణను లింక్ చేశారు. మహిళా రిజర్వేషన్ బిల్లు అమలు విషయంలో జనగణన కీలకంగా ఉంది. 2023లో ఈ బిల్లు 106వ రాజ్యాంగ సవరణ ద్వారా చట్టంగా మారింది. సార్వత్రక ఎన్నికల నేపథ్యంలో మహిళా రిజర్వేషన్ బిల్లును పార్లమెంటులో ప్రవేశపెట్టిన కేంద్ర ప్రభుత్వం జనగణన పూర్తయిన వెంటనే దాన్ని అమల్లోకి తీసుకుని వస్తామని హామీ ఇచ్చింది. ఆ మేరకు చట్టంలో కూడా పొందుపరిచింది. అందుకే, ఇప్పుడు మహిళా రిజర్వేషన్ బిల్లు అమలులోకి రావాలంటే కచ్చితంగా జనగణన జరిగితీరాలి. అప్పుడే మహిళల దశాబ్దాల కల సాకారమవుతుంది. చట్టసభల్లో మహిళలకు 33శాతం రిజర్వేషన్లు దక్కుతాయి. మహిళా రిజర్వేషన్ల ద్వారా దేశంలోని విభిన్న ప్రాంతాలకు చెందిన మహిళలు చట్టసభల్లోకి ప్రవేశించేం దుకు ఉన్న ఆటంకాలు తొలగిపోతాయి.

# గ్లాకోమా నిశ్శబ్దంగా కంటి చూపును దెబ్బతీస్తుంది !

(09 - 15 మార్చి
"ప్రపంచ గ్లాకోమా వారం" సందర్భంగా)




దృష్టిని దోచుకునే అదృశ్య శత్రువుగా గ్లాకోమా వ్యాధి మిలియన్ల ప్రజల చూపును మింగేస్తున్నది. "కంటి చూపును దోచుకునే రహస్య దొంగ"గా పేరుగాంచిన గ్లాకోమా వ్యాధి చికిత్స కన్న నివారణే మిన్న అని నిర్ధారణ అయ్యింది. కంచి చూపుకు ప్రధానమైన "దృష్టి నాడీ లేదా ఆప్టిక్ నర్వ్" దెబ్బతినడంతో బయట పడే అంధత్వాన్ని గ్లాకోమా వ్యాధి అని పిలుస్తాం. కంటి చూపును నియంత్రించడం, నేత్ర ఆకారం నిలవడానికి అవసరమైన నిర్దిష్ట పీడనాన్ని కల్పించడంలో దృష్టి నాడి ఉపయోగపడుతున్నది. దృష్టి నాడి బలహీనం అయినపుడు లేదా దెబ్బతిన్నపుడు నేత్ర పీడనం పరిమితులు దాటి దృష్టి నాడిపై దుష్ప్రభావాన్ని కలిగించడం వల్ల చూపుక్రమంగా మందగించడంతో పాటు అలాగే నిర్లక్ష్యం చేస్తే శాశ్వత అంధత్వం కూడా కలుగుతుందని సాధారణం ప్రజలకు అవగాహన కల్పించటానికి ప్రతి ఏట మార్చి మాసపు రెండవ వారంలో, అనగా 09 మార్చి నుండి 15 మార్చి 2025 వరకు విశ్వవ్యాప్తంగా 2010 నుంచి "ప్రపంచ గ్లాకోమా వారోత్సవాలు" నిర్వహించడం ఆనవాయితీగా మారింది.

### తొలి దశలో గుర్తించడమే ఉత్తమ మార్గం:

గ్లాకోమా ముదిరితే చూపు క్రమంగా తగ్గుతూ నేత్ర వైద్య నిపుణులు కూడా చికిత్స చేయలేని శాశ్వత అంధత్వం కూడా కలుగుతుందని తెలుసుకోని ప్రతి ఏట నేత్ర వైద్యులను సంప్రదించి గ్లాకోమా వ్యాధి నిర్ధారణకు సహకరించాలి. ఎలాంటి వ్యాధి లక్షణాలు లేని కారణంగా గ్లాకోమా రాకను గుర్తించడం కష్టం అవుతుంది. అన్ని వయస్సుల వారికి వచ్చే అవకాశాలున్న గ్లాకోమా వ్యాధి వృద్ధుల్లో అధికంగా కనబడుతుంది. ప్రపంచ అంధత్వంలో రెండవ అతి పెద్ద సమస్యగా గుర్తించిన గ్లాకోమా వ్యాధికి సరైన చికిత్స వనేటికీ అందుబాటులో లేనందున తొలి దశలో గుర్తించి వైద్యుల సలహాలతో దృష్టిని నిలుపుకోవచ్చు. ప్రపంచవ్యాప్తంగా 80 మిలియన్ల గ్లాకోమా రోగులు ఉన్నప్పటికీ ఇంకా నిర్ధారణ కాని ప్రజలు అనేకులు ఉండవచ్చని అంచనా. భారత్‌లో గ్లాకోమా వ్యాధిగ్రస్తులు 12 మిలియన్లకు పైగా ఉండవచ్చని, వీరిలో 1.2 మిలియన్లు చూపును కూడా కోల్పోయారని తెలుస్తున్నది. పౌర సమాజంలో 90 శాతం వరకు గ్లాకోమా వ్యాధిగ్రస్తులను గుర్తించడంలో విఫలం అవుతున్నాం.

### ప్రపంచ గ్లాకోమా వారోత్సవాలు-2025 ఇతివృత్తం:

2025 ప్రపంచ గ్లాకోమా వారోత్సవాల ఇతివృత్తంగా "గ్లాకోమా కాని రాని ప్రపంచ నిర్మాణానికి ఐక్యం అవుదాం" అనే అంశాన్ని తీసుకొని ప్రచారం చేయడం జరుగుతున్నది. గ్లాకోమానునతొలి దశలో గుర్తించడానికి ప్రతి ఏట నేత్ర వైద్యులతో పరీక్షలు చేయించుకోవడం, ప్రజలకు వ్యాధి పట్ల అవమాన కల్పించడం, తగు చికిత్సను తీసుకుంటూ వ్యాధిని అదుపు చేయడం లేదా నయం చేసుకోవడం, గ్లాకోమా పట్ల పూర్తి స్థాయి పరిశోధనలు జరపడం, సామాజిక మాధ్యమాల్లో విస్తృత ప్రచారాలు నిర్వహించడం, ముదిరితే చికిత్స కష్టం కావడం లాంటి ప్రచారాలు నిర్వహించాలి. ఐరాస – డబ్ల్యూహెచ్ఓ నివ్దిక ప్రకారం ప్రపంచవ్యాప్తంగా 2.3 శాతం వరకు గ్లాకోమా రోగులు ఉన్నారని, దాదాపు 4.5 మిలియన్ల ప్రజలు చూపును సహితం కోల్పోయి ఉంటారని తెలుస్తున్నది. కంటిలో నిరంతరం నియమిత జల ద్రావాలు ఊరుతూ, కొంత జలం బయటకు కూడా వస్తుంది. ఈ జల ద్రవం ఊరడం తగ్గినపుడు నేత్ర వ్యాధులకు దారి పడుతుంది. వయస్సు, జాతి, బిపీ, షుగర్, ఇతర వ్యాధులు, కుటుంబ నేపథ్యం, హ్రస్వ దృష్టి లాంటి అంశాలపై దీర్ఘకాలిక గ్లాకోమా ఆధారపడి ఉంటుంది.

ప్రపంచ గ్లాకోమా వారోత్సవాల్లో భాగంగా ఉచిత నేత్ర వైద్య శిబికదరాల నిర్వహణ, గ్లాకోమా రోగులకు చికిత్సలు, విద్యాలయాల్లో అవగాహన కార్యక్రమాలు, సామాజిక మాధ్యమాల్లో ప్రచారాలు, ఉపన్యాసాలు లాంటి కార్యక్రమాలను నిర్వహించడం ఉత్తమం. దీపం ఉండగానే ఇల్లు చక్కదిద్దుకున్నట్లు, చూపు ఉన్నప్పుడే తరుచుగా నేత్ర పరీక్షలు నిర్వహించుకుంటూ, భయానక అంధత్వానికి దూరంగా ఉందాం, అందరి కంటి చూపును పువ్వుల్లో పెట్టి కాపాడుదాం.

**డా: బుర్ర మధుసూదన్ రెడ్డి**
**9949700037**

# జనగణనతో తేలనున్న అసలు జనాభా

### జనాభా ప్రాతిపదికన ప్రణాళికలు అవసరం

మన దేశంలో చివరిసారిగా 2011లో జనగణన జరిగింది. మళ్లీ 2021లో జనగణన జరగాల్సి ఉండగా, కరోనా కారణంగా వాయిదా పడిరది. ప్రస్తుత కేంద్ర ప్రభుత్వం నిర్ణయం ప్రకారం 2025 మొదటి త్రైమాసికంలో జనగణన ప్రారంభం కానున్నది. అందుబాటులో ఉన్న ఆధునిక సాంకేతికత, డిజిటల్ గవర్నెన్స్ వల్ల ఏడాదిలోగా పక్రియ సమర్థవంతంగా పూర్తవుతుందని కేంద్ర ప్రభుత్వ వర్గాలు చెప్తున్నాయి. సకాలంలో జనగణన పూర్తయితే దేశంలో జనాభా సంఖ్య తేలనుంది. అందులో స్త్రీపురుష జనాభా వివరాలు వస్తాయి. దీని ఆధారంగా ప్రణాళికలు సిద్దం చేసుకోవాల్సి ఉంటుంది. దీంతోపాటే నియోజకవర్గాల పునర్విభజనకు కూడా మార్గం సుగమం అవుతుందని రాజకీయ పార్టీల ఆశగా ఉంది. ఎలాగూ జనగణన తప్పదు కనుక అనేక కీలక అంశాల పైనా శాశ్వత నిర్ణయాలు తీసుకోవాల్సిన అసవరం ఉంది. దేశం ఎదుర్కొంటున్న సవాళ్లను దృష్టిలో పెట్టుకుని అవసరమైన మేరకు రాజ్యాంగ సవరణలను ఆమోదించుకోవాలి. ఒకేదేశం ఒకేచట్టం ఇందులో ప్రధాన మైనది. జనాభా నియంత్రణ కూడా అంతే ప్రధానమైనది. వనరులు తగ్గిపోతున్న క్రమంలో జనాభా నియంత్రణ లేకుండా సాగితే దేశంలో అరాచకం ప్రబలే ఆస్కారం ఉంది. దీనిని గమనించి కేంద్రం చర్యలు తీసుకుంటే మంచిది.అలాగే కాంగ్రెస్ పార్టీ కులగణనతో దేశంలో విభజన రాజకీయాలు చేస్తోంది. దీనిపైనా స్పష్టత రావాల్సి ఉంది. కులాలను పక్కన పెట్టేలా కఠిన రాజ్యాంగ చర్యలకు ఉపక్ర మించాలి. కులాల పేరుతో దేశాన్ని చీల్చే ప్రక్రియ సరైనది కాదు. ఆధునిక సమాజంలో ఇంకా కులాలను పట్టుకుని వేళ్లాడడం కూడా అంతమంచిది కాదు.

# ఎపి విభజన చట్టం మేరకు సీట్లు పెంచాల్సిందే

### పదేళ్లయినా నేటికీ అమలు కాని నియోజకవర్గాల పెంపు డీలిమిటేషన్‌తో న్యాయం జరుగుతుందా అన్న అనుమానం

న్యూఢిల్లీ, :

ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టం–2014 ప్రకారం.. ఏపీ శాసనసభ స్థానాలను 175 నుంచి 225కు, తెలంగాణ అసెంబ్లీ స్థానాలను 119 నుంచి 153కు పెంచాల్సి ఉంది. ఈ మేరకు అప్పటి మన్మోహన్ సింగ్ ప్రభుత్వం హామీ కూడా ఇచ్చింది. అయితే విభజన హామీలన్నీ గాలికి పోయాయి.ఈ క్రమంలో ఇప్పుడు నియోజకవర్గాల పునర్విభజన కమిషన్ విభజన చట్టాన్ని పరిగణనలోకి తీసుకోవాల్సిన అవసరం ఉన్నది. నియోజకవర్గాల పునర్విభజన సమగ్రంగా జరగాలంటే జనాభాతో పాటు అభివృద్ధి సూచికలు, ప్రాంతాల సరిహద్దులను కూడా తప్పనిసరిగా పరిగణనలోకి తీసుకోవాలి. నియోజక వర్గాల పునర్విభజన చేస్తే అన్ని ప్రాంతాలు, వర్గాల అభిప్రాయాలు తీసుకుంటే మంచిది. అయితే జనాభా ప్రాతిపదికన సీట్లు కేటాయిస్తే తమకు అన్యాయం జరుగుతుందని దక్షిణాది రాష్ట్రాలు గగ్గోలు పెడుతున్నాయి. 1973లో వివిధ రాష్ట్రాలకు ఏ నిష్పత్తి ప్రకారం సీట్లను కేటాయించారో ఆ విధంగానే ఇప్పుడు కూడా అలాంటి నియమాలు, నిబంధనలను పాటించాలని కోరుకుంటున్నాయి.

**ఒకవేళ లోక్‌సభ సీట్లు పెంచాల్సివచ్చినా అదే నిష్పత్తితో అన్ని రాష్ట్రాలకు సమంగా వర్తింప చేయాలని కూడా అంటున్నాయి.**

జనగణన పూర్తయిన వెంటనే నియోజకవర్గాల పునర్విభజన పక్రియను చేపట్టాలి. లోక్‌సభ, శాసనసభల సీట్లకు సంబంధించి గ్రామీణ, నగర ప్రాంతాలను దృష్టిలో పెట్టుకోవాలి. నియోజకవర్గాల పునర్విభజన జరిగి, అందరికీ సమాన ప్రాతినిధ్యం కల్పించాలని సూచిస్తున్నాయి. అందుకు అనుగుణంగా ఇప్పటి నుంచే కేంద్రంలోని మోదీ సర్కార్ జాతీయ, ప్రాంతీయ పార్టీలతో సమాలోచనలు జరిపి వారి అభిప్రాయాలు కూడా తీసుకుంటే మంచిది. 1951 జనగణన లెక్కల ఆధారంగా మొదటిసారి డీలిమిటేషన్ పక్రియ జరిగింది. దేశంలో ఎన్నికల వ్యవస్థకు స్పష్టమైన రూపం తీసుకొచ్చేందుకుగాను మొదటి విడత కసరత్తు జరిగింది. ఆ తర్వాత 1961 జనగణన లెక్కల ఆధారంగా రెండోసారి డీలిమిటేషన్ పక్రియ జరిగింది. తద్వారా స్వాతంత్య్రనంతరం మొదటి దశాబ్దంలో పెరిగిన జనాభా ప్రాతిపదికన నియోజకవర్గాలకు మరింత కచ్చితమైన రూపం తీసుకొచ్చారు. రెండో విడత నియోజకవర్గాల పునర్విభజన ద్వారా లోక్‌సభ స్థానాలను 494 నుంచి 522కు పెంచారు. దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాల శాసనసభల స్థానాలను 3,771గా నిర్ణయించారు. ఆ తర్వాత 1971 జనగణన ఆధారంగా 1973లో మూడో విడత నియోజకవర్గాల పునర్విభజన చేపట్టారు. ఈసారి లోక్‌సభ స్థానాలను 522 నుంచి 543కి పెంచి, అసెంబ్లీల స్థానాలను 3771 నుంచి 3,997గా ఖరారు చేశారు. అంతేకాకుండా 2001 వరకు లోక్‌సభ స్థానాలను యథాతథంగా ఉంచాలని 42వ రాజ్యాంగ సవరణ ద్వారా చేశారు. మళ్లీ మూడు దశాబ్దాల తర్వాత 2001 జనాభా లెక్కల ఆధారంగా 2002 డీలిమిటేషన్ చట్టాన్ని తీసుకొచ్చారు. కానీ, లోక్‌సభ స్థానాల సరిహద్దులను మాత్రమే మార్చి, సీట్ల సంఖ్యను మాత్రం యథాతథంగా కొనసాగించారు. అంతేకాదు, 2026 వరకు డీలిమిటేషన్ పక్రియ చేపట్టకూడదని కూడా నిర్ణయించారు. కొత్త రాష్ట్రాలు ఏర్పడినందున అసెంబ్లీ స్థానాలను మాత్రం 4,123కి పెంచారు. అలాగే 1971 జనగణన ఆధారంగా చేపట్టిన పునర్విభజనతో నిర్ణయించిన లోక్‌సభ సీట్ల సంఖ్య 2026 తర్వాత మొదటిసారి జరిగే జనగణన వరకు యథాతథంగా ఉండాలని 84వ రాజ్యాంగ సవరణ ద్వారా నిర్ణయించారు.

### ఇప్పుడు జనాభా ఆధారంగా

లోక్‌సభ సీట్లు పెంచితే దక్షిణాది రాష్ట్రాల్లో తక్కువ సంఖ్యలో, ఉత్తరాది రాష్ట్రాల్లో ఎక్కువ సంఖ్యలో సీట్లు పెరిగే అవకాశం ఉన్నది. 2026లో జరిగే నియోజకవర్గాల పునర్విభజనలో ఈ అంశం వివాదాస్పదంగా మారే సూచనలూ కన్పిస్తున్నాయి. ఇప్పటికే దక్షిణాది రాష్ట్రాలకు చెందిన అనేక మంది రాజకీయ నాయకులు ఈ అంశంపై గళమెత్తుతున్నారు. 1973లో జరిగిన పునర్విభజన తరహాలోనే రాష్ట్రాలకు లోక్‌సభ సీట్ల సంఖ్యను కేటాయించాలని వారు వాదిస్తున్నారు.

# దేశానికి గర్వకారణం మహిళా క్రీడాకారులు

### భారత కీర్తిపతాకను ఎగరే'స్తున్నవారు ఎందరో త్రిష లాంటి వారికి మరింత ప్రోత్సాహం దక్కాలి

న్యూఢిల్లీ :
క్రీడా రంగంలో ఇటీవలే తెలంగాణకు చెందిన గొంగడి త్రిష తారాజువ్వలా దూసుకుని వచ్చారు. తన స్వయంకృషితో ఆమె అంతర్జాతీయ క్రికెట్‌లో రాణించారు. క్రీడారంగంలో మెరుపులు పూయిస్తున్న ఎందరో మహిళా క్రీడాకారులు భారత కీర్తిపతాకాన్ని ఎగురవేశారు. సానియా మిర్జా,సైనా నెహ్వాల్, పివి సింధు, మేరీ కోమ్,స్మృతి మందాన వంటి వారు ప్రస్తుత సమాజంలో ఇంకా తమ ఆధిపత్యాన్ని కొనసాగిస్తున్నారు. వారు క్రీడారంగంలో చేస్తున్న కృషి భారత ఆత్మగౌరవాన్ని నిలబెట్టింది. క్రికెట్‌లో కూడా తమకు ఎదురు లేదని చూపుతున్నారు.ఇందులో తెలుగమ్మాయి పివి సింధు ఎన్నో అద్భుతాలతో రాణించి పద్మశ్రీని దక్కించుకుంది. ప్రపంచ ఛాంపియన్‌షిప్‌లో స్వర్ణంతో మెరిసిన పి.వి.సింధు కృషి అభినందనీయం. ఆమె ఎలాంటి ప్రోత్సాహం లేకుండానే రాకెట్ పట్టి ఎంతో కఠిన దీక్షతో ఈ దశకు చేరుకుంది.ఈ యజ్ఞంలో ఆమె ఎక్కడా తడబాటుకు గురికాకుండా, ఆత్మస్థయిర్యం కోల్పోకుండా అప్రతిహతంగా ముందుకు సాగిన తీరు అభినందనీయం. ఇంతటి ఘనకీర్తి సాధించడానికి వ్యక్తిగతంగా ఆమె కష్టపడితే ఆమె కష్టానికి తల్లిదండ్రు లు, కోచ్ పుల్లెల గోపీచంద్ తోడ్పడ్డారు. అయితే ఆర్థికంగా కూడా ఆమె ఎన్నో ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వచ్చింది. ఆరుసార్లు ప్రపంచ చాంపియన్‌షిప్ లో పోటీపడినా స్వర్ణం గెలవడం సింధుకు మరచిపోలేని అనుభూతిగా మిగిలింది. పక్కా ప్రణాళికతో సిద్ధమై అనుకున్నది సాధించి, విశ్వకిరీటాన్ని అందుకొన్న తొలి భారత క్రీడాకారిణిగా గణుతికెక్కింది. 'రియో'తో మొదలైన జోరును ఇంకా కొనసాగిస్తున్న సింధు ప్రపంచ టోర్నీ స్వర్ణంతో తన స్థాయిని మరింత పెంచుకుంది. అయితే ఒలంపిక్స్ పట్టికలో మనం ఎప్పుడూ కింది నుంచి ఫస్ట్ ఉండడానికి ప్రయత్నిస్తున్నాం.

సింధులాంటి వారు పతకాలు సాధించారంటే అందులో ప్రభుత్వాల ఘనకార్యం ఏమీ లేదు. త్రిష లాంటి వారు దూసుకు వచ్చినా వారి సొంత కష్టమే. కోనేరు హంపి ఇలా ఎందరో ఉన్నారు. వారు తమ సొంతంగా ఆట నేర్చుకుని మన పరవును నిలబెట్టేందుకు ప్రయత్నించారు. నిజానికి ముందునుంచే ప్రభుత్వాలు వీరిని ప్రోత్సహించి ఉంటే బంగారు కొండల్లా మెరిసేవారు. బేటీ బచావో..బేటీ పడావో నినాదంగా మారరాదు. వీరి స్ఫూర్తిగా తీసుకుని ఆడపిల్లలకు క్రీడల్లో ప్రత్యేక శిక్షణ ఇప్పించాలి. ఆడపిల్లల క్రీడలకు, విద్యకు ఉచిత సౌకర్యాలు, మినహాయింపులు ఇవ్వాలి. అలా చేయడం ద్వారా ఎందరినో తయారు చేసుకోవాలి. త్రిష సాధించిన విజయంతో దేశంలో మహిళా క్రికెట్‌కు మరింత ఊపు వస్తుందనడంలో సందేహం లేదు. సైనాకు తోడు సింధు, కశ్యప్, జ్వాల, అశ్విని లాంటి క్రీడాకారిణులు






కూడా ప్రపంచ స్థాయికి ఎదగడంతో రాకెట్‌కు మరింత ఊపొచ్చింది.అలా అన్ని ప్రభుత్వాలు కూడాక్రీడాకారులను ప్రోత్సహించేలా నిర్ణయాలు ఉండాలి.

### ప్రోత్సాహం అవసరం

**- క్రీడాకారులను ప్రోత్సహించే చర్యలు ముఖ్యం**

భారత్ లాంటి విశాలమైన దేశంలో సవాళ్లు ఉన్నప్పటికీ, గ్రామాల స్థాయిలో క్రీడలకు సంబంధించి మౌలిక సదుపాయాలు మెరుగుపడితే మహిళా అథ్లెట్లు మరింత మంది ముందు కొచ్చే అవకాశం ఉంటుంది. మెరుగైన శిక్షణ, పోషకాహారం లాంటి కారణాలతో ఇప్పటికీ దేశంలో క్రీడలు పట్టణ ప్రాంతాలకే పరిమితం అవుతున్నాయని చాలామంది నిపుణులు అభిప్రాయపడుతున్నారు. చెస్‌కు భారత్‌లో ఉండాల్సినంత ఆదరణ లేదని మహిళా చెస్ క్రీడాకారులు అభిప్రాయపడుతున్నారు. కామన్వెల్త్ గేమ్స్ తర్వాత దేశంలో క్రీడలకు సంబంధించి మౌలిక సదుపాయాలు చాలా మెరుగయ్యాయి. అయిన ప్పటికీ, అంతర్జాతీయ ప్రమాణాలతో పోల్చితే ఇంకా చాలా మెరుగవ్వాల్సి ఉంది. ఇప్పటికీ దేశంలో క్రికెట్‌దే ఆధిపత్యం. అయితే, క్రీడా అభిమానులు, మీడియా పురుషుల క్రికెట్ జట్టుకు ఇచ్చినంత ప్రాధాన్యత, మహిళల జట్టుకు ఇవ్వడంలేదు. క్రికెటర్లకు వచ్చినంత గుర్తింపు ప్రపంచ, ఏషియన్, కామన్వెల్త్ ఛాంపియన్లకు రావడంలేదు. ఖేలో ఇండియా గేమ్స్‌లో బాలికలు పతకాలు సాధిస్తున్నారు. షూటింగ్‌లో పలు అంతర్జాతీయ పతకాలు సాధించిన 17 ఏళ్ల రామ్ కిషన్ భాకెర్ తమకు పెద్దగా ప్రచారం రావడం లేదని అంటోంది. మాలావత్ పూర్ణ లాంటి వారెందరో పర్వతారోహణలో రాణించారు. దేశానికిపేరు తెచ్చారు. ఇలాంటి వారిని ప్రోత్సహించాలి. కొన్ని చిన్న గ్రామాల్లో ఆటల గురించి ఏమాత్రం అవగాహన ఉండదు. పోటీల గురించి కొంతమంది గ్రామీణులకు తెలియదు. కానీ, కాస్త దృష్టి పెడితే ఆ ఊళ్లలోనే మెరుగైన ఆటగాళ్లు దొరుకుతారు. మహిళలు ధైర్యంగా ముందడుగు వేయాలి. అబ్బాయిల్లాగే తాము కూడా క్రీడల్లో రాణించగలమని పోరాడాలి. సాంస్కృతిక, సంప్రదాయ అవరోధాల ను అధిగమించాలి. మహిళలు స్వయం శక్తి దిశగా ఎదిగేలా పథకాలను కేంద్రం తీసుకుని రావాలి. అన్నిరంగాల్లో విజయాలు సాధిస్తున్న మహిళలు ప్రోత్సహిస్తే మరింతగా రాణించగలరు. సానియా మిర్జా, సైనా నెహ్వాల్, పివి సింధు,సాక్షి, మాలావత్ పూర్ణా,గొంగిడి త్రిష ఇలా చెప్పుకుంటూ పోతే ఎందరో మనదేశంలో తమ పిల్లలు అడపిల్లలని చూడడం లేదు. వారిని వెన్నుతట్టి ప్రోత్సహించేందుకు వెనకాడడం లేదు. ఎందరో ఆడపిల్లల తల్లిదండ్రుల తమ పిల్లలను అతి కష్టం మీద చదివిస్తున్నారు. వారికి వెన్నంటి నిలిచి ప్రోత్సహి స్తున్నారు. ఇలాంటి వారికి కేంద్రం ప్రోత్సాహకాలు ప్రకటించాలి. ఫీజులు, విద్యా రుణాలు,క్రీడాంశాల్లో రాయితీలు ఇవ్వాలి.

## బెల్లయ్యనాయక్‌కు..
# ఎమ్మెల్సీ సీటు ఇవ్వాలి

- జిల్లా ఆదివాసి కాంగ్రెస్ అధ్యక్షులు లింగం నాయక్



**ఉమ్మడి మహబూబ్ నగర్ బ్యూరో, మార్చి 06(నినాదం న్యూస్):** రాష్ట్ర ఆదివాసీ కాంగ్రెస్ చైర్మన్ బెల్లయ్య నాయక్ ను ఎమ్మెల్యే కోటాలో ఎమ్మెల్సీ ఇవ్వాలని కేంద్ర పార్టీ అధిష్టానానికి , గౌరవ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి , ఉపముఖ్యమంత్రి , మంత్రులకు జిల్లా ఆదివాసి కాంగ్రెస్ చైర్మన్ లింగం నాయక్ విజ్ఞప్తి చేశారు. జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. గత అసెంబ్లీ , పార్లమెంట్ ఎన్నికల్లో అత్యధిక స్థానాల్లో ఆదివాసి లంబాడీలు ఉన్న ప్రాంతాలలో కాంగ్రెస్ పార్టీని బలపరిచి గెలిపియడం జరిగిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడినంక ఇప్పటివరకు లంబాడీలకు మంత్రి పదవి ఇవ్వలేదన్నారు. ఇంతకుముందు రాజ్యసభ ఎంపీలు, గవర్నర్ కోటా ఎమ్మెల్సీల్లో లంబాడీలకు అవకాశం ఇవ్వలేదని అన్నారు. బెల్లయ్య నాయక్ ఎల్ హెచ్ పి ఎస్ ను స్థాపించి గత 30 సంవత్సరాలుగా లంబాడాలను జాగృతి పరుస్తూ, తెలంగాణ ఉద్యమంలో కీలకంగా పాల్గొన్నారని , ఆదివాసి కాంగ్రెస్ బాధ్యతలను నిర్వహిస్తూ నిరంతరం లంబాడి జాతినీ రాజకీయ చైతన్యం కల్పిస్తూ, లంబాడి గిరిజన జాతులకు కాంగ్రెస్ విధివిధానాలను తెలుపుతూ ముందుకు వెళ్తున్నారుని అన్నారు. బెల్లయ్య నాయక్ కు ఎమ్మెల్యేల కోటాలో ఎమ్మెల్సీ గా ఇచ్చి లంబాడలకు న్యాయం చేయాలని కోరారు. సమావేశంలో పట్టణ ఆదివాసీ కాంగ్రెస్ చైర్మన్ రవి నాయక్ , మండల ఆదివాసి కాంగ్రెస్ చైర్మన్ తులసి రామ్, జిల్లా ఆదివాసి కాంగ్రెస్ కోఆర్డినేటర్ రామచందర్ నాయక్ , పట్టణ ఆదివాసీ కాంగ్రెస్ వైస్ చైర్మన్ హరి నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## సాయిస్ఫూర్తిలో ఘనంగా మహిళా దినోత్సవ వేడుకలు



**సత్తుపల్లి, మార్చి 08 (నినాదం న్యూస్):** ప్రాంగణంలో బిటెక్ , డిప్లొమా, ఎం.బి.ఏ కళాశాల విద్యార్థులు మహిళాసాధికారత సంస్థ వారి సంయుక్తాద్వార్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిధిగా చైర్ పర్సన్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఊటుకూరి శేషారత్నకుమారి పాల్గొని స్వాగతోపన్యాసం చేశారు. ఈ సందర్భంగా శేషారత్నకుమారి మాట్లాడుతూ చదువుల్లో, ఆటల్లో, తెలివితేటల్లో, దేశరక్షణలో, ఆధునిక టెక్నాలజీలో అందరితో పోటీ పడే ఆడపిల్లలు లోకంలో ఎదురైయ్యే సమస్యల గురించి తెలుసుకోవాలన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాని పురస్కరించుకొని కళాశాల విద్యార్థులకు సాంస్కృతిక కార్యక్రమాలల్లో పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కళాశాల మహిళాసాధికారత సంస్థ కన్వీనర్ శ్రీమతి రాచమళ్ళ.శ్రీదేవి మాట్లాడుతూ నేటి మహిళలు అన్నీరంగాల్లో రాణిస్తున్నారని సమాజ అభ్యున్నతికి మహిళల తోడ్పాటు ఎంతో అవసరమని మహిళా చదువు సమాజానికి ముఖ్యమని, విద్యా వికాసానికి, తల్లి పాత్రకు చాలా ప్రాధాన్యత ఉందన్నారు. దాసరి ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ నేటి మహిళలకు విద్య, ఉపాధి మొదలగు అన్నిరంగాల్లో సమానావకాశాలు ద్వారా దేశం ఆర్థికాభివృద్ధి జరుగుతుందని అన్నింటిలో సమానత్వం కల్పించాలని అన్నారు. భారతీయ సమాజంలో స్త్రీ పాత్ర చాలా గొప్పది. సామాన్య కుటుంబాన్ని నడిపించే అమ్మ నుంచి దేశాన్ని పాలించే ప్రభుత్యాధినేత్రులు, కార్పొరేట్ రంగంలో దూసుకుపోతున్న ధీరవనితలు, వాణిజ్య భారతంలో వెలుగొందుతున్న అతివలు, క్రీడా రంగంలో కాంతులీనుతున్న క్రీడామణులు, బహుళజాతి కంపెనీలకు అధిపతులు వరకు ఉన్నారన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఎన్.ఎస్.ఎస్. సీతారాములు అసిస్టెంట్ ప్రొఫెసర్, కళాశాల మహిళాసాధికారత సంస్థ ట్రస్టీ సిహెచ్.లీలావతి, మెంబర్స్ యం.ప్రతిమ, సుధారాణి, నాగలక్ష్మి, విద్యార్థినులు, మహిళా ఉద్యోగినీలు పాల్గొన్నారు.

## జవహర్‌లాల్ మృతికి నివాళులు



**ఖమ్మం, మార్చి 08(నినాదం న్యూస్):** మాజీ ఎమ్మెల్యే బానోత్ మదనలాల్ సోదరుడు డీస్పీ జవహర్‌లాల్ నిన్న రోడ్డు ప్రమాదంలో మృతిచెందగా ఖమ్మం నియోజకవర్గం పరిధిలోని రఘునాథపాలెం మండలం ఈర్లపూడి గ్రామంలో మృతదేహానికి పూలమాల వేసి నివాళులు అర్పించిన మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ జవహర్‌లాల్ మృతి వారి కుటుంబానికి తీరని లోటని కుటుంబ సభ్యులను ఓదార్చి వారి ఆత్మకు శాంతి చేకూరాలని దేవుణ్ణి ప్రార్థించారు.

## తెలంగాణ ఎంపీల సమావేశంలో..
# జిల్లాల అంశాలపై చర్చించిన ఖమ్మం ఎంపీ




**ఖమ్మం మార్చి08( నినాదం న్యూస్):** కేంద్ర ప్రభుత్వం వద్ద రాష్ట్రానికి సంబంధించి పెండింగ్ లో ఉన్న సమస్యల పరిష్కారానికి శనివారం హైదరాబాద్ లోని ప్రజా భవన్ లో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అధ్యక్షతన నిర్వహించిన తెలంగాణ ఎంపీల సమావేశంలో ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురాం రెడ్డి మాట్లాడారు. మొత్తం 28 అంశాలపై చర్చలు జరిగి ప్రతిపాదనలు రూపొందించగా.. ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలకు సంబంధించిన కీలక అంశాలపై రఘురాం రెడ్డి ప్రస్తావన తెచ్చారు.

## విద్యార్థినుల రక్షణకు..
# కఠినచట్టాలు అమలుకావాలి

- జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి మాజీ సూపరింటెండెంట్ ప్రతిమా రాజ్



**నిజామాబాద్ ప్రతినిధి, మార్చి 8 (నినాదం న్యూస్):** అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుంటూ ఆల్ ఇండియా స్టూడెంట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిజామాబాద్ జిల్లా ప్రెస్‌క్లబ్‌లో సెమినార్ నిర్వహించారు. ఈ సెమినార్ లో జిల్లా ప్రధాన కార్యదర్శి జ్వాలా ప్రముఖ మహిళ నారీమణులను ఆహ్వానించారు. నిజామాబాద్ ప్రభుత్వాసుపత్రి మాజీ సూపరింటెండెంట్, ప్రభుత్వ పాఠశాల హెచ్ఎం వీరలక్ష్మి, సీతాదేవి, కేజీబీవీ స్పెషల్ ఆఫీసర్ ను ఆహ్వానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహిళలకు రక్షణ కు సంబంధించి కరాటే శిక్షణ ఇస్తున్నటువంటి మాస్టర్‌ల ద్వారా సలహాలు, సూచనలు,అదేవిధంగా మహిళల విద్యార్థినుల ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలని, సమాజంలో అంతా త్వరగా ఎవరిని నమ్మి మోసపోవద్దని సూచించారు. ఈ కార్యక్రమంలో నిజామాబాద్ జిల్లా కమిటీ గర్ల్స్ అధ్యక్షురాలు మేఘన, సహాయ కార్యదర్శి అప్పు, ఉపాధ్యక్షురాలు వల్లి, అదేవిధంగా కోశాధికారి ప్రవళిక, విద్యార్థులు పాల్గొన్నారు.

# రాజీమార్గమే రాజమార్గం..

- జిల్లా ప్రధాన న్యాయమూర్తి, న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ రాజగోపాల్
- జిల్లా కోర్టులో జాతీయ లోక్ అదాలత్ నిర్వహించిన జిల్లా ప్రధాన న్యాయమూర్తి

**ఖమ్మం, మార్చి08(నినాదం న్యూస్):**



రాజీమార్గమే రాజా మార్గమని, రాజీ పడదగ్గ కేసులలో రాజీ పడి సత్వర న్యాయం పొందాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి, న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ జి. రాజగోపాల్ అన్నారు. శనివారం చేపట్టిన జాతీయ లోక్ అదాలత్ పురస్కరించుకుని సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన న్యాయమూర్తి మాట్లాడుతూ, లోక్ అదాలత్ లను కక్షిదారులు సద్వినియోగం చేసుకోని త్వరితగతిన కేసులను పరిష్కరించుకోవాలని అన్నారు. రాజీ మార్గంలో కక్షిదారులు లోక్ అదాలత్ లను సద్వినియోగం చేసుకొని తమ కేసులను శాంతియుతంగా పరిష్కరించుకోవాలన్నారు. కేసులను రాజీతో ముగించేందుకు ఇలాంటి లోక్ అదాలత్ లు ఉపయోగ పడతాయన్నారు. ఎలాంటి ఫీజు లేకుండా న్యాయ సేవా సంస్థ సహకారంతో కేసులను పూర్తి చేసుకోవచ్చని ఆయన తెలిపారు. కేసులు రాజీ చేసుకోవడం ద్వారా అప్పీలు చేసుకోవడం ఉండదని, కోర్టు చుట్టూ తిరిగితే సమయం, డబ్బు వృధా అవుతుందని, కేసుల పరిష్కారంతో మానసిక ప్రశాంతత చేకూరుతుందని, లోక్ అదాలత్ ద్వారా కేసులను త్వరితగతిన పరిష్కరించుకోవాలని ప్రధాన న్యాయమూర్తి అన్నారు.

గత లోక్ అదాలత్ ద్వారా జిల్లాలో 10 వేల 500 కేసులు పరిష్కరించినట్లు, హైకోర్టు ఆదేశాల మేరకు ఈ లోక్ అదాలత్ లో 12 వేల కేసులు పరిష్కారానికి లక్ష్యంగా నిర్దేశించినట్లు, భాగస్వాములందరూ లక్ష్య సాధనకు శక్తివంచన లేకుండా కృషి చేయాలన్నారు. లోక్ అదాలత్ పురస్కరించుకుని జిల్లాలోని కోర్టుల్లో 9 లోక్ అదాలత్ ప్రత్యేక బెంచ్లుఏర్పాటుచేస్తామన్నారు. క్రిమినల్ కాంపౌండబుల్ కేసులు, సివిల్ తగాదా కేసులు, ఆస్తి విభజన కేసులు, వైవాహిక జీవితానికి సంబంధించిన కేసులు, బ్యాంక్ రికవరీ, విద్యుత్ చౌర్యం, చెక్ బౌన్స్ కేసులు, రోడ్డు ప్రమాదం, డ్రంక్ అండ్ డ్రైవ్, పెట్టి కేసులు, ఇతర రాజీపడ్డ దగిన కేసుల్లో కక్షిదారులు రాజీ పడాలని ప్రధాన న్యాయమూర్తి తెలిపారు.లోక్ అదాలత్ ద్వారా రాజీ మార్గంలో కేసుల పరిష్కారంతో కక్షిదారుల మధ్య సుహృద్భావ వాతావరణం తో పాటు, గ్రామాల్లో ప్రశాంతత నెలకొంటుందని ప్రధాన న్యాయమూర్తి తెలిపారు. లోక్ అదాలత్ లో ఒకరు గెలవడం, ఒకరు ఓడడం ఉండదని, ఇద్దరు విజేతలేనని ప్రధాన న్యాయమూర్తి అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకుని శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా లోక్ అదాలత్ కేసులకు సంబంధించి ప్రమాదంలో భర్త మరణించిన వసంతకు 14 లక్షల సెటిల్ మెంట్ కు సంబంధించి, ఉషారాణి-శివల ఫ్యామిలీ కేసుకు సంబంధించి ప్రధాన న్యాయమూర్తి ఉత్తర్వులు అందజేశారు. ఈ కార్యక్రమంలో మొదటి అదనపు జిల్లా సెషన్స్ న్యాయమూర్తి కె. ఉమాదేవి, న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి చంద్రశేఖర రావు, బార్ అసోసియేషన్ అధ్యక్షులు నెరేళ్ల శ్రీనివాసరావు, న్యాయమూర్తులు, న్యాయవాదులు పాల్గొన్నారు.

# సమానత్వం కోసం ఉద్యమించాలి



**నిజామాబాద్ ప్రతినిధి, మార్చి 8 (నినాదం న్యూస్):** స్త్రీ లేనిదే జననం లేదు, స్త్రీ లేనిదే సృష్టి లేదని అలాంటి స్త్రీ నేటికీ సమానత్వాన్ని అందుకోలేకపోతున్నదని, ఆమె పట్ల ఆధునిక యుగంలోనూ అడుగడుగునా అవమానం వివక్షత కొనసాగుతున్నదని విద్యావేత్త డాక్టర్ నాగేశ్వరరావు అన్నారు. తెలంగాణ ఆల్ పెన్షనర్స్ ఆధ్వర్యంలో శనివారం మల్లు స్వరాజ్యం ట్రస్ట్ భవనంలో జరిగిన అంతర్జాతీయ మహిళా దినోత్సవానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. మహిళలు తమకు ఓటు హక్కు కావాలని, సమాన పనికి సమాన వేతనం, పని గంటలు తగ్గించాలని పోరాటం చేసిన ఫలితంగా మహిళా దినోత్సవం వచ్చిందని ఆయన అన్నారు. జిల్లా నాయకులు ఈ.వి.ఎల్ నారాయణ అధ్యక్షతన జరిగిన ఈ సభలో జన విజ్ఞానవేదిక నాయకులు విజయానందరావు మాట్లాడుతూ మహిళలు అంటే కేవలం వంటింటికే పరిమితం కాదని, అనేక రంగాల్లో తాము సైతం మగ వారితో సమానంగా రాణిస్తున్నారని అన్నారు. జిల్లా నాయకులు నరేందర్ మాట్లాడుతూ ఆమె అడుగడుగునా అవమానాలను ఎదుర్కొంటుందని, శతాబ్దాల కాలంగా సమానత్వ సాధనకై వివిధ ఆర్థిక, రాజకీయ రంగాలలో మహిళలు సాధించిన విజయానికి ఇది ప్రతీకని అంతర్జాతీయంగా ఏంతో ఘనంగా నిర్వహిస్తున్నారని అన్నారు. మనదేశంలో మహిళలకు నాటి నుండి నేటిదాకా పనికి గుర్తింపు, విలువ కట్టని సమాజం ఉందని ఆయన అన్నారు. ఈ సందర్భంగా పలువరు మహిళలను ఘనంగా సన్మానించారు. ఈ సమావేశంలో పుష్పవల్లి, దీన సుజాన, స్వర్ణలత, ఎలిజిబెత్, కళావతి, శిర్ప హనుమాన్లు, ఎస్ ప్రసాదరావు, భోజారావు , రామ్మోహన్ , మదన్ మోహన్, తదితరులు పాల్గొన్నారు.

## జనసేన పార్టీ ఉత్సవాలను..
# విజయవంతం చేయండి




- జనసేన పార్టీ ఖమ్మం అసెంబ్లీ నియోజకవర్గ ఇన్చార్జ్ మిరియాల రామకృష్ణ

**ఖమ్మం, మార్చి08( నినాదం న్యూస్):** ఈనెల 14న జనసేన పార్టీ అధినేత , ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ సొంత ఊరైన పిఠాపురంలో జనసేన పార్టీ 12 వసంతాలు పూర్తి చేసుకుంటున్న సందర్భంగా జరిగే ఉత్సవాలకు సంబంధించిన వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు . ఈ సందర్భంగా జనసేన పార్టీ ఖమ్మం అసెంబ్లీ నియోజకవర్గ ఇన్చార్జ్ మిరియాల రామకృష్ణ విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఆనాడు శ్రీ పవన్ కళ్యాణ్ ఎలాంటి సిద్ధాంతంతో పార్టీని స్థాపించారో నేటికీ కట్టుబడి అదేవిధంగా ఉందని.. పార్టీ స్థాపించిన నాటి నుండి తనదైన శైలిలో ప్రజా గలాన్ని వినిపిస్తూ సమస్య పరిష్కారం కోసం ప్రశ్నిస్తూ పరిష్కార మార్గం చూపెట్టడం జరిగిందని ఆనాటి పరిస్థితుల వల్ల ప్రజాక్షేత్రంలో ఓడిపోయిన , వెనకడుగు వేయక విజయం అంటే ఇలా ఉండాలి అని దేశ ప్రజలు తన వైపు చూసేలా జనసేన పార్టీని ముందుకు తీసుకెళ్తున్నారన్నారు. ఆవిర్భావ సభకు ఖమ్మం అసెంబ్లీ జనసేన పార్టీ శ్రేణులు మరియు యువత అధిక సంఖ్యలో పాల్గొని అధినేత ఇచ్చే సందేశాన్ని నిశితంగా గమనించి ప్రజలకు చేరవేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు మిరియాల జగన్మోహన్ , బండారు రామకృష్ణ , ఖమ్మం నగర అధ్యక్షులు మేడాబోయిన కార్తీక్ , ఉపాధ్యక్షులు బానోతు దేవేందర్ , తుడుముత్తం రాజ్ , పుల్లారావు , రమణ , అఖిల్ , రచ్చ నాగరాజు , వంశీ , నాగేశ్వరావు , జనసేన పార్టీ నాయకులు , వీర మహిళ విభాగ అధ్యక్షులు షేక్ హసీనా , విద్యార్థి విభాగ నాయకులు విజయ్ మరియు జన సైనికులు పాల్గొన్నారు.

# జర్నలిస్ట్ కుటుంబానికి ఆర్థికసాయం



**మేడ్చల్ మల్కాజిగిరి,, మార్చి08(నినాదం న్యూస్):** కాప్రా ఏరియా సీనియర్ జర్నలిస్టుగా పనిచేస్తున్న కమల్ సంతోష్ కుమార్ అకాల మృతి పట్ల కాప్రా ప్రెస్‌క్లబ్ సభ్యులు సంతాపం తెలిపారు. శనివారం మృతుడి కుటుంబ సభ్యులను ఓదార్చి, సానుభూతి తెలిపారు. కాప్రా ప్రెస్ క్లబ్ నుండి కొంత ఆర్థిక సహాయాన్ని సంతోష్ కుమార్ కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా కాప్రా ప్రెస్ క్లబ్ సభ్యులు మాట్లాడుతూ సంతోష్ మృతి బాధాకరమని పేర్కొంటూ ఆయన కుటుంబానికి అన్ని విధాల అండగా ఉంటామని తెలిపారు. కాప్రా ప్రెస్ క్లబ్ అధ్యక్ష కార్యదర్శులు పటేల్ నరసింహ యాదవ్, డి కిరణ్ కుమార్, కోశాధికారి యాట రాజు, కాప్రా ప్రెస్ క్లబ్ సభ్యులు బెలిదే అశోక్, ఎం పల్లి పద్మా రెడ్డి, గుమ్మడి హరిప్రసాద్, కె వెంకటేష్ , కీర్తి శ్రీనివాస్, జి శ్రీనివాసరావు, జి రోజా రాణి, వి రామచంద్ర మూర్తి, వి రవి, గంగి కృష్ణ, పి దిలీప్ కుమార్, డి శ్రీనివాసరావు, జి ఆంజనేయులు, ఎన్ నరేష్ తదితరులు పాల్గొన్నారు.

## అద్దంకి దయాకర్‌కు
## ఎమ్మెల్సీ పదవి ఇవ్వాల్సిందే..

- మాల మహానాడు జిల్లా నాయకులు ఏర్పుల ఆనంద్ డిమాండ్



**చేవెళ్ల, మార్చి 08 (నినాదం న్యూస్):** ఉద్యమ నాయకుడు కష్టకాలంలో కాంగ్రెస్ పార్టీకి అండగా ఉండి, పార్టీని నిలబెట్టిన అద్దంకి దయాకర్ కు ఎమ్మెల్సీ పదవి ఇవ్వాలని మాల మహానాడు జిల్లా నాయకులు ఏర్పుల ఆనంద్ డిమాండ్. ఆదివారం చేవెళ్ల పట్టణ కేంద్రం నినాదం న్యూస్ పాత్రికేయులతో మాట్లాడుతూ.. పదేళ్లు ప్రతిపక్షంలో కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తీసుకొచ్చేందుకు అహర్నిశలు కృషిచేసిన వ్యక్తులలో మొదటి వ్యక్తి అద్దంకి దయాకర్ అని కాంగ్రెస్ పార్టీ గెలుపే లక్ష్యంగా అలుపెరుగని పోరాటం చేసిన ఉద్యమకారుడు..తనకు కేటాయించిన సీటును సైతం మందుల సామెల్ కు త్యాగం చేసిన త్యాగమూర్తి,పదవుల కోసం పార్టీలు మారే ఈ రోజుల్లో పార్టీ నిర్ణయం శిరోధార్యం,అని క్రమశిక్షణను కలిగిన వ్యక్తి అన్నారు. కాంగ్రెస్ పార్టీలో కష్టపడ్డ వారికి ప్రథమ స్థానం పదవులు దక్కుతాయని అధిష్టానం సైతం పదే పదే నేపథ్యంలో అద్దంకిని అధిష్టానం ఎమ్మెల్సీ పదవి ఇవ్వాలని పేర్కొన్నారు.

## ముదిరాజ్ భవన్‌లో..
## మహిళా దినోత్సవం వేడుకలు



**అల్వాల్, మార్చి 8 (నినాదం న్యూస్):** అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకునిఅఖిల భారత ముదిరాజ్ మహాసభ అధ్యక్షులు శ్రీ కాసాని జ్ఞానేశ్వర్ ముదిరాజ్. జాతీయ ప్రధాన కార్యదర్శి శ్రీ కాసాని విరేష్ ముదిరాజ్ ఆదేశాల మేరకు,న్యూ బోయి గూడ ముదిరాజ్ భవన్ లో రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు శ్రీమతి మేకల శారదా ముదిరాజ్ గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షురాలు, శ్రీమతి మాలతి ముదిరాజ్ , ఆధ్వర్యం లో గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షులు శ్రీ తొట్లా సురేందర్ ముదిరాజ్ రాష్ట్ర యువత అధ్యక్షులు శ్రీ శ్రీకాంత్ ముదిరాజ్ పరివేక్షణాలో ఘనంగా నిర్వహించారు. మల్కాజిగిరి నియోజక వర్గం నుండి ,తెలంగాణ రాష్ట్ర ముదిరాజ్ మహా సభ మల్కాజిగిరి నియోజక వర్గం అధ్యక్షులు శ్రీ ఈట లక్ష్మి నారాయణ ముదిరాజ్ ఆధ్వర్యంలో అల్వాల్ డివిజన్ అధ్యక్షులు వెంకన్న ముదిరాజ్ 137 డివిజన్ అధ్యక్షురాలు సుజాత ముదిరాజ్,140 డివిజన్ అధ్యక్షురాలు, కొండం సరస్వతి ముదిరాజ్సుకన్య ముదిరాజ్, 138 డివిజన్ ప్రధాన కార్యదర్శి,చంద్ర శేఖర్ ముదిరాజ్,137 డివిజన్ ప్రధాన కార్యదర్శి,దినేష్ ముదిరాజ్, మురళీ ముదిరాజ్,మల్కాజిగిరి నుండి భారీ సంఖ్యలో ముదిరాజ్ కుల పాల్గొన్నారు కార్యక్రమంలో ఈట లక్ష్మి నారాయణ ముదిరాజ్, చింతల శ్రీశైలం ముదిరాజ్ ప్రధాన కార్యదర్శి మల్కాజిగిరి నియోజకవర్గం సభ్యులు పాల్గొన్నారు

## పోరాటం ద్వారానే మహిళలు..
# తమ హక్కులను సాధించుకోవాలి

- టీజీవో రాష్ట్ర అధ్యక్షుడు ఏలూరి శ్రీనివాసరావు



**ఖమ్మం, మార్చి08( నినాదం న్యూస్):** మహిళలు పోరాటం ద్వారానే తమ హక్కులను సాధించుకోవాలని టీజీవో రాష్ట్ర అధ్యక్షుడు ఏలూరు శ్రీనివాస్ రావు అన్నారు. శనివారం అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని టీఎన్జీవోస్ యూనియన్ మహిళా విభాగం ఆధ్వర్యంలో ఘనంగా మహిళా దినోత్సవ వేడుకలు టిఎన్జీవోస్ ఫంక్షన్ హాల్లో మహిళా దినోత్సవంను పురస్కరించుకొని పెద్ద ఎత్తున మహిళా ఉద్యోగులు పాల్గొన్నారు ఉదయం నుండి సాయంత్రం వరకు క్రీడా సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించి ఆహ్లాదకర వాతావరణంలో ఆనందించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా టీజీజెఎసి సెక్రెటరీ జనరల్ , టిజిఓ రాష్ట్ర అధ్యక్షులు ఏలూరి శ్రీనివాసరావు పాల్గొని మహిళలు పోరాటం ద్వారానే తమ హక్కులను సాధించుకుంటారని అన్ని రంగాల్లో ముందుంటున్నారని ఇదే ఒరవడి కొనసాగించి తమ సామర్థ్యం నిరూపించుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలోటిఎన్జీవోస్ మహిళా విభాగం చైర్ పర్సన్ జి.మృదుల, కన్వీనర్ బి.వి. సుబ్బమ్మ టీఎన్జీవోస్ యూనియన్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు గుంటుపల్లి శ్రీనివాసరావు, కొనిదెన శ్రీనివాస్, ట్రెజరర్ వల్లపు వెంకన్న, ఉపాధ్యక్షురాలు లలిత కుమారి, జాయింట్ సెక్రెటరీ శీలం రాధికా రెడ్డి కార్యవర్గ సభ్యురాలు నెల్లూరి విజయ,నాగలక్ష్మి,మహిళా విభాగం కార్యవర్గం వెంకటమ్మ, భావన వెన్నెల, కోమలి,శ్రావణి, సుజాత,జోష్న ,హసీనా, వసంత, రమ్య, రాంబాయి, షేక్ జరీనా, పద్మావతి, శ్యామల, లక్ష్మి, మాధురి, నాగలక్ష్మి, ఫాతిమా ఫార్వీన్ ,మాణిక్యం, రమాదేవి, పార్వతి, హిమబిందు మొదలగువారు పాల్గొన్నారు.

## 10 నుండి ఇంటర్ సంస్కృతం మూల్యాంకనం ప్రారంభం

**నిజామాబాద్ ప్రతినిధి, మార్చి 8(నినాదం న్యూస్):** మార్చి 10వ తేదీ నుండి ఇంటర్ సంస్కృతం జవాబు పత్రాల మూల్యాంకనం ప్రారంభమవుతుందని జిల్లా ఇంటర్ విద్యా ఆధికారి తిరుమలపుడి రవికుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్ జిల్లా విద్య అధికారి కార్యాలయం లోని మూల్యాంకన కేంద్రంలో సంస్కృతం బోధించే అధ్యాపకులు అందరూ ఉదయం తొమ్మిదిన్నర గంటలకు రిపోర్ట్ చేయాలని ఆదేశించారు. అన్ని ప్రైవేట్ కళాశాలలో సంస్కృతం బోధిస్తున్న అధ్యాపకులు వెంటనే తమ కాలేజ్ లాగిన్ ల నుండి నియామక పత్రాలను ప్రింట్ తీసుకొని పదవ తేదీన మూల్యాంకన కేంద్రంలో రిపోర్టు చేయాలని ఆదేశించారు. మూల్యాంకనం చేసేందుకు అధ్యాపకులను వెంటనే ఆయా కళాశాలల ప్రిన్సిపాల్ లు రిలీవ్ చేయాలని జిల్లా ఇంటర్ విద్యా అధికారి ఆదేశించారు. సంస్కృతం బోధించే అధ్యాపకులను వెంటనే రిలీవ్ చేయని కళాశాలల కరస్పాండెంట్, ప్రిన్సిపాల్ ల పై ఇంటర్ బోర్డు కమిషనర్ ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటామని జిల్లా ఇంటర్ విద్య అధికారి స్పష్టం చేశారు.

## ఘనంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు



**ఆళ్లపల్లి, మార్చి 8, నినాదం న్యూస్ :** మహిళలు అన్ని రంగాల్లో ముందంజలో ఉండాలని ఆళ్లపల్లి గ్రామపంచాయతీ కార్యదర్శి శిరీష ఆకాంక్షించారు. శనివారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మండల కేంద్రంలోని గ్రామపంచాయతీ కార్యాలయంలో మహిళలకు వివిధ అంశాల్లో పోటీలు నిర్వహించి కృషి ఆట, పాటలను పొదుపు సంఘాల మహిళలతో ఆడించి ప్రోత్సాహక ప్రథమ బహుమతి పద్మకు అందజేశారు. ఈ కార్యక్రమంలో వివోలు సుభద్ర, వెంకటలక్ష్మి, అంగన్వాడీ టీచర్ బాయమ్మ, ఆశ వర్కర్ సుగుణ, రుక్మిణి,కుమారి, ప్రమీల, చిట్టెమ్మ, రాజ్యలక్ష్మి, లక్ష్మీకాంత, పారిశుద్ధ్య కార్మికుల అధ్యక్షులు ప్రభుదాస్ తదితరులు పాల్గొన్నారు.

## స్నేహ సొసైటీలో..



**నిజామాబాద్ ప్రతినిధి, మార్చి 8(నినాదం న్యూస్) :** ఉమెన్స్ హెల్పింగ్ హాండ్స్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా స్నేహ సొసైటి స్కూల్ లో 80మంది విద్యార్థులందరికీ అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. శనివారం పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయులు, ఆయాలను సన్మానించారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు జ్యోతి మాట్లాడుతూ మహిళా దినోత్సవం పురస్కరించుకొని అన్నదాన కార్యక్రమం, విద్యార్థులకు బిస్కెట్లు, స్వీటులు పంచడం ఆనందంగా ఉందన్నారు. ఇలాంటి సేవా కార్యక్రమాలు మరెన్నో ఉమెన్స్ హెల్పింగ్ హాండ్స్ ఆధ్వర్యంలో సభ్యులు కలిసి నిర్వహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉమెన్స్ హెల్పింగ్ హాండ్స్ సభ్యులు మహిళా ఉపాధ్యాయినులు సిహెచ్. వరలక్ష్మి, సుచరిత, సునీత, సుజని, ప్రయాగ, ధనలక్ష్మి పాల్గొన్నారు.

## మహిళలకు అన్ని రంగాల్లో సముచిత స్థానం దక్కాలి



**వనపర్తి ప్రతినిధి, మార్చి 8 (నినాదం న్యూస్) :** మహిళలకు అన్ని రంగాల్లో సముచిత స్థానం దక్కాలని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు గుంద్రాతి రాజేష్ గౌడ్, మాజీ కోఆప్షన్ సభ్యుడు ఎండి.మతిన్ ఆశాభావం వ్యక్తం చేశారు. శనివారం వనపర్తి జిల్లా గోపాల్ పేట మండల కేంద్రంలోని కేజీటి పబ్లిక్ స్కూల్ లో మహిళా దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు.ఈ సందర్భంగా ఆ పాఠశాల మహిళ ఉపాధ్యాయులను వారు శాలువాలతో ఘనంగా సన్మానించారు. అనంతరం వారు మాట్లాడుతూ ఎంతటి క్లిష్టమైన పరిస్థితిలోనైనా ఎదుర్కునే శక్తి మహిళకు ఉందని, అటువంటి మహిళకు ప్రతి ఒక్కరు గౌరవించవలసిన అవసరం ఎంతైనా ఉందని వారన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ కె.భావన, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

## రోడ్డును చదును చేయించిన మున్సిపల్ కమిషనర్

### -కృతజ్ఞతలు తెలిపిన కాలనీవాసులు



**వనపర్తి ప్రతినిధి, మార్చి 8 (నినాదం న్యూస్) :** వనపర్తి జిల్లా కేంద్రంలోని చిట్యాల రోడ్డులో ఉన్న ఆదర్శనగర్ డబుల్ బెడ్రూం కాలనీ ప్రధాన రోడ్డును శనివారం మునిసిపల్ సిబ్బంది జెసిబి తో చదును చేశారు. వర్షాకాలంలో ఈ కాలనీ రోడ్డు బురదమయంగా మారడంతో రోడ్డుపై రాళ్ల మొరం వేశారు. రాళ్లు అధికంగా ఉండడంతో ఆ రోడ్డుపై వాహనదారులు, ప్రజలకు రాకపోకలకు ఇబ్బందిగా మారింది. దీంతో కాలనీవాసులు ప్రత్యామ్నాయ మార్గంలో వస్తున్నారు. రోడ్డు సమస్యను శాశ్వతంగా పరిష్కారం చేయాలని కాలనీ అభివృద్ధి కమిటీ నాయకులు మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు ను కోరారు. స్పందించిన కమిషనర్ శనివారం జెసిబి ని కాలనీకి పంపించి రోడ్డును చదును చేసి రాళ్లను తొలగించారు. రోడ్డుపై వాహనాలు వెళ్లినప్పుడు దుమ్ము రాకుండా, రోడ్డు అణిగేందుకు నీళ్ల ట్యాంకర్ ను పంపించి రోడ్డుపై పోయించారు. దీంతో ప్రజలు ఈ రోడ్డుపై వెళ్లేందుకు సౌకర్యం కలిగినట్లైంది. అడిగిన వెంటనే స్పందించిన కమిషనర్ వెంకటేశ్వర్లు కు కాలనీ అభివృద్ధి కమిటీ నాయకులు కృతజ్ఞతలు తెలిపారు

## పలు వేడుకలకు హాజరైన మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి




**వనపర్తి ప్రతినిధి, మార్చి 8 (నినాదం న్యూస్)** వనపర్తి జిల్లా గోపాల్ పేట మండల కేంద్రంలోని కండక్టర్ కృష్ణయ్య కూతురు పతానం కార్యక్రమానికి శనివారం రాష్ట్ర మాజీ వ్యవసాయ శాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా అమ్మాయిని ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరణ్ణ పెద్దమందడి మండలం చిన్నమందడి గ్రామానికి చెందిన రామకృష్ణ యాదవ్ కూతురు హరిత వివాహ పతానం కార్యక్రమానికి మాజీ మంత్ణి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి హాజరై అమ్మాయిని ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలిపారు. మాజీ మంత్రి వెంట బీఆర్ఎస్ పార్టీ చిన్నమందడి నాయకులు, గోపాల్ పేట నాయకులు, పార్టీ శ్రేణులు పాల్గొన్నారు

## సీసీ రోడ్డు పనులు పరిశీలించిన కాంగ్రెస్ నేత కృష్ణ



**వనపర్తి ప్రతినిధి, మార్చి 8 (నినాదం న్యూస్):** వనపర్తి జిల్లా కేంద్రంలోని గాంధీ నగర్ 19వ వార్డులో జరుగుతున్న సీసీ రోడ్డు పనులను శనివారం వార్డు కాంగ్రెస్ నాయకులు ఎల్ ఐసి కృష్ణ యాదవ్ పరిశీలించారు. ఈ వార్డులో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులు పూర్తి కావడంతో సీసీ రోడ్డు పనులు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఆయన సీసీ రోడ్డు పనులను పరిశీలించారు. పనులు నాణ్యవంతంగా చేయాలని, ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని కాంట్రాక్టర్ ను ఆయన కోరారు. సీసీ రోడ్డు పనులకు నిధులు మంజూరు చేసిన ఎమ్మెల్యేకు వార్డు ప్రజల తరపున ఆయన కృతజ్ఞతలు తెలిపారు

## వధూవరులను ఆశీర్వదించిన మాజీ ఎమ్మెల్యే పెద్ది



**నర్సంపేట, మార్చి 7(నినాదం న్యూస్ ):** నర్సంపేట డివిజన్ నల్లబెల్లి మండలం గుండ్ల పహాడ్ ( బజ్జుతండ) గ్రామ బిఆర్ఎస్ పార్టీ నాయకులు జాటోతు సుధాకర్- రజిత కుమారుడు రాహుల్- జయశ్రీ వివాహ రిసెప్షన్ శుక్రవారం జరిగింది. నల్లబెల్లి మండలం రుద్రగూడెం (పెద్ద తండా) గ్రామ పార్టీ నాయకులు భూక్య స్వామి- నీల గార్ల కుమార్తె వైశాలి- సాయికుమార్ వివాహ రిసెప్షన్, చెన్నారావుపేట మండలం శంకరం తండాకు చెందిన బి ఆర్ఎస్ పార్టీ నాయకులు అజ్మీర-తార కుమారుడు రాజు -సరస్వతి, చెన్నారావుపెట ఖలనాయక్ తండాకు చెందిన బానోతు నర్సింహా -అనూష వివాహ రిసెప్షన్ కార్యక్రమానికి నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి హాజరై నూతన వదూవరులను ఆశీర్వదించారు.ఈ కార్యక్రమంలో నల్లబెల్లి మాజి వైస్ ఎంపిపి, క్లస్టర్ బాధ్యులు, మండల పార్టీ ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

## ఈస్ట్ జోన్ డీసీపీగా బాధ్యతలు చేపట్టిన అంకిత్ కుమార్



**వరంగల్ బ్యూరో (నినాదం న్యూస్ ):** వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని ఈస్ట్ జోన్ డీసీపీగా అంకిత్ కుమార్ శనివారం బాధ్యతలు చేపట్టారు. ఈస్ట్ జోన్ కార్యాలయములో ఆయన డీసీపీ రవీందర్ నుండి బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఈస్ట్ జోన్ పరిధిలోని అధికారులు నూతన డీసీపీని మర్యాదపూర్వకంగా కలుసుకొని పుష్పగుచ్చాలను అందజేసి అభినందనలు తెలిపారు.

## సనాతన ధర్మాన్ని రక్షించిన ధీర వనిత అహల్యాబాయి



**సూర్యాపేట జిల్లా ప్రతినిధి మార్చి 8 ( నినాదం న్యూస్):** భారతీయ సంస్కృ. సంస్కృతిని పేదలకు అందించి భారతీయ సనాతన ధర్మాన్ని సంరక్షించిన ధీర వనిత అహల్యబాయి హోల్కర్ అని విశ్రాంతి ఉపాధ్యాయులు తీకుళ్ళ సాయి రెడ్డి అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని శ్రీ వెంకటేశ్వర డిగ్రీ కళాశాలలో అహల్యబాయి హోల్కర్ 300 జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు .ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా అలనాటి ధీర వనితలను స్మరించుకోవడం మన కర్తవ్య మని గుర్తు చేశారు. అదేవిధంగా కళాశాల ప్రిన్సిపాల్ కెప్టెన్ డా. వి. వెంకటేశులు మాట్లాడుతూ అహల్య బాయి తన 12వ ఏటనే తన భర్తను కోల్పోయిన ధైర్యంతో నాటి పరిస్థితులను ఎదుర్కొని భారతీయ విద్యా విధానానికి కృషి చేశారని పేర్కొన్నారు. సావిత్రిబాయి పూలే, మదర్ థెరిస్సా ,ఝాన్సీ లక్ష్మీబాయి లాంటి ధీర వనితలను నేటి యువత ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నెహ్రూ యువ కేంద్ర యూత్ ఆఫీసర్ బి. ప్రవీణ్ సింగ్ ,ఎన్ ఎస్ ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు, అధ్యాపక సిబ్బంది, విద్యార్థిని విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# సమాజ నిర్మాణంలో మహిళలది ప్రధాన పాత్ర

- మహిళలు, శ్రమజీవులు వారిని గౌరవించడం మన బాధ్యత
- అవకాశాలు వస్తే మహిళలు అద్భుతాలు సృష్టిస్తారు
- చదువు ఒక్కటే ప్రామాణికం కాదు.. ప్రతి పనిని దైవంగా భావించడం నిజమైన చదువు
- రాష్ట్ర మాజీ వ్యవసాయ మంత్రి నిరంజన్ రెడ్డి






**వనపర్తి ప్రతినిధి, మార్చి 8 (నినాదం న్యూస్)** సమాజ నిర్మాణంలో మహిళలది ప్రధాన పాత్ర అని, మహిళలు, శ్రమజీవులు వారిని గౌరవించడం మన బాధ్యత అని రాష్ట్ర మాజీ వ్యవసాయ శాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి అన్నారు. శనివారం మహిళా దినోత్సవాన్ని మాజీ మంత్రి సింగిరెడ్డి వాసంతి నిరంజన్ రెడ్డి ఆధ్వర్యములో వనపర్తి జిల్లా కేంద్రంలోని బీఆర్ఎస్ జిల్లా పార్టీ కార్యాలయంలో మాజీ మున్సిపల్ చైర్మన్ ఎద్దుల కరుణశ్రీ అధ్యక్షతన మహిళలతో కలసి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నిరంజన్ రెడ్డి మహిళా వయోవృద్దులను సన్మానించి వారి ఆశీర్వాదం తీసుకున్నారు. అనంతరం బీఆర్ఎస్ మాజీ మహిళా ప్రజాప్రతినిధులను వాసంతి సన్మానించారు. మహిళతో కలసి వాసంతి కేక్ కట్ చేసి అందరికీ శుభాకాంక్షలు తెలియజేశారు.నిరంజన్ రెడ్డి వృద్ధులకు స్వయంగా వడ్డించి బోజనాలు ఏర్పాటు చేశారు. అనంతరం నిరంజన్ రెడ్డి మాట్లాడుతూ సమాజములో అన్ని రంగాలలో మహిళలను ప్రోత్సహించాలని, ప్రభుత్వాలు కూడా ఆ దిశగా చర్యలు చేపట్టాలని అన్నారు. మహిళలను ప్రోత్సహించాల్సిన బాధ్యత పురుషులపై ఉన్నదని అన్నారం. వరాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ మహిళలకు ప్రాధాన్యత కలిపించి వారు స్వయంగా ఎదిగేందుకు కృషి చేశారని అన్నారు. వాసంతి మాట్లాడుతూ కేసీఆర్ మహిళలకు కళ్యాణ లక్ష్మి, వడ్డీలేని రుణాలు, కేసీఆర్ కిట్టు, ప్రసూతి దావఖానలు ఏర్పాటు చేసి మహిళా అభ్యున్నతికి తోడ్పడ్డారని అన్నారు.నా ఎదుగుదలలో నా భర్త నిరంజన్ రెడ్డి ప్రోత్సాహం ఎంతో ఉందని అన్నారు. మహిళల నాయకులు డాక్టర్ నిర్మల, మహిళా అధ్యక్షురాలు నాగమ్మ, నందిమల్ల శారద, ప్రమీలమ్మ, సుదర్శనమ్మ, మణెమ్మ, శివమ్మ, ఈశ్వరమ్మ, గోవిందమ్మ, షేమిం మాట్లాడుతూ నిరంజన్ రెడ్డి ఓడిపోవడం దురదృష్టకరమని, అభివృద్ధి ఆగిపోయిందని వాపోయారు. రైతు బంధు,రైతు రుణ మాఫీ,ఫించన్లు ఆగిపోయి నానావస్థలు పడుతున్నారని అన్నారు. రాజకీయాలకు అతీతంగా మహిళల అభివృద్ధికి నిరంజన్ రెడ్డి కృషి చేశారని, వారిని వచ్చే ఎన్నికలలో గెలిపించుకొని అభివృద్ధికి బాటలు వేస్తామని ప్రతిన బూనారు. మాజీ ప్రజాప్రతినిధులు సంధ్య తిరుపతయ్య, ఉంగ్లం అలేఖ్య, భారతి ప్రేమ్ నాథ్ రెడ్డి,జిల్లా నాయకులు గట్టు యాదవ్, వాకిటి శ్రీధర్, నందిమల్ల అశోక్, వనం రాములు, రాళ్ళ కృష్ణయ్య, కృష్ణా నాయక్, రఘుపతి రెడ్డి, మాణిక్యం, దిలీప్ రెడ్డి, జగన్నాథం నాయుడు, గంధం పరంజ్యోతి, చిట్యాల రాము, గులాం ఖాదర్ ఖాన్, జోహేబ్ హుస్సేన్, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు

## డబుల్ బెడ్రూం కాలనీ సమస్యలు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తాం

- సిపిఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ



**వనపర్తి ప్రతినిధి, మార్చి 8 (నినాదం న్యూస్):** డబుల్ బెడ్రూం కాలనీలో నెలకొన్న సమస్యలు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ అన్నారు. శనివారం వనపర్తి జిల్లా కేంద్రంలోని చిట్యాల రోడ్డులో ఉన్న ఆదర్శనగర్ డబుల్ బెడ్రూం కాలనీని సందర్శించారు. ఈ సందర్భంగా కాలనీవాసులతో చర్చించారు. కాలనీలో మంచినీటి సమస్య తీవ్రంగా ఉందని, వీధిలైట్లు, సీసీ రోడ్లు, సెప్టిక్ ట్యాంక్ తదితర సమస్యలు ఉన్నాయని జాన్ వెస్లీ దృష్టికి తెచ్చారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం డబుల్ బెడ్రూం ఇండ్లు నిర్మించి ఇచ్చిన మౌలిక సదుపాయాలు కల్పించలేదని, దీంతో ప్రజలు నివాసం ఉండడానికి ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. కాలనీలో సిసి రోడ్లు, మంచినీటి సమస్య, సెప్టిక్ ట్యాంక్ నిర్మాణం, వీధిలైట్లు, బస్తీ దవాఖాన, అంగన్వాడి సెంటర్, ప్రైమరీ స్కూల్, కమ్యూనిటీ భవనం తదితర సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఇండ్లు లేని లబ్ధిదారులకు ఇల్లు కేటాయించాలని, రేషన్ కార్డులు ఇవ్వాలని, సబ్సిడీ సిలిండర్లు ఇవ్వాలని, ఉచిత విద్యుత్తు అందించాలని, కొత్త పెన్షన్లు ఇవ్వాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. డబుల్ బెడ్రూం కాలనీలో నెలకొన్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తామని చెప్పారు. అనంతరం ఆయన కాలనీలో పర్యటించి సమస్యలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో డబుల్ బెడ్రూం కాలనీ అభివృద్ధి కమిటీ కన్వీనర్ సర్దార్ ఖాన్, సభ్యులు మండ్ల రాజు, నిరంజన్, అన్వర్, వినోద్, సాయిలీల, మోహన్, గోపాలకృష్ణ, నసీర్, సురేంద్రబాబు, సిపిఎం జిల్లా కార్యదర్శి పుట్ట ఆంజనేయులు, నాయకులు జబ్బార్, ఏ.లక్ష్మి, పరమేశ్వర చారి, గంధం మదన్, బాలస్వామి, గంధం గట్టయ్య, నందిమల్ల రాములు, బాలరాజు, రాబర్ట్, మన్యం, పెద్ద కాజా, కవిత, రేణుక, ఉమా, మద్దిలేటి కాలనీవాసులు పాల్గొన్నారు

## గ్రామపంచాయతీలలో బకాయి పడిన వేతనాలను వెంటనే చెల్లించాలి



**నర్సంపేట, మార్చి 7(నినాదం న్యూస్):** తెలంగాణ గ్రామ పంచాయతీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ ( సిఐటియు) రాష్ట్ర పిలుపులో భాగంగా శుక్రవారం చెన్నారావుపేట ఎంపీడీవో కార్యాలయంలో సీనియర్ అసిస్టెంటూ కు పలు సమస్యలతో కూడిన వినతిపత్రం ఇవ్వడం జరిగింది.అనంతరం సిఐటియు వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి అబ్బ దాసి అశోక్ మాట్లాడుతూ వివిధ పంచాయతీలలో బకాయి వేతనాలు మూడు నెలల నుండి ఏడు నెలల వరకు బకాయి పడ్డాయని రాష్ట్రంలో గ్రామపంచాయతీ ఉద్యోగ కార్మికులకు ప్రతి నెల ఒకటవ తారీఖున ప్రభుత్వ ఉద్యోగుల వలెవేతనాలు చెల్లిస్తామని చెప్పినప్పటికీ వేతనాలు చెల్లించబడలేదన్నారు.రాష్ట్ర ప్రభుత్వం బకాయి పడిన వేతనాలు వెంటనే చెల్లింపులు చేయాలని ప్రభుత్వమే నేరుగా గ్రీన్ ఛానల్ ద్వారా వేతనాలు చెల్లిస్తామని ప్రకటించినప్పటికీ అట్టి ప్రకటన అమల్లోకి రాలేదన్నారు.తక్షణమే ప్రభుత్వం చొరవ తీసుకొని ప్రతి నెల వేతనాలు చెల్లించే విధంగా చర్యలు చేపట్టాలని రాష్ట్రంలో మల్టీపర్పస్ వర్కర్ విధానం వల్ల పంచాయతీ సిబ్బందికి ఉద్యోగ భద్రత లేకుండా పోయిందని వివరించారు.రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడితే కనీస వేతనాలు అమలు చేస్తామని మల్టీ పర్పస్ వర్కర్ విధానాన్ని రద్దు చేస్తామని చెప్పినప్పటికీ ప్రభుత్వం అనేక పోరాటాల నిర్వహిస్తున్న దాటవేత ధోరణి అవలంబిస్తుందని పేర్కొన్నారు. రాష్ట్రంలోని అన్ని వర్గాలలో మార్పులు తీసుకొస్తానన్న ప్రభుత్వం గత ప్రభుత్వం కట్టు బానిసల్లా ఉండే జీవో నెంబర్ 51 మల్టీ పర్పస్ వర్కర్ విధానాన్ని తీసుకువచ్చి ఆదివారం సెలవులు .పండుగ సెలవులు. సమయపాలన .ఇటువంటి అమలు కాకుండా దుర్భరమైన జీవితాలు గడుపుతున్నదని ఆవేదన వ్యక్తం చేశారు.ఏ శాఖలో లేని విధానాలను ఈ శాఖలో తీసుకొని వచ్చి పంచాయతీ సిబ్బంది ని చాలా ఇబ్బందుల పాలు చేస్తున్నారని ,ఈ పంచాయతీ ఉద్యోగుల పట్ల ఈ ప్రభుత్వం దృష్టి పెట్టడం లేదని ఆరోపించారు.రాబోయే బడ్జెట్ సమావేశాల సందర్భంగా ఎస్సీ వర్గీకరణ ఏవిధంగానైతే అమలుకు తీర్మానం చేశారో రాష్ట్రంలో 90 శాతం దళితులు ఉన్న గ్రామపంచాయతీ ఉద్యోగుల పట్ల ఇబ్బందికరంగా ఉన్నటువంటి 51 జీవోను సవరించాలన్నారు.సిఐటియు మండల నాయకులు జన్ను రమేష్ ,కంచె దూడయ్య తుమ్మల పెల్లి ఎల్లమ్మ, ఎస్కే అంకుష్ ,సురేష్ , సాంబయ్య రాజు , ప్రభాకర్ పాల్గొన్నారు.

# మహిళలను మోసం చేసిన కాంగ్రెస్

- మాజీ చీఫ్ విప్ దాస్యం వినయ్ భాస్కర్



**వరంగల్ బ్యూరో (నినాదం న్యూస్ ):** ఇచ్చిన హామీలు అమలు చేయకుండా, మాయమాటలతో కాంగ్రెస్ ప్రభుత్వం మహిళలను మోసం చేసిందని బీఆర్ఎస్ నేత, మాజీ చీఫ్‌విప్ దాస్యం వినయ్‌భాస్కర్ అన్నారు. గ్రేటర్ వరంగల్ 58వ డివిజన్‌లో పని చేస్తున్న మున్సిపల్ కార్మికులకు ప్రపంచ మహిళా దినోత్సవం సందర్భంగా శనివారం శాలువాతో సన్మానించారు. బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... మహిళా సాధికారతకు సమిష్టిగా కృషి చేద్దామని పిలుపునిచ్చారు. మహిళల రక్షణకు ప్రతీ ఒక్కరూ కంకణబద్దులు కావాలని కోరారు. కాంగ్రెస్ ప్రభుత్వం మహిళల ఓట్లు దండుకొని ... వారిని మోసం చేసిందని అన్నారు. ప్రతినెల మహిళలకు 2500 ఇస్తానన్నారు... ఏడాదిన్నర అయింది 2500 ఏవి అని మహిళలు ఎదురు చూస్తున్నారని అన్నారు. మహిళా సంఘాలకు వడ్డీ లేని రుణాలు ఇస్తా అన్నారు ఏవీ అమలు చేయడం లేదని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ ఇమ్మడి లోహితా రాజు, నాయకులు పులి రజినీకాంత్, కొండపాక రఘు, స్నేహిత్, రఘు తదితరులు పాల్గొన్నారు.

## సన్ వ్యాలీ హైస్కూల్లో ఘనంగా గ్రాడ్యుయేషన్ వేడుకలు



**భూపాలపల్లి, మార్చి 8 (నినాదం న్యూస్):** ఫుల్లు రామయ్య పల్లి గ్రామపంచాయతీ పరిధిలోని సన్ వ్యాలీ హైస్కూల్ యందు అత్యంత వైభవంగా గ్రాడ్యుయేషన్ వేడుకలు నిర్వహించారు. ఇందులో భాగంగా 2024 -2025విద్యాసంవత్సరానికి గాను ప్రీ ప్రైమరీ యూకేజీ క్లాస్ విద్యార్థులు ,ప్రైమరీ ఫస్ట్ క్లాస్ లో అదేవిధంగా ప్రైమరీ 5వ తరగతి విద్యార్థులు హై స్కూల్ 6వ క్లాస్ లో ప్రవేశిస్తున్న తరుణంలో పాఠశాల డైరెక్టర్లు విద్యార్థులకు జ్ఞాపికలతో పాటు ప్రశంసా పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు మేనం సతీష్ మాట్లాడుతూ నేటి బాలలే రేపటి భావి భారత నిర్మాతలని, క్రమశిక్షణ, పట్టుదల, వినయం, విధేయతతో చదువునభ్యసించాలని అన్నారు. సన్ వ్యాలీ హైస్కూల్ గ్రామీణ ప్రాంత విద్యార్థులకు వరప్రదాయనిగా ఉంటూ ఎంతోమంది మట్టిలో మాణిక్యాలను వెలికితీస్తుందని, ప్రతి విద్యార్థి వారి జీవితంలో ఉన్నత ఆశయాలు, లక్ష్యాలు సాధించే విధంగా ఉత్తమ టీచర్లచే గుణాత్మక విద్యను అందిస్తూ విద్యార్థుల సర్వతో ముఖాభివృద్ధికి శతతా సహాయ సహకారాలు అందిస్తున్న ఉపాధ్యాయులకు, తల్లిదండ్రులకు, విద్యాభిమానులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కరస్పాండెంట్ మైనాల సురేష్ ప్రిన్సిపాల్ మీనం సతీష్ వేముల శంకర్ తో పాటు మిగతా ఉపాధ్యాయిని ఉపాధ్యాయ బృందం, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

**అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు**

సన్ వ్యాలీ హైస్కూ ల్లో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహిం చారు. పాఠశాలకు చెందిన విద్యార్థిని, విద్యార్థుల మాతృమూర్తులు, పాఠశాల ఉపాధ్యాయినిలకు మేనేజ్మెంట్ వివిధ రకాల పాటలు, ఆటలు ,డ్యాన్స్ సంబంధిత వివిధ రకాల పోటీలు నిర్వహించడంతో ఉత్సాహంగా పాల్గొని విద్యార్థుల కేరింతలు, చప్పట్ల మధ్య అధ్యంతం ఆహ్లాదకరంగా వేడుకలు కొనసాగించారు. ఈ సందర్భంగా పాఠశాల డైరెక్టర్లు మాట్లాడుతూ ప్రతి ఏటా మార్చి 8వ తేదీన అంతర్జాతీయ మహిళా దినోత్సవం మహిళలు సాధించిన విజయాలను గౌరవించడానికి, జరుపుకుంటామని 2025 మహిళా దినోత్సవ సంవత్సరాన్ని 'యాక్సిలరేట్ యాక్షన్'అనే ప్రచార థీమ్ గా ఐక్యరాజ్యసమితి ప్రకటించిన సందర్భంగా ఔచిత్యం ,సాధికారతను సాధించి సమాజ శ్రేయస్సును పురోగతి దిశలో సాగే విధంగా కృషి చేయాలని తెలియజేశారు.

## సంస్కృతి సాంప్రదాయాలను కాపాడే బాధ్యత మహిళలపై ఉంది

### -కాంటెస్ట్ ఎమ్మెల్యే అభ్యర్థి గంగవరం రామకృష్ణారెడ్డి




**వనపర్తి ప్రతినిధి, మార్చి 8 (నినాదం న్యూస్) :** సంస్కృతి సంప్రదాయాలను కాపాడే బాధ్యత మహిళలపై ఉందని వనపర్తి కాంటెస్ట్ ఎమ్మెల్యే అభ్యర్థి గంగవరం రామ కృష్ణారెడ్డి అన్నారు. శనివారం అంతర్జాతీయ మహి ళా దినోత్సవం సందర్భంగా ఆయన మాట్లాడారు. నాటి, నేటి మహిళలకు వ్యత్యాసాలు గమనిస్తే నేటి మహిళలు అన్ని రంగాలలో రాణిస్తున్నప్పటికీ పాశ్చాత్య సంస్కృతియో, గ్లోబలైజేషన్ విధానాలకో తెలియదు కానీ ముఖ్యంగా భారతీయ మహిళలు మన సంస్కృతిక సాంప్రదాయాలను పాటించడంలోను ముందు తరాలకు అందించడంలోనూ వెనుకబడుతున్నారని ఆయన అన్నారు. దేశ భౌగోళిక పరిస్థితులను బట్టి ఆచార వ్యవహారాలు, సాంప్రదాయ దుస్తులు, ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్ల వంటి విషయాలలో మహిళలు దృష్టి సారించాలని, ఆరోగ్య భారత్ ఆరోగ్య ప్రపంచాన్ని నిర్మించాలని ఆయన అన్నారు.

## దేవరకొండ డిపోలో మహిళా దినోత్సవ వేడుకలు



**చింతపల్లి, మార్చి 8 (నినాదం న్యూస్):** దేవరకొండ ఆర్టీసీ డిపోలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా సీనియర్ సివిల్ జడ్జి కే.అనిత పాల్గొని మహిళలకు "ఉమెన్స్ డే" శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఆమె మాట్లాడుతూ మహిళలకు పూర్తిస్థాయిలో భద్రత, రక్షణ ఉంటుందని, మహిళలకు వారి హక్కులపై అవగాహన కలిగి ఉండాలని అన్నారు. ప్రభుత్వ ఉద్యోగినిలకే కాకుండా ప్రతి మహిళ హక్కుల పట్ల అవగాహన కలిగి ఉండాలని అన్నారు.పోలీస్ శాఖ, న్యాయ వ్యవస్థ హక్కుల్ని కాపాడేందుకు కృషి చేస్తుందని, ఎలాంటి భయం లేకుండా ఫిర్యాదు చేయాలని అన్నారు. మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తున్నారని, ఇకముందు కూడా ఇదే స్ఫూర్తి, ఆత్మవిశ్వాసంతో ముందుకు వెళ్లాలని అన్నారు. చదువుతోనే మహిళలు ఉన్నత స్థాయికి చేరుకోగలరని అన్నారు.ఈ సందర్భంగా ఉత్తమ మహిళా ఉద్యోగులను ఘనంగా సత్కరించారు. మహిళ సిబ్బందికి ఆటల పోటీలు నిర్వహించి బహుమతులు ప్రధానం చేశారు. అదేవిధంగా ఆర్టీసీ డిపోలో బస్ స్టేషన్లలో పనిచేస్తున్న మహిళా పారిశుధ్య సిబ్బందికి చీరలు పంపిణీ చేశారు. అసిస్టెంట్ మేనేజర్ పడాల సైదులు మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లో ముందుండాలని ఆకాంక్షించారు. పురుషులతో సమానంగా పోటీ పడుతున్నారని, ఇకముందు కూడా ఇదే స్ఫూర్తితో, చైతన్యంతో ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు గాజుల ఆంజనేయులు, న్యాయవాదులు, ఆర్.ఎస్.రావు, దీప్ లాల్, నారాయణ, వెల్ఫేర్ బోర్డు మెంబర్ లు సమద్, పాపరాజు, ఆర్టీసీ ఉద్యోగులు మహిళా సిబ్బంది , తదితరులు పాల్గొన్నారు.

## పోచంపల్లి బ్యాంకులో మహిళా దినోత్సవ వేడుకలు



**సూర్యాపేట ప్రతినిధి మార్చి 08(నినాదం న్యూస్):** జిల్లా కేంద్రంలోని పోచంపల్లి బ్యాంకులో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. బ్యాంకు మేనేజర్ కిషన్ బ్యాంకు సిబ్బంది మేరే సునితకు జ్ఞాపికను అందజేసి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది క్రాంతి, మల్లికార్జున్ ,కవిత ,నీరజ్ కుమార్, సైదులు ,శృతి ,రాము, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

## ఘనంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు

- వేడుకలకు హాజరైన సొంటి రెడ్డి పున్నారెడ్డి




**కుత్బుల్లాపూర్, మార్చి 8 (నినాదం న్యూస్):** కుత్బుల్లాపూర్ నియోజకవర్గం గాజులరామారం డివిజన్ చిత్తారమ్మ దేవి నగర్ శ్రీ ఎస్ పి ఆర్ గ్లోబల్ లో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు టిపిసిసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీ ఎస్ పి ఆర్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్, శ్రీ ఎస్.పి.ఆర్ గ్లోబల్ స్కూల్ చైర్మన్ సొంటి రెడ్డి పున్నారెడ్డి ముఖ్యఅతిథిగా హాజరైనారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్త్రీ అంటే ఒక శక్తి అని, స్త్రీని గౌరవించడం మన సాంప్రదాయమని, ఎక్కడైతే స్త్రీలు గౌరవం పొందుతారో అక్కడ దేవతలు పూజలు అందుకుంటారని చిన్నారులకు సందేశం అందించారు. మహిళా సాధికారతతో అభివృద్ధి త్వరితగతిన సాధ్యమవుతుందని పేర్కొన్నారు. కుటుంబంలోని ప్రతి మహిళ విద్యావంతురాలు అయితే ఆ కుటుంబంతో పాటు ఆ సమాజమంతా విజ్ఞానవంతులుగా మారడంతో పాటు శాస్త్ర సాంకేతిక అభివృద్ధి సాధించి దేశాభివృద్ధిలో భాగస్వాములు అవుతారని వివరించారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు చిన్నారులు, పాల్గొన్నారు.

## జీడిమెట్ల పోలీస్‌స్టేషన్లో...



**కుత్బుల్లాపూర్, మార్చి 8 (నినాదం న్యూస్):** కుత్బుల్లాపూర్ నియోజకవర్గం జీడిమెట్ల పోలీస్ స్టేషన్లో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు పోలీస్ స్టేషన్ సీఐ మల్లేశం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్లో విధులు నిర్వహిస్తున్న మహిళా సిబ్బందిని శాలువాలతో సత్కరించి మెమెంటోలు అందజేశారు. పోలీస్ స్టేషన్లో హౌస్ కీపింగ్ చేసే మహిళలకు దుస్తులను బహుమతిగా అందజేశారు. ఈ సందర్భంగా సీఐ మల్లేష్ మాట్లాడుతూ మహిళల పట్ల గౌరవంగా మెదలాలని, ప్రతి పురుషుడు మహిళలను గౌరవించిన రోజు సమాజంలో శాంతి విరాజిల్లుతుందని వివరించారు. కనకయ్య మాట్లాడుతూ స్త్రీలు తల్లిగా, భార్యగా, చెల్లిగా కూతురుగా ఉంటూ ఎన్నో రకాల విధులు నిర్వహిస్తున్న మహిళను గౌరవించాల్సిన అవసరం ఎంతైనా ఉన్నదని పేర్కొన్నారు.

## చంపాపేట్ డివిజన్ మాధవనగర్ కాలనీలో..




**మహేశ్వరం, మార్చి 8 (నినాదం న్యూస్):** అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా చంపాపేట్ డివిజన్లోని మాధవ నగర్ కాలనీలో అమలా ముదిరాజ్ వారి ఆధ్వర్యంలో మహిళా దినోత్సవ కార్యక్రమంలో నిర్వహించబడినది ఈ కార్యక్రమంలో పార్టీలకతీతంగా పెద్ద ఎత్తున మహిళా సోదరీమణులు పాల్గొని మహిళా దినోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించినారు ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రంగారెడ్డి జిల్లా కబడ్డీ చైర్మన్ మద్ది కర్ణాకర్ రెడ్డి మరియు చంపాపేట్ డివిజన్ సీనియర్ కాంగ్రెస్ నాయకులు గోపాల్ ముదిరాజ్ గారు పాల్గొని వారు మాట్లాడుతూ మహిళా మహిళలు అంటే ఒక ఇంటికే పరిమితం కాకుండా సతాగా ఎవరి కాళ్ళ మీద వాళ్ళు నిలబడడాన్ని ఆడదంటే అబల కాదు ఆదిశక్తి పరాశక్తి మహిళలు లేనిదే సృష్టి లేదు మహిళలను అధైర్య పడకుండా ఎవరి కాళ్ళ పైన వాళ్ళు నిలబడడం దేశానికి ఆదర్శమని వారు పేర్కొన్నారు ఈ కార్యక్రమంలో ఊరుకొండ రమాదేవి భూషణ్ ఉష సుజాత సిల్వర్ యాదమ్మ సిల్వర్ మాధవి గోకుల్ సరోజ పద్మ ముదిరాజ్ లలిత ముదిరాజ్ ప్రసన్న ముదిరాజ్ కవిత స్రవంతి రజిని విద్యాసాగర్ గౌని భాను ప్రకాష్ రెడ్డి కొత్తపేట ప్రభాకర్ యమ్మ భాష నరసింహారెడ్డి గోగు శేఖర్ రెడ్డి దాసరి వెంకటేష్ ఊరుకొండ శ్రీనివాస్ ఉపేందర్ కార్తీక్ దీపక్ మొదలగువారు పాల్గొని మహిళా దినోత్సవ కార్యక్రమాన్ని జయప్రదం చేయడం జరిగింది.

## మహేశ్వరం ఐఎన్‌టియుసి కార్మికశాఖ అధ్యక్షుడిగా శివ



**మహేశ్వరం మార్చి 8 (నినాదం న్యూస్):** రంగారెడ్డి జిల్లా మహేశ్వరం నియోజకవర్గం ఐ ఎన్ టి యు సి కార్మిక శాఖ అధ్యక్షులుగా నడికుడ శివ ఎన్నికయ్యారు. శనివారం మహేశ్వరం నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ఇన్ చార్జి మాజీ ఎమ్మెల్యే కిచ్చన్న గారి లక్ష్మారెడ్డి ( కెఎల్ఆర్) చేతుల మీదగా నియామక పత్రాన్ని అందుకున్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు టిపిసిసి సభ్యులు దేప భాస్కర్ రెడ్డి, తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ కన్వీనర్ నందిగామ నరసింహ, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు బొక్క జంగారెడ్డి, మహేశ్వరం మండలం మాజీ ఎస్టీ సెల్ అధ్యక్షులు రాజు నాయక్, శశికాంత్ నాగిరెడ్డి పల్లి గ్రామ ఇందిరా కమిటీ అధ్యక్షులు రెడ్డి, నాగిరెడ్డి పల్లి గ్రామ ఉపాధ్యక్షులు కొండూరి గణేష్, నాగిరెడ్డి పల్లి గ్రామ యూత్ అధ్యక్షులు నడికుడ కార్తీక్, అమీర్ పేట్ సోషల్ మీడియా అధ్యక్షులు ఎర్ర నవీన్ కుమార్ తో కలిసి పెద్దలకు శాలువాతో ఘనంగా సన్మానించారు. నూతన కార్మిక శాఖ అధ్యక్షులుగా శివ మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రాన్ని అభివృద్ధే లక్ష్యంగా పని చేస్తానన్నారు. ప్రజలు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలను పరిష్కరించ డంతో పాటు అన్ని రంగాలలో అభివృద్ధి చేసేందుకు తనవంతు కృషి చేస్తాన న్నారు. తనను అధ్యక్షుడిగా ఎన్నికైనందుకు మహేశ్వరం ఇంచార్జి, టిపిసిసి సభ్యుల పెద్దల సీనియర్ నాయకులకు రాష్ట్ర సంఘం ప్రతినిధుల వాసులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.


## ఘనంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు




**అల్వాల్. మార్చి 7(నినాదం న్యూస్):** అల్వాల్‌లోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏ బ్లాక్ అధ్యక్షుడు నిమ్మ అశోక్ రెడ్డి, అల్వాల్ సర్కిల్ మహిళ అధ్యక్షురాలు మీనస్ మేరీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించుకున్నారు. ముఖ్య అతిథిగా మచ్చ బొల్లారం డివిజన్ కార్పొరేటర్ రాజు జితేంద్రనాథ్, సీనియర్ నాయకుడు చంద్రశేఖర్, సి.ఎల్ యాదగిరి పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ స్త్రీలు ఎక్కడైతే పూజించబడతారో అక్కడ దేవతలు ఉంటారని అన్నారు. నేటి సమాజంలో సగభాగమైన మహిళా శక్తి వికాసమే జాతీయ అభివృద్ధి గుర్తింపు అన్నారు. అన్ని రంగాలలో స్త్రీలు రాణించుచున్నారని దేశ అభివృద్ధికి ఆదర్శంగా మారుతున్నారని పేర్కొన్నారు. ఇంటికి పరిమితం కాకుండా రాజకీయ పరిజ్ఞానం పొంది ఎన్నో పదవుల లో రాణించుతున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో అధిక మొత్తంలో మహిళలు పాల్గొన్నారు. ఆల్వాల్ సర్కిల్ మహిళా విభాగం అధ్యక్షురాలు వీనస్ మేరీ, లావణ్య కృష్ణ, పద్మ, కవిత, విమల, లక్ష్మి జ్యోతి, విజయ,రమాదేవి, భాగ్యలక్ష్మి, నిర్మల, నాయకులు బొబ్బిలి సురేందర్ రెడ్డి, రాజసింహారెడ్డి, నల్ల బలవంత రెడ్డి, నాగేశ్వరరావు, కృష్ణ గౌడ్, భాస్కర్,, ఉదయ్ ,జోగిరాజు కేబుల్ శేఖర్ మహిళ కార్యకర్తలు పాల్గొన్నారు.

# అంబీర్ చెరువులో మురుగునీరు కలవకుండా చర్యలు చేపట్టాలి

- బిఆర్ఎస్ పార్టీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్



**కుత్బుల్లాపూర్, మార్చి 8 (నినాదం న్యూస్):**

కుత్బుల్లాపూర్ నియోజక వర్గం పేట్ బషీరాబాద్‌లోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో అంబీర్ చెరువు పరిరక్షణకై చేపట్టవలసిన చర్యలపై బిఆర్ఎస్ పార్టీ శాసనసభ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ అధికారులు, నిజాంపేట్ కార్పొరేషన్ కు చెందిన ప్రజా ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గత బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో మిషన్ కాకతీయ పథకంలో ఎన్నో చెరువులను అభివృద్ధిపరిచి మురుగునీరు కలవకుండా మళ్లింపు చర్యలు చేపట్టి సమీప కాలనీ వాసులకు ఉపయోగపడేలా ఆహ్లాదకర వాతావరణాన్ని ఏర్పాటు చేసే విధంగా చెరువులను అభివృద్ధి పరచామన్నారు. అంబీర్ చెరువులో కూడా మురుగునీరు కలవకుండా మురుగునీరు మళ్లింపు చర్యలను చేపట్టాలని ఇరిగేషన్ అధికారులను, మున్సిపల్ అధికారులను ఆదేశించారు. అనంతరం నిజాంపేట్ కార్పొరేషన్ 22వ డివిజన్ ఎన్ఆర్ఐ కాలనీలో అసంపూర్తిగా మిగిలిపోయిన సిసి రోడ్డు, డ్రైనేజీ పనులపై కాలనీవాసులు సమస్యను ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా, అసంపూర్తిగా మిగిలిపోయిన పనులను వెంటనే పూర్తిచేయాలని ఎమ్మెల్యే అధికారులను ఆదేశించారు.

ఈ కార్యక్రమంలో నిజాంపేట్ మాజీ డిప్యూటీ మేయర్ ధనరాజ్ యాదవ్, బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు రంగరాయ ప్రసాద్, ఇరిగేషన్ డిఈ నరేంద్ర, మున్సిపల్ డీఈ దాసయ్య, ఏఈ లక్ష్మీ నారాయణ, నాయకులు శ్రీకర్ గుప్తా, జశ్వంత్, సాంబశివారెడ్డి, శిల్ప, సాయి, ప్రదీప్, గురుమూర్తి, ఎన్ఆర్ఐ కాలనీ వాసులు సాయిరాజ్, సుబ్బరాజు, శివ, తేజ, త్రినేత్ర రావు తదితరులు పాల్గొన్నారు.

## జర్నలిజం వైపు మహిళల దృష్టి పెరగాలి

- కాప్రా ప్రెస్‌క్లబ్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం



**మేడ్చల్ మల్కాజిగిరి ప్రతినిధి, మార్చి08(నినాదం న్యూస్):** అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకొని శనివారం ఉదయం కాప్రా ప్రెస్ క్లబ్ ఆవరణలో మహిళా దినోత్సవం వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా కాప్రా ప్రెస్ క్లబ్ ఉపాధ్యక్షులు, ధరణి దినపత్రిక ఎడిటర్ జి రోజా రాణిని ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సీనియర్ పాత్రికేయులు ఎంపల్లి పద్మా రెడ్డి మాట్లాడుతూ నింగి నేలలో సగభాగమైన మహిళలు అన్ని రంగాల్లో ముందుండాలని , జర్నలిజం రంగంలో కి కూడా మహిళలు ముందుకు రావాలని ఆయన కోరారు. కాప్రా ప్రెస్‌క్లబ్‌లో ఉన్న సీనియర్ జర్నలిస్ట్ రోజా రాణి మహిళలను చైతన్యపరిచి ఈ ఈ రంగంలోకి తోడ్కొని రావాలని కోరారు. ఈ సందర్భంగా సన్మాన గ్రహీత రోజా రాణి మాట్లాడుతూ తనను ఎంతో ఆదరించి, అభిమానించి మహిళా దినోత్సవ సందర్భంగా సన్మానించిన కాప్రా ప్రెస్ క్లబ్ ప్రతి సభ్యునికి ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కాప్రా ప్రెస్‌క్లబ్ అధ్యక్ష కార్యదర్శులు పటేల్ నరసింహ యాదవ్, డి కిరణ్ కుమార్, కోశాధికారి యాట రాజు, కాప్రా ప్రెస్ క్లబ్ సభ్యులు బెలిదే అశోక్, గుమ్మడి హరిప్రసాద్ తదితరులు ఉన్నారు.

## మహిళా ఉపాధ్యాయులు, సిబ్బందికి సన్మానం



**కుత్బుల్లాపూర్, మార్చి 8 (నినాదం న్యూస్):** టివిఆర్ గ్రూప్ ఆఫ్ విద్యాసంస్థలలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు విద్యాసంస్థల మేనేజింగ్ డైరెక్టర్ టి.వంశీకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో అత్యంత ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో భాగంగా సత్యవాణి విద్యానికేతన్ ఎస్ ఆర్ నాయక్ నగర్, టివిఆర్ మోడల్ హై స్కూల్ అపురూప కాలనీ విద్యాసంస్థలలో పనిచేస్తున్న మహిళా ఉపాధ్యాయులు సిబ్బందిని ఈ సందర్భంగా ఆయన ఘనంగా సత్కరించారు. ఎన్‌సిసి స్పెషల్ క్యాడెట్ టీం మహిళా ఉపాధ్యాయులు, సిబ్బందికి వందనం సమర్పించి మార్చి ఫాస్ట్ ద్వారా వేదికపైకి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా వంశీకృష్ణారెడ్డి మాట్లాడుతూ ఇంటిలో, బడిలో, గుడిలో అన్నింటిలో మహిళది ప్రధాన పాత్రగా అభివర్ణించారు. అమ్మగా, చెల్లిగా, తల్లిగా, ఆలిగా సమాజానికి దిక్సూచిగా మహిళలు నిలుస్తున్నారని పేర్కొన్నారు. నేటి పోటీ ప్రపంచాన్ని దీటుగా ఎదుర్కొంటూ అన్ని రంగాలలో పురుషులతో సమానంగా ముందుంటున్నది మహిళలు అనడంలో సందేహం లేదు అన్నారు. టివిఆర్ విద్యా సంస్థలలో పనిచేస్తున్న మహిళా మా ఉపాధ్యాయులందరు సమాజానికి దిశా నిర్దేశాలను ఏర్పాటు చేసే విధంగా ఎదగాలని సూచించారు.

## శ్రీ శ్లోక ఇంటర్నేషనల్ స్కూల్‌లో మహిళా దినోత్సవ వేడుకలు



**జిన్నారం/పటాన్‌చెరు, మార్చి 8 ( నినాదం న్యూస్):** బొల్లారంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని బొల్లారంలోని శ్రీ శ్లోక ఇంటర్నేషనల్ స్కూల్‌లో ఘనంగా వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమం స్కూల్ కరస్పాండెంట్ హరికృష్ణా రెడ్డి ఆధ్వర్యంలో కన్నుల పండువగా జరిగింది. ఈ ప్రత్యేక సందర్భాన్ని పురస్కరించుకుని, విద్యార్థుల మాతృమూర్తులకు క్రికెట్ పోటీలు నిర్వహించారు. పోటీలు ఉత్సాహభరితంగా సాగి, తల్లులు తమ క్రికెట్ ప్రతిభను ప్రదర్శించి అందరినీ అలరించారు. విజేతలకు బహుమతులను అందజేయడం ద్వారా వారి ప్రతిభను ప్రోత్సహించారు.ఈ సందర్భంగా హరికృష్ణా రెడ్డి మాట్లాడుతూ, “మహిళలు సమాజ నిర్మాణంలో కీలక పాత్ర పోషిస్తారు. వారి సంక్షేమం కోసం ప్రతీ ఒక్కరూ కృషి చేయాలి” అని తెలిపారు. మహిళా దినోత్సవం మహత్తును వివరిస్తూ, తల్లుల ప్రేమ, త్యాగాలను స్మరించుకోవాల్సిన అవసరం ఉన్నట్లు చెప్పారు. ఈ వేడుకలకు విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు అధిక సంఖ్యలో హాజరై ఉత్సాహంగా పాల్గొన్నారు. మహిళా దినోత్సవం సందర్భంగా నిర్వహించిన ఈ ప్రత్యేక క్రికెట్ పోటీలు అందరినీ ఆకట్టుకున్నాయి.ఈ కార్యక్రమంలో పాఠశాల విద్యార్థుల మాతృమూర్తులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## జర్నలిస్టులు, సమాజ సేవకులు.. నిబద్ధతతో ఉండాలి




- కాప్రా ప్రెస్‌క్లబ్ సభ్యత్వ కార్యక్రమం ప్రారంభం
- సభ్యులకు ప్రమాద బీమా పథకం

**మేడ్చల్ మల్కాజిగిరి ప్రతినిధి, మార్చి08(నినాదం న్యూస్):** కాప్రా సర్కిల్ పరిధిలో పనిచేస్తున్న జర్నలిస్ట్ అందరూ నిజాయితీ నిబద్ధత తో తన వృత్తి ధర్మాన్ని పాటించాలని సీనియర్ పాత్రికేయులు ఎంపల్లి పద్మారెడ్డి పేర్కొన్నారు. శనివారం ఉదయం కాప్రా ప్రెస్‌క్లబ్‌లో ప్రెస్‌క్లబ్ సభ్యత్వ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా సీనియర్ జర్నలిస్ట్ ఎంపల్లి పద్మా రెడ్డి మాట్లాడుతూ జర్నలిస్టులందరూ తన వార్తలు ద్వారా ప్రజల చైతన్యవంతం చేయాలని కోరారు. ప్రజా సమస్యల పరిష్కారమే పరమావిధిగా ముందుకు సాగాలని ఆకాంక్షించారు. జర్నలిజం అనేది వృత్తి కాదని ఇది సమాజ సేవ అని పేర్కొన్నారు. కాప్రా ప్రెస్ క్లబ్ అధ్యక్ష కార్యదర్శులు పటేల్ నరసింహ యాదవ్, డి కిరణ్ కుమార్, కోశాధికారి యాట రాజు ఆధ్వర్యంలో 2025 కాప్రా ప్రెస్ క్లబ్ సభ్యత్వాన్ని ప్రారంభించారు. కాప్రా ప్రెస్ క్లబ్ సభ్యత్వము ను ఎంపల్లి పద్మా రెడ్డి, బెలిదే అశోక్, గుమ్మడి హరిప్రసాద్, కె వెంకటేష్ , కీర్తి శ్రీనివాస్, జి శ్రీనివాసరావు, జి రోజా రాణి, వి రామచంద్ర మూర్తి, వి రవి, గంగి కృష్ణ, పి దిలీప్ కుమార్, డి శ్రీనివాసరావు, జి ఆంజనేయులు, ఎన్ నరేష్ తదితరులు తీసుకున్నారు. ఈ సందర్భంగా కాప్రా ప్రెస్ క్లబ్ సభ్యులకు ప్రమాద బీమా పథకాన్ని త్వరలో అందచేయడం జరుగుతుందని కాప్రా ప్రెస్ క్లబ్ అడ్వైజర్ బెలిదే అశోక్ తెలిపారు. కావున కాప్రా ప్రెస్‌క్లబ్‌లోని సభ్యులందరూ 2025 సంవత్సరానికి సంబంధించి సభ్యత్వం తీసుకోవాల్సిందిగా బెలిదే అశోక్ కోరారు.

## సురేష్ సేవాసమితి ఆధ్వర్యంలో.. మహిళా దినోత్సవ వేడుకలు



**అల్వాల్. మార్చి 8 (నినాదం న్యూస్):** అల్వాల్ డివిజన్ కార్పొరేటర్ శాంతి శ్రీనివాస్ రెడ్డి కార్యాలయంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం ఘనంగా జరుపుకున్నారు. కార్పొరేటర్ శాంతి శ్రీనివాస్ రెడ్డి కేక్ కట్ చేసి మహిళా మహారాణులను సన్మానించారు. వారికి మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు నేడు అన్ని రంగాల్లో మహిళలు పురుషులతో సమానంగా ముందుకెళ్తున్నారని కృషి పట్టుదల ప్రతిభతో ఒకరినొకరు ప్రోత్సహించుకుంటూ ధైర్యంగా తమ అనుకున్న లక్ష్యాన్ని నెరవేర్చుకోవాలని కార్పొరేటర్ శాంతి శ్రీనివాస్ రెడ్డి సూచించారు.ఉత్తమ సేవా రత్న అవార్డు గ్రహీత బి ఆర్ ఎస్ సీనియర్ నాయకులు నర్ల సురేష్ మాట్లాడుతూ మహిళలు ఎక్కడైతే మహిళలు గౌరవించబడతారో అక్కడ దేవతలు కొలువై ఉంటారన్నారు. ఆ ప్రాంతం సస్యశ్యామలంగా విరాజిల్లుతుందని భగవంతుడు మహిళలకు ఇచ్చిన గొప్ప వరం ఓర్పు ఆలోచన శక్తి ఎంత కష్టం వచ్చినా గమ్యం వరకు దూసుకుపోయే ఉత్సాహం చూపుతారన్నారు. మల్కాజ్గిరి నియోజకవర్గంలో మహిళలు ఎదుగుతున్న తీరు అద్భుతం అని వారికి సహకారం అందిస్తున్న మన ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డికి కృతజ్ఞతలు తెలుపుతూ మహిళ మహారాణులందరికీ హృదయపూర్వక మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సులోచన, సరితా, శ్రీనివాస్, రమేష్ శారద, నాగరాణి ,జ్యోతి, శ్రీరాములు బాలేష్ అజ్జు తదితరులు పాల్గొన్నారు

అంతర్జాతీయ మహిళా దినోత్సవం స్ఫూర్తితో..

## మహిళా సాధికారత సాధిద్దాం

- నేదునూరి జ్యోతి



**కుత్బుల్లాపూర్, మార్చి 8 (నినాదం న్యూస్):** అంతర్జాతీయ మహిళా దినోత్సవ స్ఫూర్తితో మహిళలు సాధికారత సాధించాలని మహిళా సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నెదునూరు జ్యోతి తెలిపారు. మేడ్చల్ జిల్లా సమితి ఆధ్వర్యంలో జగద్గిరిగుట్ట ఉజ్జయిని హైమావతి అధ్యక్షతన ఏర్పాటు చేసిన సదస్సుకు నెదునూరి జ్యోతి ముఖ్య అతిథిగా హాజరై జెండావిష్కరణ నిర్వహించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ మహిళల హక్కులు హరించబడుతున్నాయని, లింగ సమానత్వం, మహిళలపై దాడులు పెరుగుతున్నాయని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం మహిళా సమాఖ్య రాష్ట్ర కోశాధికారి జె. లక్ష్మి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో మద్యం ఏరులై పారుతుందని విచ్చలవిడిగా బెల్ట్ షాపులకు లైసెన్సులు ఇవ్వడం వల్ల మద్యం మత్తులో మహిళలపై దాడులకు పాల్పడుతున్నారని, గంజాయి వంటి మాదకద్రవ్యాలు యువతను బానిసలుగా మారుస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షురాలు మాధవి, సహాయ కార్యదర్శి ప్రమీల, నర్సమ్మ, పి. సింధురి, అరుణ దేవి వి .లక్ష్మి, మహేశ్వరి, గోవిందమ్మ, కీర్తన, సిహెచ్ నాగలక్ష్మి, సోమేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

## ఆధ్యాత్మిక చింతన కలిగి ఉండాలి

- మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్, మాజీ జెడ్పిటిసి దశరథ్‌నాయక్



**మహేశ్వరం, మార్చి 8 (నినాదం న్యూస్):** నేటి సమాజంలో మనిషి ప్రశాంతంగా జీవించాలి అంటే ప్రతి ఒక్కరికి ఆధ్యాత్మిక చింతన తప్పనిసరి అని కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్, లంబాడి హక్కుల పోరాట సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడు, కడ్తాల్ మాజీ జడ్పిటిసి జర్పుల దశరథ్‌నాయక్ అన్నారు. కడ్తాల్ మండలంలోని హనుమస్పల్లి హనుమాన్ దేవాలయంలో ప్రతి రెండో శనివారం సత్యనారాయణ రథోత్సవం జరుగుతుంది. ఈ రెండో శనివారం అశోక బిల్డర్స్ చైర్మన్ విజయభాస్కర్ రెడ్డి సత్యనారాయణ రథోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జైపాల్ యాదవ్, దశరథ్ నాయక్ తోపాటు స్థానిక నాయకులతో కలిసి పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ ఆనంద్ డైరెక్టర్ సేవ్య నాయక్ గిరిజన నాయకుడు హన్మ నాయక్ తెలంగాణ యువజన సంఘాల ఐక్యవేదిక అధ్యక్షులు రాఘ వేందర్ నాయకులు శంకర్ సక్రు మోహన్ శ్రీను జేడిఎన్ వ్యవస్థాపక అధ్యక్షులు రమేష్ కృష్ణయ్య రాజు గౌడ్ శ్రీరాములు రామకృష్ణ జగన్ పవన్ శ్రీకాంత్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## వాగ్దేవి పాఠశాలలో మహిళా దినోత్సవం



**జిన్నారం/ పటాన్‌చెరు, మార్చి 8 (నినాదం న్యూస్):** అంతర్జాతీయ మహిళా దినోత్సవ సందర్భంగా శనివారం బొల్లారం మున్సిపల్ పరిధిలోని శ్రీ వాగ్దేవి విద్యా సంస్థల డైరెక్టర్ అంబవరం ఉదయ్ భాస్కర్ రెడ్డి, కరెస్పాండెంట్ సుమతి రెడ్డి పాఠశాల మహిళా ఉపాధ్యాయలతో కలిసి ఘనంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవ నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల మహిళా ఉపాధ్యాయలకు ఆటపాటలను ఏర్పాటు చెసి మహిళా ఉపాధ్యాయులకు, విద్యార్థులకు అంతర్జాతీయ మహిళా దినోత్సవం శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... అన్ని రంగాల్లో శరవేగంగా దూసుకుపోతున్న మహిళలకు అంతర్జాతీయ మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాల ఉపాధ్యాయులు కేక్ కట్ చెసి ఒకరికొకరు శుభాకాంక్షలు తెలీపుకున్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, పాల్గొన్నారు.

## సంతోష్‌నగర్ కాలనీలో..



**అల్వాల్, మార్చి 8( నినాదం న్యూస్):** మహిళలు ఇంటికి పరిమితం కాకుండా అన్ని రంగాలలో రాణించాలని గౌతమ్ నగర్ డివిజన్ కార్పొరేటర్ మేకల సునీత రాము యాదవ్ అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని సంతోష్ నగర్ కాలనీలో మరియు జ్యోతి నగర్ లో వేరువేరుగా ఏర్పాటుచేసిన కార్యక్రమంలో కార్పొరేటర్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ మహిళల సంక్షేమానికి మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్, మల్కాజిగిరి శాసనసభ్యులు మర్రి రాజశేఖర్ రెడ్డిలు ఎనలేని కృషి చేస్తున్నారన్నారు. అనంతరం కార్పొరేటర్ కు మహిళలు ఘనంగా సన్మానించారు.

## అల్ఫోర్స్‌లో అట్టహాసంగా అంతర్జాతీయ మహిళ దినోత్సవ వేడుకలు



**కరీంనగర్, మార్చి 8 (నినాదం న్యూస్):** మహిళలు అభివృద్ధికి పునాది అని కుటుంబ సంక్షేమానికి నిర్వచనమని అల్ఫోర్స్ విద్యా సంస్థల అధినేత డా వి. నరేందర్ రెడ్డి స్థానిక వావిలాలపల్లి లోని అల్ఫోర్స్ విద్యాసంస్థల కేంద్ర కార్యాల యంలో విద్యా సంస్థల వారి ఆధ్వర్యంలో స్ఫూర్తిదాయకంగా నిర్వహించినటువంటి అల్ఫోర్స్ అంతర్జాతీయ మహిళ దినోత్సవ వేడుకలకు ముఖ్య అతిధిగా హాజరై మాట్లాడారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహిళలు కుటుంబ పాలనతో పాటు పలు కార్యక్రమాలను సమర్థవంతంగా నిర్వహించి సమాజంలో ఉన్నత స్థితిలో కొనసాగుతున్నారని తెలుపుతూ కుటుంబ వ్యవహారాలకు ఎటువంటి విఘాతం కల్గించకుండా సుఖవంతమైన జీవితాన్ని కల్పించేటువంటి శక్తి మహిళలు కలిగి ఉంటారని కొనియాడుతూ ప్రతి మగవారి విజయంలో స్త్రీ పాత్ర విశిష్టమైనదని చెప్పారు. మహిళలు లేని లోకాన్ని ఊహించలేమని మరియు వారి లోటును ఎవరు కూడా పూడ్చలేరని తెలుపుతూ లోకానికి భీజం వేసేటువంటి వారు మహిళలు అని తెలియజేశారు. నేటి పోటీ ప్రపంచంలో ప్రతి ఒక్కరు వారి వారి కార్యకలాపాలలో నిమగ్నమైనప్పటికి మహిళలు వారి ప్రేమ-ఆప్యాయతలను ఎటువంటి భేద-భావాలు లేకుండా చూపెడుతారని దీని ద్వారా వారియొక్క వ్యక్తిత్వాన్ని తెలుసుకోవచ్చని చెప్పారు. నేడు పురుషులకు సమానంగా మహిళలు అన్ని రంగాలలో అభివృద్ధి చెందడమే కాకుండా పైచేయి సాధిస్తున్నారని కొనియాడారు.మహిళలు కేవలం వంటగదికే పరిమితం కాకుండా నేడు సమాజంలో ఉన్నత లక్ష్యాలను చేదిస్తూ అత్యుత్తమంగా సమాజంలో విజయాలకు పర్యాయపదంగా మారుతున్నారని చెప్పారు.మహిళలు అన్ని రంగాలలో ధైర్యంతో, ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగి దేశ అభివృద్ధికి పాటు పడాలని సూచిస్తూ భావితరాన్ని సరియైన మార్గంలో పయనించేందుకు చేయూత నందించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో వివిధ పాఠశాలల, కళాశాలల ప్రిన్సిపాల్స్, అధ్యాపక, ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన

- మహిళా దినోత్సవం సందర్భంగా సంజీవని లో ఉచిత సేవలు
- మహిళలకు వైద్యంతో పాటు మందుల పంపిణీ



**జమ్మికుంట, మార్చి 8 (నినాదం న్యూస్):** అంతరాతీయ మహిళా దినోత్స వం సందర్భంగా శనివారం రోజున సంజీవని మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ జమ్మికుంట లో ఉచిత మెగా మహిళా వైద్య శిబిరం నిర్వహించారు. ఈ ఉచిత మెగా వైద్య శిబిరానికి సుమారు 300 మంది మహిళలు హాజరై వైద్య సేవలను వినియోగించుకున్నారు. ఒక్కొక్క మహిళకు సుమారు 3000/- రూపాయల విలువైన పరీక్షలు ఉచితంగా చేసి (హీమోగ్లోబిన్ పరీక్ష, షుగర్ పరీక్ష, బి పి, ఎముకల సాంద్రత పరీక్ష( బి ఎమ్ డి) చేసి వారికి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డా.ముషం ప్రణీత ఎంఎస్ గైనకాలజిస్ట్ గర్భిణీ స్త్రీలకు ఇతర మహిళలను పరీక్షించి సలహాలు సూచనలు చేశారు.

**డా. ఊడుగుల అనిత ఎంఎస్ జనరల్ లాపరోస్కోపిక్ సర్జన్**

స్త్రీల యొక్క అనేక రకాల సమస్యలకు పరీక్షించి వారికి సలహాలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, మహిళలు తమ ఆరోగ్యం పట్ల నిర్లక్ష్యం వహించకూడదని సమస్య ఏదైనా డాక్టర్ను సంప్రదించి మందులు వాడాలని సొంత వైద్యం మంచిది కాదని సూచించారు. ప్రస్తుతం మహిళలకు ఎన్నో రకాల అనారోగ్య సమస్యలు ఉత్పన్నమవుతున్నాయని ఆరోగ్యంగా ఉండాలంటే పౌష్టిక ఆహారం తీసుకోవాలని ఎప్పటికప్పుడు ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలని వారికి సూచించారు.ఈ కార్యక్రమంలో డా ముషం సురేష్ ఎంఎస్ ఎముకల వైద్య నిపుణులు, డా కిషోర్ కుమార్ ఎండి ఛాతి వైద్య నిపుణులు, డా ఉడుగుల సురేష్ ఎండి జనరల్ ఫిజీషియన్ క్రిటికల్ కేర్ స్పెషలిస్ట్, ఇతర వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## తృటిలో తప్పిన పెను ప్రమాదం

- ద్విచక్ర వాహనాన్ని ఢీకొన్న కారు
- నలుగురికి తీవ్ర గాయాలు



**జమ్మికుంట, మార్చి 8 (నినాదం న్యూస్) :** జమ్మికుంట మండలంలోని తనుగుల శివారులో ద్విచక్ర వాహనం కారు ఢీకొనడంతో నలుగురికి తీవ్ర గాయాలు అయ్యాయి. మండలంలోని కోరపల్లి గ్రామానికి చెందిన పింగిలి శ్రీకాంత్ అనే వ్యక్తి తన కుటుంబ సభ్యులతో కలిసి వావిలాల గ్రామానికి వెళుతున్నాడు. ఈ తరుణంలో ఎదురుగా వస్తున్న కారు ద్విచక్ర వాహనాన్ని ఢీకొనడంతో వాహనం ప్రయాణిస్తున్న పింగిలి శ్రీకాంత్ తో పాటు అతని భార్య ,ఇద్దరి పిల్లలకు తీవ్ర గాయాలయ్యాయి. ఈ విషయం తెలుసుకున్న వావిలాల పి హెచ్ సి వైద్యురాలు డాక్టర్ చందన సంఘటన స్థలానికి చేరుకొని అక్కడే ప్రథమ చికిత్స చేసి 108 ద్వారా జమ్మికుంట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కాగా యాక్సిడెంట్ కు కారణమైన కారు డ్రైవర్ సంఘటనా స్థలంలోనే కారును వదిలేసి పారిపోయాడు.

## విద్యార్థులు తల్లిదండ్రుల ఆశయాలను నెరవేర్చాలి

### -కాకతీయ విద్యా సంస్థల అధినేత ఆవిర్నేని సుధాకర్ రావు




**జమ్మికుంట, మార్చి 8 (నినాదం న్యూస్):** తల్లిదండ్రుల ఆశయాలను నెరవేర్చుతూ మంచి ఉన్నతమైన స్థానంలో ఉండడంతో పాటు చదువుకున్న పాఠశాలకు తగిన గుర్తింపు తీసుకొని రావాలని కాకతీయ విద్యాసంస్థల అధినేత అవిరినేని సుధాకర్ రావు అన్నారు.జమ్మికుంట పట్టణంలోని కాకతీయ విద్యాసంస్థల ఆధ్వర్యంలో 10వ తరగతి చదువుతున్న విద్యార్థుల వీడ్కోలు సమావేశం అంగరంగ వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా కాకతీయ విద్యాసంస్థల అధినేత అవిరినేని సుధాకరరావు ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. కాకతీయ విద్యాసంస్థల నుండి పదవ తరగతి రాస్తున్న 31వ బ్యాచ్ అని, కాకతీయ విద్యాసంస్థల్లో చదువుకున్న చాలామంది విద్యార్థులు దేశ విదేశాలలో ఉన్నతమైన పదవులలో ఉండడంతో పాటు భారతదేశంలో ఐఏఎస్, ఐఆర్ఎస్, తో పాటు అనేకమంది ఇంజనీర్లు డాక్టర్లు ఈ పాఠశాలలో చదువుకున్న వారు ఉండడం గర్వకారణం అన్నారు. ప్రతి ఒక్క విద్యార్థి చదువుపై ప్రత్యేకమైన శ్రద్ధ వహించి తన అనుకున్న లక్ష్యాలను చేరుకునేందుకు కష్టపడుతూ ముందుకు సాగాలని సూచించారు. విద్యార్థులు చేసిన సాంస్కృతిక నృత్యాలు అందరినీ విశేషంగా ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ తో పాటు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## సునీల్ రావును చూసి ఊసరవెల్లి సిగ్గుపడుతుంది



**కరీంనగర్, మార్చి 8 (నినాదం న్యూస్):** జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాల యంలో పత్రిక సమావేశం ఏర్పాటు చేసి పులి ఆంజనేయు లు గౌడ్ మాట్లాడుతూ, రంగు లు మార్చే ఊసరవెల్లి కంటే అధ్వానంగా పార్టీలు మారిన మాజీ మేయర్ సునీల్ రావుకి మంత్రి పొన్నం ప్రభాకర్ ని కాంగ్రెస్ పార్టీని విమర్శించే స్థాయి లేదని మండిపడ్డారు..మాజీ మేయర్ సునీల్ రావు బండి సంజయ్ భజన చేస్తూ ప్రసన్నం చేసుకోవడానికి మంత్రి పొన్నం మీద కాంగ్రెస్ పార్టీ మీద విమర్శలు చేస్తున్నాడే తప్ప అంతకుమించి ఏమీ లేదని ఏద్దేవా చేశారు పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థికి 19వేల పై చీలుకు ఓట్లు చెడిపోవడం వలన ఈరోజు బిజెపి అభ్యర్థి గెలిచాడే తప్ప అంతకుమించి ఏమీ లేదని ఎద్దేవా చేశారు.. గత అసెంబ్లీ ఎలక్షన్స్ లో 119 నియోజకవర్గాలకు గాను కేవలం ఎనిమిది చోట్ల మాత్రమే బిజెపి అభ్యర్థులు గెలిచారు అది మర్చిపోయిన మాజీ మేయర్ సునీల్ రావు సంజయ్ ని ప్రసన్నం చేసుకోవడానికి ప్రగల్భాలు పలుకుతున్నాడే తప్ప అంతకుమించి ఏమీ లేదు

# మహిళల సురక్షిత ప్రయాణం, భద్రత కోసం మై ఆటో ఇస్ సేఫ్

- కోరుట్ల పట్టణంలో 350 ఆటోలకి క్యూఆర్ కోడ్‌తో అనుసంధానం
- ఆటో డ్రైవర్లు ట్రాఫిక్ రూల్స్ పాటిస్తూ, పరిమితి లోపు ప్రయాణికులను ఎక్కించుకోవాలి
- ప్రారంభించిన జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ ఐపీఎస్






**కోరుట్ల, నినాదం న్యూస్(మార్చ్ 8):** అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మహిళలు, వృద్ధులు, ప్రయాణికుల సురక్షిత ప్రయాణం ,భద్రత కోసం జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో కోరుట్ల పట్టణంలోని కాలేజీ గ్రౌండ్ లో ఏర్పాటుచేసిన ఆటో రిక్షాల సమావేశంలో జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ మై ఆటో ఇస్ సేఫ్ ప్రారంభించారు.ఆటో రిక్షాల సర్వీసెస్ వాహన యాజమాన్యం నుండి అవసరమైన డాక్యుమెంట్లు,సమాచారం సేకరించి డిజిటలైజ్ చేసిన తర్వాత క్రోడీకరించిన సమాచారంను మై ఆటో ఇస్ సేఫ్ అప్ క్యూ ఆర్ కోడ్ స్టిక్కర్లను స్వయంగా ఎస్పీ అశోక్ కుమార్ అతికించి ఆటో యజమాన్యులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ గారు మాట్లాడుతూ మహిళలు, వృద్ధులు, ప్రయాణికుల సురక్షిత, భద్రత కొరకు మై ఆటో సేఫ్ కార్యక్రమాన్ని ప్రారంభించడం సంతోషంగా ఉందని అన్నారు. జగిత్యాల జిల్లాలో 4000 లకు పైగా ఆటోలు ఉన్నాయని ఇప్పటి వరకు 2093 లకు పైగా ఆటోలకు %ు=% కోడ్ లను వేయడం జరిగిందన్నారు. రాబోవు రోజుల్లో మిగతా ఆటోలో కూడా ఈ యొక్క స్టిక్కరింగ్ వేయడం జరుగుతుందని అన్నారు. ఈ రోజు కోరుట్ల పట్టణంలో సుమారు 350 ఆటో లకు (ఆటో ముందు, వెనక, డ్రైవర్ సీట్ వెనకాల ప్రయాణికులకు కనిపించే విధంగా) స్టిక్కరింగ్ చేయడం జరిగిందని ప్రయాణికులు ఎవరైనా ఆటోలో ప్రయాణించే ముందు మొదటగా ఆ ఆటోకు "మై ఆటో ఇస్ సేఫ్" అనే స్టిక్కరింగ్ ఉందా అని గమనించాలని అన్నారు. ప్రయాణికులకు భద్రత, నమ్మకాన్ని కల్పించాల్సిన అవసరం ఆటో డ్రైవర్లకు ఉందని తెలిపారు. "మై ఆటో ఇస్ సేఫ్" అనే స్టిక్కరింగ్ ద్వారా అనుకోని సంఘటనలు జరిగునప్పుడు తొందరగా గుర్తించవచ్చునని అలాగే విలువైన వస్తువులు పోగొట్టుకున్నప్పుడు సులభంగా పట్టుకోవచ్చునని తెలిపారు. క్యూరీఆర్ కోడ్ ఉండటం వల్ల డ్రైవర్లు క్రమశిక్షణ మరియు బాధ్యతతో ఆటోలు నడుపుతారని చెప్పారు.ఆటోలో ప్రయాణిస్తున్నప్పుడు ఆటో డ్రైవర్ అసభ్యంగా ప్రవర్తించిన, దురుసుగా మాట్లాడిన, మరే ఇతర సమస్యలు ఎదుర్కొన్న ఆటో డ్రైవర్ సీట్ వెనకాల గల కోడ్ ను స్కాన్ చేసిన వెంటనే అట్టి ఆటో డ్రైవర్ కు సంబంధించిన పూర్తి సమాచారం మీ మొబైల్ నందు కనిపిస్తుంది. వాటితో పాటుగా ఎమర్జెన్సీ కాల్,ఎమర్జెన్సీ కంప్లైంట్ ఆప్షన్స్ రావడం జరుగుతుందన్నారు. ఎమర్జెన్సీ కాల్ లేదా టెక్స్ట్ రూపంలో స్పందించినప్పుడు ప్రయాణికులు ప్రయాణిస్తున్న ప్యాసింజర్ వాహనం యొక్క లైవ్ లొకేషన్ కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్ కి వెళ్తుంది వారు వెంటనే దగ్గరలో ఉన్న పోలీస్ వారికి సమాచారం అందవేయడంతో వెంటనే స్పందించి వాహనం యెక్క లైవ్ లొకేషన్ కి చేరుకుంటారని అన్నారు. ఆటో డ్రైవర్లు ట్రాఫిక్ నియమాలు పాటిస్తూ ట్రాఫిక్ నియంత్రణలో భాగస్వామ్యం కావాలని, ఆటో లో పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకోవద్దు అని అన్నారు.

## మగాడి విజయం వెనుక స్త్రీ, స్త్రీ శక్తి వెనుక పురుషుడు ఉండాల్సిందే

- 10 మందిని లక్కీ డిప్ ద్వారా ఎంపిక చేసుకొని లక్షల విలువైన సేవలను ఉచితంగా అందిస్తున్న రేని హాస్పిటల్
- అంతర్జాతీయ మహిళా దినోత్సవం రోజున ప్రతి ఏట ఒక ప్రత్యేక ఉచిత ఫర్టిలిటీ సేవలు
- రజనీ ఫెర్టిలిటీ సెంటర్ లో ప్రముఖ గాయని మధుప్రియచే లక్కీడ్రా



కరీంనగర్, మార్చి 8(నినాదం న్యూస్)

ప్రతి మగాడి విజయం వెనుక ఒక స్త్రీ ఉన్నట్లే, ప్రతి మహిళ శక్తి వెనుక పురుషుడి హస్తం తప్పనిసరి అని ప్రముఖ గాయని మధుప్రియ అన్నారు. ఈ రోజు స్థానిక రెనీ మల్టీస్పెషాలిటీ ఆసుపత్రిలో రజని సంతాన సాఫల్య కేంద్రం ఏర్పాటు చేసిన ఒక ప్రత్యేక కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ సృష్టికి మూలం అమ్మ అని, ఆడతామో అందాల ఆనంద పౌర సమాజ నిర్మాత అని తెప్పాల్సిన పని లేదని అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం రోజున ప్రతి ఏట ఒక ప్రత్యేక ఉచిత ఫర్టిలిటీ సేవలు పొందడానికి అర్హులైన 10 మందిని లక్కీ డిప్ ద్వారా ఎంపిక చేసుకొని లక్షల విలువైన ఆధునిక వైద్య సేవలను ఉచితంగా కల్పిస్తున్న రెనీ ఆసుపత్రి చైర్మన్ డా బంగారి స్వామి, డైరెక్టర్ డా రజనీ ప్రియదర్శిని దంపతులను ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో మాట, పాట కలగలిపి అమ్మ గొప్పతనాన్ని ఆవిష్కరించిన ఉచిత సంతాన సాఫల్య వైద్య సేవలు పొందే పది మందిని లక్కీడిప్ ద్వారా 348 మందిలో 10 మందిని ఎంపిక చేసారు. డా రజనీ ప్రియదర్శిని గారు మాట్లాడుతూ తమ అత్త గారి పేరిట ప్రతి ఏట 20 లక్షల విలువైన సంతాన సాఫల్య ఉచిత సేవలు అందించడం చాలా సంతృప్తిని ఇచ్చిందని అన్నారు. డా బంగారి స్వామి మాట్లాడుతూ చిన్న స్థాయి నుంచి ఉన్నత స్థాయికి చేర్చిన సమాజానికి ఎంతో రుణపడి ఉన్నామని, తమ ఆసుపత్రి ద్వారా ఏడాదికి 50 లక్షలకు పైగా ఉచిత వైద్య సేవలు అందిస్తున్నామని అన్నారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథి మధుప్రియను ఆసుపత్రి యాజమాన్యం ఘనంగా సత్కరించారు. డా కెప్టెన్ బుర్ర మధుసూదన్ రెడ్డి సమన్వయకర్తగా నిర్వహించిన ఈ సమావేశంలో ఆసుపత్రి మెడికల్ సూపరింటెండెంట్ డా రవీంద్రారెడ్డి చారి, డీన్ డా.మునీష్ , గుండె వైద్య నిపుణులు డా.దినకర్ తాటిమట్ల , జనరల్ ఫిజీషియన్ దా.నిఖిల్ లక్ష్మణ్, డా .లతీష్ రెడ్డి, నాన్ క్లినికల్ డైరెక్టర్ మేకల అరవింద్? రావు, జనరల్ మేనేజర్ పవన్ ప్రసాద్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## బిజేపి, బిఆర్ఎస్ ఒక్కటైనా నైతికంగా విజయం కాంగ్రెస్

- ఓటర్లకు అవగాహన కల్పించి ఉంటే కాంగ్రెస్ 5 వేల మెజారిటీతో గెలిచేది
- సునీల్ రావు సిఎం రేవంత్ రెడ్డి ని విమర్శించే స్థాయి నీదికాదు
- సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి ఫైర్



**కరీంనగర్, మార్చి 8(నినాదం న్యూస్):** పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో బిజేపి,బిఆర్ఎస్ ఒక్కటైనా నైతికంగా కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి విజయం సాధించాడని ఓటర్లకు అవగాహన కల్పించి ఉంటే కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి 5 వేల పైన మెజారిటీ తో గెలిచే వాడని సుడా చైర్మన్,నగర కాంగ్రెస్ అధ్యక్షుడు కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి అన్నారు.నగర కాంగ్రెస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రాధాన్యత ఓట్ల గురించి చిన్న చిన్న తప్పుల వల్ల ఓటు చెల్లకుండా పోతుందని తెలియక పోవడం వల్ల 28 వేల ఓట్లు వృధా అయ్యాయని అందులో సగానికి పైగా కాంగ్రెస్ అభ్యర్థి కి చెందినవే ఉన్నాయని నరేందర్ రెడ్డి అన్నారు.మెజారిటీ ఓటర్ల తీర్పు కాంగ్రెస్ అభ్యర్థి వైపు ఉన్నా సాంకేతికంగా ఓటమి పాలు కావడం జరిగిందని దీనికి బిజెపి నాయకులు విర్ర వీగడం విడ్డూరంగా ఉందని నరేందర్ రెడ్డి విమర్శించారు.ఓటర్లు ఈవీఎం లకు అలవాటు పడ్డారని ఓటర్లు కాంగ్రెస్ అభ్యర్థి అల్ఫోర్స్ నరేందర్ రెడ్డి పేరుకు ఎదురుగా కొంతమంది 01 అని ఓటర్ లిస్టులో 2 వ స్థానంలో ఉండడం వల్ల 02 అని రైట్ గుర్తు పెట్టి ఇలా దాదాపు 15 వేలకు పైచిలుకు ఓట్లు చెల్లని ఓట్లు వేశారని వీరందరూ కూడా కాంగ్రెస్ పార్టీ కి మద్దతు గానే వేశారని నరేందర్ రెడ్డి గుర్తుచేశారు. కాంగ్రెస్ పార్టీలో సమన్వయం గురించి సునీల్ రావు మాట్లాడడమేంటని కొత్తగా బిజెపిలో చేరిన సునీల్ రావు మొదలు బిజేపీ లో ఉన్న అసమ్మతి వాదుల గురించి తెలుసుకుని మాట్లాడాలని హితవు పలికారు.సిఎం రేవంత్ రెడ్డి గురించి మాట్లాడే స్థాయి సునీల్ రావుది కాదని రొటీన్ పర్యటనలో భాగంగా ప్రజలకు కులగణన గురించి,ఎస్సి వర్గీకరణ గురించి పలు అభివృద్ధి కార్యక్రమాల పై ప్రజలకు వివరించడానికి ముఖ్యమంత్రి పర్యటన చేశారని అదే సమయంలో ఎమ్మెల్సీ ఎన్నికలు జరుగుతున్నందున వాటి గురించి మాట్లాడారు అంతేగాని ప్రత్యేకించి ఎమ్మెల్సీ ఎన్నిక గురించి ముఖ్యమంత్రి పర్యటన చేయలేదని నరేందర్ రెడ్డి పేర్కొన్నారు.బిఆర్ఎస్ సీనియర్ నాయకుడు రవీందర్ సింగ్ బిఆర్ఎస్ కండువా కప్పుకొని నామినేషన్ దాఖలు చేశాడని ఆయనకు బిఆర్ఎస్ మద్దతు ఇవ్వకుండా చీకటి ఒప్పందం ప్రకారం బిజేపీ కి బిఆర్ఎస్ మద్దతు ఇచ్చిందని నరేందర్ రెడ్డి ఆరోపించారు.ఈ విలేకరుల సమావేశంలో కొరివి అరుణ్ కుమార్,శ్రవణ్ నాయక్,అర్ష మల్లేశం,నగేష్ ముదిరాజ్ జీడి రమేష్,దండి రవీందర్,దన్న సింగ్, మామిడి సత్యనారాయణ రెడ్డి,కుర్ర పోచయ్య,చాంద్ పాషా,మహమ్మద్ భారీ, బషీర్,వాడి వెంకట్ రెడ్డి,ఆంజనేయులు, సాయిరాం తదితరులు పాల్గొన్నారు.

## మహిళలు రాజకీయాల్లో అత్యున్నత స్థాయికి ఎదగాలి

- ఒక మహిళను దేశ ప్రధానిని చేసిన ఘనత కాంగ్రెస్ పార్టీది
- జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు కర్ర సత్య ప్రసన్న రెడ్డి




**కరీంనగర్, మార్చి 8(నినాదం న్యూస్):** అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా కరీంనగర్ డిసిసి కార్యాలయంలో జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు శ్రీమతి కర్ర సత్య ప్రసన్న రెడ్డి ఆధ్వర్యంలో సంబరాలు నిర్వహించడం జరిగింది.ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన కేకును కర్ర సత్య ప్రసన్నా రెడ్డి గారు కట్ చేసి మహిళా కాంగ్రెస్ శ్రేణులకు అందించి ఆనందాన్ని పంచుకోవడం జరిగింది. అనంతరం కార్యక్రమాన్ని ఉద్దేశించి సత్య ప్రసన్నా రెడ్డి మాట్లాడుతూ, కాంగ్రెస్ పార్టీ మొదటి నుండి మహిళలకు అధిక ప్రాధాన్యత ఇవ్వడం జరిగింది ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారి పాలనలో మొట్టమొదటిగా మహిళల సంక్షేమమే లక్ష్యంగా పలు సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టడం జరిగింది, ముఖ్యంగా రాష్ట్ర ప్రభుత్వం కొలువుదీరిన నెల రోజుల్లో ప్రవేశపెట్టిన ఉచిత బస్సుతో చాలామంది మహిళలు ఆర్థికంగా లబ్ధి పొందుతున్నారు, దేశంలో ఏ రాష్ట్రం ఇవ్వని విధంగా 1200 రూపాయలు ఉన్న వంట గ్యాస్ సిలిండర్ ను 500 రూపాయలకే అందజేసి మధ్యతరగతి మహిళల కుటుంబాలలో ఆనందాన్ని నింపినారు, 200 యూనిట్లు ఉచిత విద్యుత్తుతో చిన్న చిన్న పరిశ్రమలు నడుపుకునే మహిళలు లాభాలు గడిస్తూ ఆర్థికంగా ఎదుగుతున్నారు, ప్రధానంగా నేడు మహిళా దినోత్సవం సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం ఇందిరా మహిళా శక్తి పేరుతో 150 బస్సులను మహిళల ద్వారా నడిపించాలని నిర్ణయం హర్షించదగ్గ విషయం దీనికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారికి మహిళా కాంగ్రెస్ పక్షాన ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలియజేస్తున్నాను, ఒకప్పుడు వంటింటికే పరిమితమైన మహిళలు నేడు అంతరిక్షంలో అడుగు పెట్టే స్థాయికి ఎదిగినారు, రాజకీయ రంగంలో మహిళలు అత్యున్నత స్థాయికి ఎదగాలి ఇంకా రాజకీయ వేదికలలో మహిళలకు సముచిత స్థానం లభించడం లేదు, మహిళలు వివరి స్థానాన్ని వారు కాపాడుకోవడానికి శ్రమించాలి మహిళా చట్టాలను పటిష్టంగా అమలుపరిచే బాధ్యతలను చేపట్టే స్థాయికి మహిళలు చేరుకున్నప్పుడే మహిళా సాధికారత సాధ్యమవుతుందని అభిప్రాయాన్ని వ్యక్తం చేస్తున్నానని అన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లాలోని పలు మండలాల మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు, మహిళా కాంగ్రెస్ కార్యవర్గ సభ్యులు, అభిమానులు పాల్గొన్నారు.

## మంత్రిని కలిసిన ప్రణవ్

- త్వరలోనే ఇల్లంతకుంట ఆలయ కమిటీ ఏర్పాటు
- రాములోరి కళ్యాణానికి ఘనంగా ఏర్పాట్లు



**జమ్మికుంట, మార్చి 8 (నినాదం న్యూస్):** హుజురాబాద్ నియోజకవర్గంలో ఉన్న దేవాలయల అర్చకుల సమస్యలపై దేవాదాయ,ధర్మాదాయ శాఖ మంత్రి కొండ సురేఖను శనివారం నాడు హైదరాబాద్ లోని వారి నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు హుజురాబాద్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జి వొడితల ప్రణవ్.ఈ సందర్భంగా అపర భద్రాద్రిగా పేరొందిన ఇళ్ళందకుంట శ్రీ సీతారామచంద్ర స్వామి దేవస్థాన కమిటీ త్వరలోనే ఏర్పాటు చేసి,బ్రహ్మోత్సవాల్లో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఉండేందుకు అన్ని ఏర్పాట్లు చేసి ఘనంగా నిర్వహిస్తామని మంత్రికి తెలిపారు.కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత దేవాలయాల అభివృద్ధికి కృషి చేస్తుందని,దాంట్లో భాగంగా హుజురాబాద్ నియోజకవర్గ దేవాలయాల సమస్యలు పరిష్కరిస్తామని మంత్రి హామీ ఇచ్చినట్లు ప్రణవ్ తెలిపారు. భద్రాచలం తర్వాత అంత పేరు పొందిన ఇల్లంత కుంట దేవస్థానంలో శ్రీరామనవమి ఉత్సవాలను ఘనంగా నిర్వహించడానికి అన్ని ఏర్పాట్లు చేస్తామని ప్రణవ్ తెలిపారు.

## శివాలయంలో శివ పంచాక్షరి రుద్రాభిషేకం

### -అధిక సంఖ్యలో పాల్గొన్న భక్తులు



**జమ్మికుంట, మార్చి 8 (నినాదం న్యూస్):** శ్రీ విశ్వేశ్వర స్వామి దేవస్థానం బొమ్మల గుడి జమ్మికుంటలో లోక కళ్యాణార్థం తలపెట్టిన శివ పంచాక్షరి జపం ఐదు కోట్ల శివ పంచాక్షరి జపం చేసి స్వామివారికి ఆరుద్ర నక్షత్రం సందర్భంగా పంచామృతాలతో రుద్రాభిషేకం భక్తజన సమూహం మధ్య వైభవంగా జరిగినది. ఈ కార్యక్రమం అన్నపూర్ణ సేవా సమితి భవాని భజన మండలి వారి ఆధ్వర్యంలో ఆలయ అర్చకులు మండలేముల వేణుగోపాల శర్మ చే అభిషేక కార్యక్రమాలు నిర్వహించడం జరిగినది. ఈ కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేశారు. కార్యక్రమం అనంతరం అన్నపూర్ణ సేవా సమితి వారి ఆధ్వర్యంలో అన్న ప్రసాద వితరణ నిర్వహించారు.

## విగ్రహాల ముసుగులు తొలగించా

- 10 నుంచి రిలే నిరాహార దీక్షలు
- తిమ్మాపూర్ జేఏసి కమిటీ



**కరీంనగర్, మార్చి 8(నినాదం న్యూస్):** తిమ్మాపూర్ మండల కేంద్రం లోని ఆర్ టీసి బస్టాండ్ ముందర రెండేళ్ల క్రితం ఏర్పాటు చేసిన అంబేద్కర్ మరియు జగ్జీవన్ రాం విగ్రహాలకున్నటివంటి ముసుగులు తొలగించి వెంటనే ఆవిష్కరణ చేయాలని కోరుతూ తిమ్మాపూర్ తహసీల్దార్ కార్యాలయం పక్కన ఈనెల 10 నుండి రిలే నిరాహర దీక్షలు చేయనున్నట్లు జేఏసి కన్వీనర్ లు శనివారం జరిగిన సమావేశం లో పేర్కొన్నారు.గత రెండేళ్ల క్రితం ఏర్పాటు చేసిన మహనీయుల విగ్రహాల విషయం లో అప్పటి ప్రభుత్వం, ఉన్నతాధికారుల మధ్య ఏర్పడ్డ సమాచారలోపం తో విగ్రహాలు ఆవిష్కరణ కు నోచుకోకుండా ఉన్నాయని జేఏసి కన్వీనర్ ల సమావేశం లో ఆవేదన వ్యక్తం చేసారు.

## సమాజంతో ఎంతో పోరాడాము..



వనపర్తి జిల్లా ఆత్మకూరు మండలం ఖానాపూర్ గ్రామంలో శకుంతల, జానకీరామ్ రెడ్డి దంపతులకు జన్మించిన చంద్రకళ ప్రస్తుతం చేవెళ్ల ఆర్డీవోగా పనిచేస్తున్నారు. ఉద్యోగం రాకముందు 2001-2002లో మహిళా సంఘం వెలుగు ప్రాజెక్టులో పనిచేసి ప్రస్తుతం ఆర్డీవోగా పనిచేస్తున్న ఆమె ప్రయాణం ఆమె మాటల్లోనే.. వ్యవసాయాధారిత కుటుంబం మాది.. చదువు అంత సొంత జిల్లా వనపర్తి ఆత్మకూరు మండలం, హయ్యర్ ఎడ్యుకేషన్ హైదరాబాద్ లో, మహబూబ్ నగర్ విశ్వవిద్యాలయంలో కొనసాగింది. 2003లో గ్రూప్ 2 పరీక్ష ద్వారా ఎమ్మార్వో బాధ్యతలు స్వీకరించా. తదనంతరం అంచెలంచెలుగా ప్రమోషన్ పొందుతూ ప్రస్తుతం చేవెళ్ల ఆర్డీవోగా పనిచేస్తున్నాను. గతంలో హైదరాబాద్, సికింద్రాబాద్, రాజేంద్రనగర్ ఆర్డీవోగా పనిచేశాను. గతంలో నా పనితీరు మెచ్చి ఉన్నతాధికారులు క్యాష్ అవార్డులు అందించారు. 2017లో గత సీఎం కేసీఆర్ చేతుల మీదుగా 5లక్షల క్యాష్ అవార్డు అందుకున్నాను. గ్రే హౌండ్స్‌కు సంబంధించిన కేసులు, హైదరాబాద్ పోలీసు టవర్స్ కేసు, పుప్పాల గూడ కేసు, మణికొండ వక్ఫ్ ల్యాండ్ కేసులు గెలిచి ఉన్నతాధికారుల నుంచి అవార్డులు అందుకున్నాను. హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాల అప్పుడున్న కలెక్టర్ల చేతుల మీదుగా దాదాపు పదిహేను సార్లు మెరిట్ సర్టిఫికేట్లు తీసుకున్నాను.

# ఓర్పుకు నిదర్శనం..!
# సాహసానికి ప్రతిరూపం

• సామర్థ్యానికి సంకేతం • మహిళలే 'మహారాణులు' • మహిళలదే ప్రపంచం

చేవెళ్ల, మార్చి08(నినాదం న్యూస్): ఓర్పుకు నిదర్శనం..! సహనానికి ప్రతిరూపం.! సామర్థ్యానికి సంకేతం..! ధీరత్వంలో ప్రత్యేకం..! ఓ వ్యక్తి జీవితంలో స్త్రీ ఎన్నో పాత్రలు పోషిస్తుంది. తల్లి మొదలు చెల్లి భార్య గురువు ఇలా ఎన్నో బాధ్యతలను( స్త్రీ) మహిళా అలవోకగా చేయగలదు. నేటి ఆధునిక కాలంలో మహిళలే మహారాణులు అన్ని రంగాల్లో వారిదే అగ్రస్థానం.. తాను అబల కాదు.. సబల, సాహసి అని నిరూపిస్తున్నది మహిళ.కష్టాలను భరిస్తూ, వేధింపులను ధైర్యంగా ఎదుర్కొంటున్నది. కన్నీళ్లు పెట్టుకోవడం కాదు, అవసరమైతే కన్నెర్రజేస్తున్నది. పిరికితనం వదిలి పిడికిలి బిగిస్తున్నది. నేలవైపు తలవాల్చి నడవడం కాదు,నింగికి నిచ్చెన వేస్తున్నది.ఆకాశంలో సగమై, అవనిలో అర్ధ భాగమై నడుస్తున్నది. మహిళలు ఎక్కడ పూజించబడతారో అక్కడ దేవుళ్ళు నిలయం ఉంటారని మన పెద్దలు తెలిపిన మాటలు వాస్తవం. మహిళ అంటే అబల కాదు సబల అంటూ నేడు దూసుకుపోతున్నారు. అయినా ఒక పురుషుడి జీవితం నిండుకుండలా మారాలంటే, ఆ మట్టి వాసన మహిళా కావాల్సిందే. అప్పుడే నిజమైన జీవితానికి సార్థకత చేకూరుతుంది. పురుషులకు ధీటుగా అన్ని రంగాల్లో మహిళలు రానిస్తున్నారు. జగతిలో తాను లేని చోటు లేదని ఋజువు చేస్తున్నారు. నిన్న(శనివారం) ప్రపంచం జరుపుకునే మహిళా దినోత్సవం, మహిళలు మహారాణులు అనడంలో సందేహం ఎందుకు? చేవెళ్ల మండలంలో ప్రభుత్వ శాఖల్లో ప్రజలతో మమేకమై తమ పనితీరుతో ముందుకు వెళ్తున్న అధికారుల గురించి తెలుసుకుందాం.. వారిని రోల్ మోడల్ గా తీసుకుని ముందుకు వెళ్దాం. మహిళ దినోత్సవం సందర్భంగా "నినాదం" అందిస్తున్న ప్రత్యేక కథనం.






## లక్ష్యసాధనలో ముందుండాలి..



మహిళలు లక్ష్యసాధన, క్రమశిక్షణ, ఏదైనా సాధించాలనే తపన, తల్లిదండ్రుల మాటలు విన్నవారు తప్పకుండా జీవితంలోకి పైకి వస్తారు. ఇవి చేవెళ్ల మిషన్ భగీరథ ఇంట్రా డీఈ హారిక మాటలు.. హైదరాబాద్ పట్టణంలోని పద్మ, చంద్రశేఖర్ దంపతులకు జన్మించిన ఆమె చదువంతా హైదరాబాద్ లోనే కొనసాగించారు. తల్లి గృహిణి కాగా, తండ్రి వ్యాపార రంగంలో రానిస్తున్నారు. బీటెక్ చేసిన ఆమె క్వీన్ ఇండియా సాఫ్ట్ వేర్ రంగం నుంచి 2007లో ప్రకటించిన నోటిఫికేషన్ ద్వారా పరీక్షలు రాసి 2010లో ప్రభుత్వ ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు. గతంలో హైదరాబాద్ లోని ఈఎన్సీ హెడ్ ఆఫీస్ లో పని చేశారు. నేటి మహిళలు మానసికంగా, శారీరకంగా దృఢంగా ఉండాలి. ప్రతిరోజు నీరు ఎక్కువగా త్రాగాలి. సొంత నిర్ణయాలు, సొంత కాళ్లపై నిలబడే శక్తిని పెంపొందించుకోవాలి, ఆర్థికంగా ఎదగాలి. పనిచేసిన చోట బెస్ట్ అనిపించుకోవాలి. బాగా చదివి పైకి రావాలంటే సోషల్ మీడియాని దూరంగా పెట్టాలి. ఒక సంవత్సరం కష్టపడి చదివితే విజయం మీదే. మీరు ఎంచుకున్న రంగాలలో పని చేసుకోవచ్చు.

## ఇష్టంతో కష్టపడ్డాను..



హైదరాబాద్ పట్టణంలో సుబ్బయమ్మ, తిరుపతిరావు దంపతులకు డాక్టర్ వెంకటలక్ష్మి జన్మించారు. చిన్నప్పటి నుంచి చదువులో బాగా రాణిస్తూ ఎంబీబీఎస్ పూర్తి చేసి పీజీలో డీజీఓ పూర్తి చేయడంతో డాక్టర్ గా సెటిల్ అయ్యారు. హైదరాబాద్ వాసి అయిన ప్రముఖ గైనకాలజిస్ట్ గా ఘట్కేసర్ లో 8సంవత్సరాలుగా పనిచేసి ప్రస్తుతం 2సంవత్సరాల నుంచి చేవెళ్ల ప్రభుత్వాసుపత్రిలో పనిచేస్తూ పేరు ప్రఖ్యాతలు సంపాదించారు. ఆమె జీవన ప్రయాణం ఆమె మాటల్లోనే.. మా తల్లి గృహిణి, తండ్రి ప్రభుత్వ ఉపాధ్యాయులు. మా నాన్న ప్రోత్సాహం నాకు ఎంతగానో ఉంది. ఆడపిల్లలు అంటే అలుసు అనే రోజుల్లోనే నా తండ్రి నాకు అన్ని విధాలుగా వెన్నెముకగా నిలిచారు. నా విజయం వెనుక నా తండ్రి ఉన్నాడని గర్వంగా చెబుతా. ముఖ్యంగా మహిళలు ఆరోగ్యంపై శ్రద్ధ పెట్టాలి. అటు ఇంటి పనులు చేస్తూ, ఇటు ఉద్యోగం చేస్తూ ఆరోగ్యాన్ని విస్మరిస్తుంటారు. కానీ ఆరోగ్యం లేకపోతే ఏమి చేయలేము. పోరాడి అన్ని విధాలుగా నిలదొక్కుకునేలా తల్లిదండ్రులు అమ్మాయిల్ని ప్రోత్సహించాలి.సమాజంలో ఎవరు తక్కువ కాదు, తమ కాళ్ళపై తాము నిలబడినప్పుడే మహిళ విజయం ప్రారంభమవుతుంది. మహిళల ఎదుగుదలలో అందరి సహకారం ఉండాలి. మహిళలు బాగా చదువుకొని ఉన్నత స్థానానికి ఎదగాలి.




## ప్రభుత్వ ఉద్యోగంతో మంచి గుర్తింపు..



నాగర్‌కర్నూల్ జిల్లా తెల్కపల్లి మండలం గౌరారం గ్రామంలో భాగ్యమ్మ కుర్మయ్య దంపతులకు జన్మించిన హిమబిందు ప్రస్తుతం చేవెళ్ల ఎంపీడీవోగా పనిచేస్తున్నారు. 2011 ప్రకటించిన గ్రూప్ 1 నోటిఫికేషన్ ద్వారా పరీక్షలు రాసి 2018లో ఎంపీడీవోగా బాధ్యతలు చేపట్టారు. ఆమె జీవన ప్రయాణం ఆమె మాటల్లోనే.. మా అమ్మ, నాన్న ఇద్దరు ప్రభుత్వ ఉపాధ్యాయులు. నా చదువు అంతా రంగారెడ్డి, హైదరాబాద్ జిల్లాలో కొనసాగింది. బీఫార్మసీ, ఎంఏ పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ చదివాను. 2011 ప్రకటించిన గ్రూప్ 1 నోటిఫికేషన్ ద్వారా పరీక్షలు రాసి 2018లో ఎంపీడీవోగా బాధ్యతలు స్వీకరించా. గతంలో జనగాం హెడ్ క్వార్టర్స్ లో ఎంపీడీవోగా పనిచేశాను. మహిళలు ఆర్థికంగా ఎదగాలి, ఎవరిపై డిపెండ్ కాకుండా తమ కాళ్లపై తామే నిలబడాలి. స్వతహాగా నిర్ణయాలు తీసుకునే స్థాయిలో ఉండాలి. చిన్న చిన్న విషయాలకు కుంగిపోకుండా ఆత్మవిశ్వాసం పెంచుకొని ముందుకు వెళ్లాలి. తల్లిదండ్రులు కూడా ఆడ, మగ అనే తేడా తారతమ్యాలు లేకుండా పిల్లలను పెంచాలి. ఆర్థిక స్వేచ్ఛ పరిఢవిల్లే చోట మెరుగైన పరిస్థితులు నెలకొంటాయి. అందుకే మహిళలకు ఆర్థిక స్వేచ్ఛ ఇవ్వాలి. అది ఇంట్లో నుంచే మొదలవ్వాలి.


## మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి..

యాదాద్రి భువనగిరి, భూదాన్ పోచంపల్లికి చెందిన లలిత, నర్సింహా దంపతులకు జన్మించిన వనం శిరీష ప్రస్తుతం చేవెళ్ల ఎస్ఐగా విధులు నిర్వహిస్తున్నారు. పంచాయతీ సెక్రటరీ నుంచి పోలీసు డిపార్ట్మెంట్ లో ఎస్ఐగా ఎంపికైన ఆమె ప్రయాణం ఆమె మాటల్లోనే.. మా తల్లి గృహిణి, తండ్రి వ్యాపార రంగంలో రానిస్తున్నారు. నా చదువు టెన్త్ వరకు యాదాద్రి భువనగిరిలో, హయ్యర్ ఎడ్యుకేషన్ అంత హైదరాబాద్ లోనే కొనసాగింది. బీటెక్ ఎలక్ట్రానిక్స్ చదివిన నేను గతంలో 6నెలలు పంచాయతీ సెక్రటరీగా పని చేశాను. ప్రభుత్వం 2020లో ప్రకటించిన పోలీసు నోటిఫికేషన్లో ఎస్ఐ ఉద్యోగం సాధించి మొహినాబాద్ పోలీసు స్టేషన్ లో 3సంవత్సరాలుగా ఎస్ఐగా విధులు నిర్వహించారు. అత్యవసర సమయాల్లో మహిళలు ఇబ్బందులకు గురైతే 100కు ఫోన్ చేయాలి. మహిళలు అన్ని రంగాలలో రానిస్తే సమాజంలో, ప్రజలలో మంచి గుర్తింపు వస్తుంది. సైబర్ నెరగాలతో జాగ్రత్తగా ఉండాలన్నారు. సైబర్ నేరగాళ్లు లేదా ఎవరైనా ముందుగా డబ్బులు పంపించమంటే నమ్మి డబ్బులు పంపించి మోసపోవద్దు. అనుకోకుండా ఎవరైనా సైబర్ నేరాల బారిన పడితే వెంటనే 1930 నంబర్ కు ఫోన్ చేసి వివరాలు తెలపాలి. ముఖ్యంగా అక్కడక్కడ పని ప్రదేశాలలో మహిళలు హింసకు గురవుతున్నారు. అలాంటి చోట్ల మహిళలను గౌరవించాలి.






# NINADAM MARKET



## పీఎఫ్ ఖాతాదారులకు శుభవార్త.. ఇకపై వివరాల అప్‌డేట్ మరింత సులభం




భారతదేశంలో ప్రైవేట్ ఉద్యోగస్తుల సంఖ్య ఎక్కువగా ఉంటుంది. వీరికి రిటైర్మెంట్ తర్వాత ఆర్థిక భరోసా కల్పించడానికి కేంద్ర ప్రభుత్వం ఈపీఎఫ్ఓ ద్వారా ప్రత్యేక పొదుపు పథకాన్ని అందుబాటులో ఉంచింది. ఉద్యోగితో పాటు యాజమాని సమానవాటాతో ఈ స్కీమ్ నెలవారీ పొదుపు పథకంగా ఉంటుంది. అయితే పీఎఫ్ ఖాతా అప్‌డేట్ చేయడం అనేది ఉద్యోగులకు పెద్ద ప్రహసనంగా ఉంటుంది. కేంద్ర ప్రభుత్వం పీఎఫ్ ఖాతాదారులకు ఇటీవల గుడ్‌న్యూస్ చెప్పింది. పీఎఫ్ ఖాతాలో మీ వ్యక్తిగత వివరాలను సులభంగా అప్‌డేట్ చేసుకునే అవకాశం ఇచ్చింది. ఉద్యోగుల ప్రావిడెంట్ ఫండ్ ఆర్గనైజేషన్ (ఈపీఎఫ్ఓ) ఈ ప్రక్రియను క్రమబద్ధీకరించింది. ఆధార్ ద్వారా ధ్రువీకరించిన యూనివర్సల్ అకౌంట్ నంబర్లు (యూఏఎన్) ఉన్న సభ్యులు పత్రాలను అప్‌లోడ్ చేసే ఇబ్బంది లేకుండా వారి ప్రొఫైల్‌లను నవీకరించడానికి వీలు కల్పిస్తుంది. గతంలో మీ ఈపీఎఫ్ ప్రొఫైల్‌ను అప్‌డేట్ చేయాలంటే కచ్చితంగా మీ యజమాని ధ్రువీకరించాల్సి వచ్చేది. దీనివల్ల 28 రోజుల వరకు ఆలస్యం అయ్యేది. మీ యూఏఎన్ మీ ఆధార్‌తో అనుసంధానించి ఉంటే మీరు మీ పేరు, పుట్టిన తేదీ, లింగం, జాతీయత, తల్లిదండ్రుల పేర్లు, వైవాహిక స్థితి, జీవిత భాగస్వామి పేరు, చేరిన తేదీ, నిష్క్రమించే తేదీతో సహా వివిధ వివరాలను నేరుగా అప్‌డేట్ చేయవచ్చు. మీ యూఏఎన్ అక్టోబర్ 1, 2017 కి ముందు జారీ చేస్తే ఏవైనా ప్రొఫైల్ అప్‌డేట్ చేయాలంటే ఇప్పటికీ యజమాని ఆమోదం అవసరం అని గమనించడం ముఖ్యం. అదనంగా ఆమోదాలు లేదా ఉపసంహరణలలో జాప్యాలను నివారించడానికి మీ ఆధార్, పాన్ మీ ఈపీఎఫ్ ఖాతాకు లింక్ చేయాలని నిపుణులు చెబుతున్నారు. ఈపీఎఫ్ఓ తీసుకున్న నిర్ణయంగా కోట్లాది మంది ఈపీఎఫ్ సభ్యులకు ప్రయోజనం చేకూరుతుంది. ఈపీఎఫ్ఓ దాదాపు 45 శాతం అప్‌డేట్ రిక్వెస్ట్ ఇక సెల్ఫ్ యాక్సెప్టెన్సీ పొందవచ్చు.

**ప్రొఫైల్ అప్‌డేట్ ఇలా**

- ఈపీఎఫ్ఓ అధికారిక వెబ్‌సైట్‌ను సందర్శించి యూనిఫైడ్ మెంబర్ పోర్టల్‌కి వెళ్లాలి.
- మీ యూఏఎన్, పాస్‌వర్డ్ మరియు క్యాప్చా ఉపయోగించి లాగిన్ అవ్వాలి.
- అనంతరం హోమ్ పేజీపై డిస్‌ప్లే అయ్యే మెనూ నుంచి మ్యానేజ్ అనే ఆప్షన్‌ను ఎంచుకోవాలి.
- 'ప్రాథమిక వివరాలను సవరించు' ఎంపికను ఎంచుకోవాలి.
- మీ ఆధార్ కార్డు ప్రకారం మీ వ్యక్తిగత వివరాలను నమోదు చేసి సమర్పించాలి.
- 'ట్రాక్ రిక్వెస్ట్' ఎంపికను ఉపయోగించి మీ ప్రొఫైల్ అప్‌డేట్ స్టేటస్‌ను ట్రాక్ చేయవచ్చు.

## ఐఆర్‌సీటీసీతో జతకట్టిన స్విగ్గీ.. 20 రాష్ట్రాల్లో సేవలు షురూ



ఆహార, కిరాణా సామగ్రి డెలివరీ సంస్థ స్విగ్గీ, ఇండియన్ రైల్వే క్యాటరింగ్ అండ్ టూరిజం కార్పొరేషన్ (ఐఆర్‌సీటీసీ) భాగస్వామ్యంతో దేశంలోని 20 రాష్ట్రాలలో 100 రైల్వే స్టేషన్లకు తన ఫుడ్ డెలివరీ సేవలను విస్తరించింది. ముఖ్యంగా రైలు ప్రయాణికులకు వారి సీటు వద్దే నేరుగా డెలివరీ పొందవచ్చని ఆ కంపెనీ ప్రతినిధులు చెబుతున్నారు. ఇకపై స్విగ్గీ ద్వారా రైలు ప్రయాణికులు 60,000 కంటే ఎక్కువ బ్రాండ్‌ల నుంచి దేశవ్యాప్తంగా 35 కంటే ఎక్కువ వంటకాల నుంచి 7 మిలియన్లకు పైగా మెనూ ఐటెమ్‌ల నుండి ఎంచుకోవచ్చు. భారతదేశంలో రైలు ప్రయాణం అనేది చౌకైన ప్రజారవాణా సాధనంగా ఉంది. అయితే ఈ రైలు ప్రయాణంలో ఆహారం అనేది చాలా సమస్యగా మారుతుంది. అయితే తాజాగా స్విగ్గీ ఫుడ్ సర్వీస్‌ను 100 స్టేషన్లకు విస్తరించడం వల్ల ప్రయాణీకులకు ఎక్కువ సౌలభ్యం కలుగుతుందని స్విగ్గీ ఫుడ్ మార్కెట్‌ప్లేస్ వైస్ ప్రెసిడెంట్ దీపక్ మాలూ అన్నారు. ప్రయాణీకులు స్విగ్గీలో ఉన్న దాదాపు 60,000 కంటే ఎక్కువ రెస్టారెంట్ బ్రాండ్‌ల ద్వారా వారు ఉన్న ఏరియాకు అనుగుణంగా ఆర్డర్ చేసుకోవచ్చు. స్విగ్గీ సీట్ గ్యారెంటీ డెలివరీ సర్వీస్ ద్వారా వినియోగదారులు తమకు నచ్చిన స్టేషన్‌లో తమ ఆహారాన్ని ముందస్తుగా ఆర్డర్ చేసుకోవచ్చు. స్విగ్గీ యాప్‌లో "ట్రైన్" అని శోధించి, ఆహారాన్ని డెలివరీ చేసే వారి ప్రయాణ ప్రణాళికలోని అన్ని స్టేషన్‌లను యాక్సెస్ చేయడానికి రైలు పీఎన్ఆర్‌ను నమోదు చేయాల్సి ఉంటుంది. రైలు ప్రయాణీకులకు ఇబ్బంది లేని భోజన అనుభవాన్ని అందించడానికి స్విగ్గీ రైలులో ఆహారం ఆర్డర్‌ల కోసం హామీ ఇచ్చేలా బ్రోచర్‌ను విడుదల చేసింది. ప్రతి భోజనంతో పాటు ఒక చెంచా, ఫోర్క్, టిష్యూ పేపర్‌ను పర్యావరణ అనుకూలమైన పర్సులో చక్కగా ప్యాక్ చేసి అందించనున్నారు. రైళ్లలో ఆహారాన్ని అందించడానికి మార్చి 2024లో స్విగ్గీ ఇండియన్ రైల్వే క్యాటరింగ్ అండ్ టూరిజం కార్పొరేషన్ (ఐఆర్‌సీటీసీ)తో చేతులు కలిపింది. గత సంవత్సరం స్విగ్గీ కేవలం 60 సెకన్ల హాల్ట్‌తో రైళ్లలో 35,000 ఆర్డర్‌లను డెలివరీ చేసింది. దాదాపు 54,000 మంది ప్రయాణికులు ఒకే ట్రిప్‌లో మల్టీ మీల్స్ ఆర్డర్ చేశారు. విజయవాడ జంక్షన్ గత సంవత్సరంలో అత్యధిక ఆర్డర్‌లను నమోదు చేసింది. తరువాత నెల్లూరు, సికింద్రాబాద్ జంక్షన్, కాట్పాడి జంక్షన్ ఉన్నాయి. ముఖ్యంగా కళ్యాణ్ జంక్షన్‌లో ప్రయాణికులు అతిపెద్ద ఆర్డర్ అంటే ఓ ఆర్డర్‌లో 41 బర్గర్‌లను ఆర్డర్ చేశారు. సాధారణ రైలు వంటకాలతో పాటు ప్రయాణీకులు టిబెటన్ బేక్డ్ చీజీ మోమోలు, మెక్సికన్ మష్‌రూమ్స్, చీజ్ క్యాసాడిల్లాలు, లెబనీస్ క్లాసిక్ పెప్పీ చికెన్ షావర్మాతో సహా విభిన్న వంటకాలను రైలు నుంచే ఆర్డర్ చేసుకోవచ్చు. రాబోయే నెలల్లో స్విగ్గీ దేశవ్యాప్తంగా మరిన్ని స్టేషన్లకు తన పరిధిని విస్తరిస్తుందని స్విగ్గీ ప్రతినిధులు చెబుతున్నారు. గత సంవత్సరం సెప్టెంబర్‌లో జొమాటో తన తాజా ఆఫర్ 'జొమాటో ట్రైన్ ఫుడ్ డెలివరీ' పేరుతో ఐఆర్‌సీటీసీతో జతకడుతున్నట్లు ప్రకటించింది.

## దుబాయ్ నుంచి ఎంత బంగారం తెచ్చుకోవచ్చు



బెంగళూరు విమానాశ్రయంలో కన్నడ నటి రన్యారావు 14.2 కిలోల బంగారాన్ని అక్రమంగా రవాణా చేస్తూ ఇటీవల పట్టుబడిన విషయంలో అందరికీ తెలిసిందే. అయితే చాలా మంది మన దేశంలో బంగారం దొరుకుతుంది కదా అక్రమంగా ఎందుకు రవాణా చేయడం అనే అనుమానం ఉంటుంది. అయితే మన దేశంలో ఉన్న దిగుమతి పన్నుల కారణంగా ముంబైతో పోలిస్తే దుబాయ్‌లో బంగారం మార్కెట్ ధర 11.5 శాతం కంటే తక్కువగా ఉంది. దుబాయ్‌లో బంగారం ధర 10 గ్రాములకు 3,260 యూఏఈ దిర్హామ్‌గా ఉంది. డాలర్లలో చెప్పాలంటే ధర 10 గ్రాములకు 887.63 డాలర్లు. రూపాయిలో అయితే రూ.77,281.46. అయితే ముంబైలో అమ్ముడవుతున్న 10 గ్రాముల బంగారం ధర రూ.87,480 ఉంది. అంటే దాదాపు 11.58 శాతం తక్కువ. అంతర్జాతీయ మార్కెట్లో న్యూయార్క్ కేంద్రంగా ఉన్న కమోడిటీ ఎక్స్ఛేంజ్‌లో ఔన్సు బంగారం ధర 2,908.9 డాలర్ల వద్ద ట్రేడవుతోంది. ఒక ఔన్స్ అంటే 28.3495 గ్రాముల బంగారం. అయితే దుబాయ్ నుంచి భారతదేశానికి బంగారాన్ని తీసుకువచ్చినప్పుడు కస్టమ్స్ సుంకాన్ని ప్రభుత్వం ప్రకటించిన బంగారం రేటు ఆధారంగా విధిస్తారు. ప్రస్తుతం బంగారంపై సుంకం ధర 10 గ్రాములకు 927 డాలర్లుగా ఉంది. ఫిబ్రవరి 28న సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఇన్‌డైరెక్ట్ టాక్సెస్ అండ్ కస్టమ్స్ (సీబీఐసీ) దీనిని గతంలో ఉన్న 938 డాలర్ల నుంచి తగ్గించింది. బంగారం దిగుమతి సుంకం ప్రస్తుతం 6 శాతంగా ఉంది. దీనిని ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ 2024-25 కేంద్ర బడ్జెట్‌లో 15 శాతం నుంచి 6 శాతానికి తగ్గించారు. దుబాయ్ నుంచి బంగారం తీసుకువస్తే 927 డాలర్ల బంగారం టారిఫ్ విలువపై 6 శాతం సుంకం విధిస్తారు. అంటే సుంకం 55.62 డాలర్లు అవుతుంది. మీరు దానిని రూపాయల్లోకి మారిస్తే 10 గ్రాములకు దాదాపు రూ.4,842 అవుతుంది.

## పిల్లల భవిష్యత్‌తో పాటు బోలెడంత పన్ను ఆదా..




ప్రస్తుత రోజుల్లో పెరుగుతున్న ఖర్చులు, అవసరాల నేపథ్యంలో భవిష్యత్ అంటే భయంగా ఉంటుందని సగటు మధ్యతరగతి కుటుంబాలు చెబుతూ ఉంటాయి. ముఖ్యంగా పిల్లల ఉన్నత విద్య ఖర్చుతో కూడుకున్న విషయం కాబట్టి ఆ ఖర్చు గురించి చాలా మంది భయపడుతూ ఉంటారు. ఈ నేపథ్యంలో పిల్లల ఆర్థిక భవిష్యత్ అందించడంతో పాటు పన్ను ఆదా చేసే టాప్ స్కీమ్స్ గురించి మరిన్ని వివరాలను తెలుసుకుందాం. పిల్లల భవిష్యత్తు కోసం తెలివిగా పెట్టుబడి పెట్టడానికి వారి పొదుపులను పెంచడమే కాకుండా పన్ను బాధ్యతలను తగ్గించే వ్యూహాత్మక విధానం అవసరమని నిపుణులు చెబుతున్నారు. పెట్టుబడులను వైవిధ్యపరచడంతో పాటు పన్ను సమర్థవంతమైన ఎంపికలను ఉపయోగించడం వల్ల పెద్ద మొత్తంలో నిధులను పొదుపు చేయవచ్చని చెబుతున్నారు. ఈఈఈ, ఈక్విటీ-లింక్డ్ సేవింగ్స్ కింద వర్గీకరించబడిన పథకాలు గణనీయమైన పన్ను ప్రయోజనాలను అందిస్తాయి. ఆ పథకాల గురించి మరిన్ని వివరాలను తెలుసుకుందాం.

**పబ్లిక్ ప్రావిడెంట్ ఫండ్, సుకన్య సమృద్ధి యోజన**

ఈ రెండు పథకాలు ప్రభుత్వ మద్దతుతో వచ్చే అత్యంత సురక్షితమైన పథకాల్లో ఈ పథకాల్లో ఆకర్షణీయమైన వడ్డీ రేట్లు అందుబాటులో ఉంటాయి. ఆదాయపు పన్ను చట్టంలోని సెక్షన్ 80సీ కింద రూ.1.5 లక్షల వరకు మొత్తాలను మీ పన్ను పరిధిలోకి వచ్చే ఆదాయం నుంచి మినహాయించవచ్చు. ఉపసంహరణ తర్వాత అసలు మొత్తం, వడ్డీ రెండూ పన్ను మినహాయింపు పొందుతాయి. ఈ రెండు పథకాలు ఈఈఈ పెట్టుబడిగా ఉంటాయి. అయితే సుకన్య సమృద్ధి యోజన ఆడపిల్లలకు మాత్రమే వర్తిస్తుంది.

**నేషనల్ సేవింగ్స్ సర్టిఫికేట్, పోస్ట్ ఆఫీస్ సేవింగ్ స్కీమ్**

ఈ రెండు పథకాలు ఉపసంహరణపై వచ్చే వడ్డీపై పన్ను విధిస్తారు. అయితే పెట్టుబడిపై పన్నులను ఆదా చేయడానికి ఎన్ఎస్‌సీ ఆకర్షణీయమైన ఎంపిక అని నిపుణులు చెబుతున్నారు. సెక్షన్ 80సీ కింద మీరు 1.5 లక్షల వరకు మినహాయింపును క్లెయిమ్ చేయవచ్చు. మరోవైపు పోస్ట్ ఆఫీస్ సేవింగ్స్ ఖాతా ఒక ఆర్థిక సంవత్సరంలో వడ్డీలో 10,000 వరకు పన్ను మినహాయింపును అందిస్తుంది.

## వేణుగోపాలస్వామి ఆలయంలో తిరుక్కళ్యాణ బ్రహ్మోత్సవాలు

**-ఆలయ చైర్మన్ పల్ల మురళి**





**సుల్తానాబాద్, మార్చి 07(నినాదం న్యూస్):** శ్రీ సంతాన వేణుగోపాల స్వామి వారి అధ్యయనో త్సవ యుక్త తిరుక్కళ్యాణ బ్రహ్మోత్సవాలు శని వారం ఘనంగా ప్రారంభమయ్యాయని అని, భక్తు లు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చే యాలని ఆలయ కమిటీ చైర్మన్ పల్ల మురళీధర్ పట్టణ ప్రజలకు పిలుపునిచ్చారు. భక్తులకు ఎలాం టి ఇబ్బందులు కలగకుండా ప్రత్యేక ఏర్పాటు చే స్తున్నామని అన్నారు. శనివారం సుల్తానాబాద్ మండల కేంద్రంలోని శ్రీ సంతాన వేణుగోపాల స్వా మి ఆలయంలో ఆయన మాట్లాడుతూ, ఈ కార్య క్రమానికి ముఖ్య అతిథిగా పెద్దపల్లి ఎమ్మెల్యే చిం తకుంట విజయ రమణారావు హాజరవుతారని అన్నారు. 8 న శనివారం తిరువాయి మోజీ ద్రావి డ దివ్యప్రబంధ పారాయణం, అనంతరం తీర్థ ప్ర సాదరం,9న ఆదివారం ఉదయం 9 గంటల నుండి 6 గంటల వరకు దివ్య ప్రబంధం సేవా కాలం, 10 న సోమవారం సాయంత్రం 4 గంటలకు శ్రీ వాసవి కన్యకాపరమేశ్వరి దేవాలయంలో ఎదుర్కోలు కా ర్యక్రమం అనంతరం శ్రీ సంతాన వేణుగోపాల స్వా మి తిరుక్కల్యాణం, 11న మంగళవారం నిత్యా హవనం,బలిహరణం తీర్థ ప్రసాదం,12న బుధవా రం రథహోమం, పూర్ణాహుతి రథోత్సవం,గుడిమీ ట్ట శివాలయంలో స్వామివారి తెప్పోత్సవం,రంగు లు చల్లు కోవటం, హోలీ ఆటలు నిర్వ హించబడు నని అన్నారు. ఈ బ్రహ్మోత్సవాలకు భక్తులందరూ అధికసంఖ్యలోపాల్గొని సంతాన వేణుగోపాల స్వా మి ఆశీస్సులు పొందగలరని కోరుచున్నాను.

## నీరా కేఫ్ గీత కార్పొరేషన్ సంస్థకు బదిలీ

- మంత్రి పొన్నం ప్రకటనను స్వాగతిస్తున్నాం
- సుల్తానాబాద్ గౌడ సంఘశ్రేణులు



**సుల్తానాబాద్, మార్చి 08(నినాదం న్యూస్):** నీరా కేఫ్ భవనంను గీత కార్పొరేషన్ సంస్థకు బది లీ నీ రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్ ప్రకటన స్వాగతి స్తున్నామని సుల్తానా బాద్ గౌడ సం ఘ శ్రేణులు అన్నారు. ఈ సందర్భంగా వారు మా ట్లాడుతూ ప్రభుత్వంలో ఉన్న గౌడ జాతి ముద్దు బిడ్డలు రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్, టిసిపిసి అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ లు ఉ న్నత పదవులు పొందిన వారిని చూసి గౌడ జాతి గర్వపడుతుందని అన్నాడు. గౌడ సంఘం కోసం న్యాయమైన కోరికలు సుల్తానాబాద్ గౌడ సంఘా నికి ఐదు ఎకరాల భూమి కలదని అందులో హై బ్రిడ్ తాటి,ఈత వనం పెంచడానికి, సొసైటీ తరఫు న కూరగాయల పెంపకానికి నిధులు మంజూరు చేయాలని కోరారు. సుల్తానాబాద్ మున్సిపల్ కేం ద్రం పారిశ్రామిక కేంద్రంగా గణనీయంగా అభివృద్ధి చెందింది,నీరా కేఫ్ అనువైన పట్టణం గనక సొసైటీ కి అధిక నిధులు కేటాయించి, గౌడ నిరుద్యోగ యు వతకు ఆదుకోవాలని కోరారు. అలాగే మున్సిపల్ దుకాణసముదాయంలో షెటర్లు,ఐబి ముందు ఖా ళీ స్థలం,పాత తాహసిల్దార్ కార్యాలయం స్థలంలో గౌడ నిరుద్యోగ యువతకు ఉపాధి కోసం స్థలం కే టాయించి, వారి విన్నపాన్ని నెరవేర్చాలని అంత టి లచ్చయ్య గౌడ్, పొన్నం తిరుపతి గౌడ్, కర్ణాకర్ గౌడ్, పి.తిరుపతి గౌడ్, కొమురయ్య గౌడ్, ఓదెల గౌడ్, లచ్చయ్య గౌడ్, రామచంద్ర గౌడ్, రమేష్ గౌ డ్,లు కోరారు.

## సమాజాభివృద్ధిలో మహిళల పాత్ర కీలకం

- సుల్తానాబాద్ సీఐ సుబ్బారెడ్డి
- పోలీస్ స్టేషన్ లో మహిళా దినోత్సవ వేడుకలు



**సుల్తానాబాద్, మార్చి 08 (నినాదం న్యూస్):** సమాజ అభివృద్ధిలో మహి ళల పాత్ర కీలకమని, మహిళలు ఆర్థికంగా ఎదిగిన ప్పుడే అది సాధ్యమ వుతుం దని సుల్తానాబాద్ సిఐ సుబ్బా రెడ్డి అన్నారు. శనివారం ఆయన సుల్తానాబాద్ మండల కేం ద్రంలోని పోలీస్ స్టేషన్ లో అంతర్జాతీయ మహిళా దినోత్సవం ను పురస్కరించుకొని రిటైర్డ్ ప్రధానో పాధ్యాయురాలు అల్లం భాగ్య లక్ష్మి,యోగా లో ఖే ల్ యువరత్న పురస్కారం పొందిన జాపతి ఆమ నిలను ఎస్సై శ్రావణ్ కుమార్ తో కలిసి ఘనంగా శాలువాతో సన్మానించి, మహిళా దినోత్సవ శుభా కాంక్షలు తెలిపారు. మహిళ ఆది పరాశక్తి రూపం అని, నారీ శక్తి ముందు ఏ శక్తి నిలువ లేదని ,నారీ శక్తిని ప్రపంచానికి చాటుదామని ఆయన పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో 2వ ఎస్ ఐ వేణు తో పాటు పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా మహిళా దినోత్సవ వేడుకలు



**మంథని మార్చి 8( నినాదం న్యూస్):** అంతర్జాతీయ మహిళల దినో త్సవం సందర్భంగా శనివారం రోజున మంథని పట్టణంలోని గోదావరి అర్బన్ బ్యాంకు లో మహిళా దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మంథని జడ్జి స్వాతి గౌడ్ ఉమెన్స్ డే మెమెం టోస్ ను అందించి శాలువాతో ఘనంగా సత్కరించారు, ఈ సందర్భంగా మేనేజర్ రమేష్ మాట్లాడుతూ మహిళా దినోత్సవం పురస్కరించుకొని గోదావరి అర్బన్ బ్యాంకులో డిపాజిట్లపై 0.50 శాతం ఇతర బ్యాంకుల కంటే ఎక్కువ వడ్డీ ఉంటుందని తెలిపారు. ఈ అవకాశాన్ని మహిళలు అందరూ వినియోగించుకోవాలని కోరారు. బ్యాంకు మేనేజర్ కొరవెన రమేష్, సిబ్బంది శంకర్, గణేష్, శిరీష తోపాటు లాయర్ లత, ఏపిఎం పద్మ, ఉపాధ్యాయురాలు స్రవంతి, మహిళ గ్రూప్ సభ్యులు పాల్గొన్నారు

## ప్రభుత్వ ఉపాధ్యాయుల సమస్యలు వెంటనే పరిష్కరించాలి



**మంథని మార్చి 8 (నినాదం న్యూస్):** కాంగ్రెస్ ప్రభుత్వం ప్రభుత్వ ఉపాధ్యాయ ఉద్యోగుల సమస్యలు వెంటనే పరిష్కరించాలని కాళేశ్వరం దేవస్థానం మాజీ చైర్మన్, జేఏసి పెన్షనర్స్ కార్యవర్గ సభ్యులు అవధానుల మోహన శర్మ శనివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటమికి ప్రభుత్వ ఉపాధ్యాయ ఉద్యోగులే కారణమని ఆయన తెలిపారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ఉపాధ్యాయ, ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని ఆయన పేర్కొన్నారు. పెండింగ్ లో ఉన్న బకాయిలను, 317 జీఓ సమస్యను వెంటనే పరిష్కరించాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

# మహిళలు ఉన్నత స్థాయికి ఎదగాలి

- సింగరేణి ఆధ్వర్యంలో మహిళ దినోత్సవ వేడుకలు




**మంచిర్యాల ప్రతినిధి, మార్చి 8 (నినాదం న్యూస్):** మహిళలు అన్ని రంగాల్లో రాణించి ఉన్నత స్థాయికి ఎదగాలని శ్రీరాంపూర్ జీఎం శ్రీనివాస్ పేర్కొన్నారు. శనివారం అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు శ్రీరాంపూర్ కాలనీలోని ప్రగతి మైదానంలో గల సిఇఆర్ క్లబ్ లో సేవా అధ్యక్షు రాలు ఉమారాణితో కలిసి ప్రారంభించారు. ఈ సంద ర్భంగా వారు మాట్లాడుతూ అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలను శ్రీరాంపూర్ యాజమాన్యం అత్యంత ఘనంగా నిర్వహించుకోవడం చాలా సంతోషకరమైన విషయమని పేర్కొన్నారు. ఈ రోజుల్లో మహిళలు పురుషులతో సమానంగా అన్ని రంగాలలో తమ నైపుణ్యాన్ని ప్రదర్శిస్తున్నారని మహిళలు అనేక రంగాలలో వివిధ సంస్థలలో అధిపతులుగా ఉండటం చెప్పుకోదగిన విషయమని గుర్తు చేశారు. మహిళలు వివిధ కంపెనీలలో పని చేస్తూ వారి యొక్క వృత్తిని మరియు కుటుంబ బాధ్యతలను దిగ్విజయంగా పూర్తి చేయడం పేర్కొనదగిన విషయమని తెలియజేశారు. అలాగే సింగరేణి సేవా సమితి ద్వారా శ్రీరాంపూర్ ఏరియాలో వివిధ వృత్తి శిక్షణ కోర్సులను శ్రీరాంపూర్ ఏరియా పరిసర ప్రాంత మహిళలు నేర్చుకోవడం అలాగే వారు సొంతంగా తమ కాళ్ళ పైన తాము నిలబడడానికి చేస్తున్న ప్రయత్నం అనిర్వచనీయం అని పేర్కొన్నారు. మహిళలు తమ శక్తి సామర్థ్యాలను పెట్టి ఏ రంగంలోనైనా ముందుండడానికి కృషి చేస్తున్నారని వారిని ఆదర్శంగా తీసుకొని ప్రతి ఒక్కరూ ముందుకు వెళ్లాలని కోరారు. అలాగే శ్రీరాంపూర్ ఏరియాలో పనిచేస్తున్న ఇద్దరు మహిళా ఉద్యోగులను జనరల్ మేనేజర్ దంపతులు ఘనంగా సన్మానించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఏఐటియుసి వైస్ ప్రెసిడెంట్ శ్రీ కొట్టె కిషన్ రావు గారు, అధికారుల సంఘం శ్రీరాంపూర్ ఏరియా అధ్యక్షులు శ్రీ కె వెంకటేశ్వర్ రెడ్డి గారు, డిజిఎం పర్సనల్ శ్రీ పి అరవింద రావు తదితరులు పాల్గొన్నారు.

## మేరు సంఘం ఆధ్వర్యంలో మహిళా దినోత్సవ వేడుకలు

**-కుట్టుపని మహిళలకు సన్మానం**



**పెద్దపల్లి రూరల్ మార్చి 8 (నినాదం):** అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురస్కరిం చుకొని పెద్దపల్లి పట్టణంలో కుట్టుపనులు చేసు కుంటూ కుటుంబాలను పోషిస్తున్న మహిళలను సంఘంనాయకులు పూలమాలలు, శాలువాలు కప్పి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మేరు సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు,పెద్దపల్లి జిల్లా మేరుసంఘం ఉపాధ్యక్షుడు కీర్తి రాజయ్య మాట్లాడుతూ,కేంద్ర రాష్ట్ర ప్రభు త్వాలు వృత్తిపరమైన కుట్టుపనుల విషయంలో మేరు కులస్తులను గుర్తించి వారికి తగిన శిక్షణ ఇప్పించి రుణసౌకర్యంతో ఆర్థికాభివృద్ధి చెందేలా ప్రోత్సా హం అందించాలి. టైలరింగ్ వృత్తిపై ఆధారపడి జీవనం సాగిస్తున్న పొడిశెట్టి పద్మను శాలువా పూలమాలతో సత్కరించారు. బట్టలు కుట్టి జీవనం సాగిస్తున్న వారిని ప్రభుత్వపరంగా రాయితీ రుణాలు ఇచ్చి ఆదుకోవాలని కోరారు.

## మహిళా సాధికారితతోనే అభివృద్ధి సాధ్యం

- మాజీ మున్సిపల్ చైర్ పర్సన్ పుట్ట శైలజ



**మంథని మార్చి 8( నినాదం న్యూస్):** మహిళ సాధికారితతోనే అభివృద్ధి సాధ్యమని మంథని మున్సిపల్ మాజీ చైర్ పర్సన్ పుట్ట శైలజ అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా శనివారం మంథని పట్టణంలోని రాజగృహాలో మహిళా దినోత్సవ వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి పలువురు మహిళలను ఘనంగా సన్మానించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ మహిళలు వంటింటికే పరిమితం కాకుండా ముందడుగు వేయాలన్నారు. ఆనాడు సావిత్రీబాయి పూలే గొప్ప ఆలోచనతో అక్షరజ్ఞానం నేర్చుకున్న ప్రతి మహిళ అన్ని రంగాల్లో రాణించాలన్నారు. కుటుంబ బాధ్యతల్లో విభిన్న పాత్రలుపోషించే మహిళలను ప్రోత్సహించాలన్నారు. ఈనాడు కల్పన చావ్లా అంతరిక్ష రోధసిలో పాల్గొని మహిళాలోకానికి ఆదర్శంగా నిలిచిందన్నారు. అంతేకాకుండా అట్టడుగువర్గాల కోసం సావిత్రీబాయిపూలే, దుర్గాబాయి దేశ్‌ముఖ్, చాకలి ఐలమ్మ, సరోజినీనాయుడు లాంటి ఎంతో మహిళలు వీరనారీమణులుగా నిలిచారని ఆమె ఈ సందర్భంగా గుర్తు చేశారు. ప్రతి మహిళ సాధికారిత సాధిస్తేనే రాష్ట్ర, దేశం అన్ని విధాలుగా అభివృద్ధి చెందుతుందన్నారు. రాబోయేరోజుల్లో మహిళలు ఉన్నతస్థాయిలో ఉండేలా కృషి చేయాలని ఆమె ఈ సందర్భంగా పిలుపునిచ్చారు. మంథని నియోజకవర్గంలోని మహిళలకు ఈ సందర్భంగా ఆమె అంతర్జాతీయ మహిళా దినోత్సవ శుబాకాంక్షలు తెలిపారు.

## అంబేద్కర్ విగ్రహానికి చెప్పుల దండ వేసిన వారిని కఠినంగా శిక్షించాలి



**సుల్తానాబాద్, మార్చి 08 (నినాదం న్యూస్):** జగిత్యాల జిల్లా సారంగపూర్ మండలం నాగును ర్ గ్రామం లో కొందరు గుర్తుతెలియని వ్యక్తులు భా రత రాజ్యాంగ నిర్మాత డా. బీ ఆర్ అంబేద్కర్ వి గ్రహానికి చెప్పుల దండ వేసిన వారిపై కఠిన చర్య లు తీసుకోవాలని పట్టణ అంబేద్కర్ సంఘం అ ధ్యక్షుడు ఆరేపల్లి రాహుల్ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా సుల్తానాబాద్ మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహానికి పాలభిషేకం చేసి, పూలదం డ వేశారు. అనంతరం సిఐ సుబ్బారెడ్డి, ఎస్సై శ్రా వణ్ కుమార్ కు ఫిర్యాదు చేసి, అంబేద్కర్ ను అ వమాన పరిచిన వారిపై కఠిన చర్యలుతీసుకోవా లని కోరారు. ఈ కార్యక్రమంలో అంబేద్కర్ సంఘం అధ్యక్షులు ఆరెపల్లి రాహుల్, ఉపాధ్యక్షులు ఆరెప ల్లి రాకేష్,ఆరెపల్లి సరేష్, దళిత సంఘం నాయకు లు తాంద్ర అంజన్న,నాంపల్లి, ప్రధాన కార్యదర్శి ప్ర దీప్,మోహన్,కిషోర్,ప్రశాంత్, ప్రణయ్ సాయి, దా స్, ఉదయ్,సాయి తో పాటు దళిత సంఘాల నా యకులు పాల్గొన్నారు.

## గాయత్రి డిగ్రీ,పీజీ కళాశాలలో మహిళా దినోత్సవ వేడుకలు



**పెద్దపల్లి, మార్చి 08(నినాదం న్యూస్):** పెద్దపల్లి జిల్లాలోని గాయత్రి డిగ్రీ అండ్ పీజీ కళాశాలలో శనివారం అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా డిస్టిక్ లీగల్ సర్వీసెస్ అథారిటీ సెక్రటరీ కే. స్వప్నారాణి విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. మహిళలు అన్ని రంగాలలో రాణిస్తున్నారని ఐఏఎస్, ఐపీఎస్, డాక్టర్లుగా, లాయర్లుగా, ఇంజనీర్లుగా, ఉపాధ్యాయులుగా, సాఫ్ట్వేర్, ఆర్మీ ,నేవీ వ్యాపార రాజకీయ రంగాలలో తమదైన శైలిలో ముందుకు దూసుకెళ్తున్నారని తెలిపారు. అదేవిధంగా పనిచేసే ప్రదేశాలలో మహిళలపై అక్రమాల గురించి, సైబర్ నేరాల గురించి సోషల్ మీడియాలో జరిగే వాటిపట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. మహిళలు ప్రతి రంగంలో ముందంజలో ఉండాలని తెలిపారు. అదేవిధంగా గాయత్రీ విద్యానికేతన్ కరస్పాండెంట్ అల్లెంకి రజనీ దేవి మాట్లాడుతూ విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ ఈ స్థాయి నుండి కష్టపడి చదివి మీ యొక్క తల్లిదండ్రుల కలలు సాధించాలని భవిష్యత్తులో మంచి పునాదులు వేసుకోవాలని సూచించారు. ముఖ్య అతిథి గా విచ్చేసిన స్వప్న రాణి,రజినీదేవి లను అదేవిధంగా కళాశాల మహిళా ఉపాధ్యాయురాళ్లని సత్కరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధినేత అల్లెంకి శ్రీనివాస్, ప్రిన్సిపాల్ జే. రవీందర్ మరియు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## సృష్టికి మూలం స్త్రీ : ఏ.జి.పి, ఉప్పు రాజన్న



**పెద్దపల్లి మార్చి 8 (నినాదం న్యూస్):** నేడు అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహిం చారు. పెద్దపల్లి జిల్లా కేంద్రంలోని స్థానిక అయ్యప్ప స్వామి దేవాలయం చౌరస్తాలోని వారి కార్యాలయంలో పెద్దపల్లి మున్సిపల్ 22 వ వార్డు మహిళా సోదరీమణులను శాలువాలతో ఘనంగా సత్కరించి, చీరలు బహుమతి ప్రధానం చేసినపెద్దపల్లి సీనియర్ సివిల్ జడ్జ్ కోర్టు గవర్నమెంట్ అసిస్టెంట్ లీడర్ ఏ.జి.పి, తాజా మాజీ కౌన్సిలర్ ,శ్రీ చైతన్య యూత్ క్లబ్ వ్యవస్థాపక అధ్యక్షులు,ఉప్పు రాజన్న ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ,మహిళల అభివృద్ధి అంటేనే సమాజ పురోగతి అని మహిళా సాధికారత సాధ్యమైనప్పుడే దేశాభివృద్ధి పూర్తిగా సహకారం అవుతుందని అప్పుడే మహిళలు అన్ని రంగాల్లో అభివృద్ధి సాధిస్తారన్నారు. పురుషుడి జీవితంలో అడుగడుగునా మహిళలే మహారాణిగా,అమ్మగా,అక్కగా, చెల్లగా,భార్యగా,బిడ్డగా వివిధ పాత్రల్లో మగాడికి విలువను పెంచేది, విలువలు నేర్పేది స్త్రీయే అని గుర్తు చేశారు. మహిళలందరినీ గౌరవించుకొని వారినీ బాధ్యతగా కాపాడుకోవడం మన అందరి పైన ఉందన్నారు. అంతేకాకుండా మహిళలు వివిధ రంగాలలో చేసే వృత్తిరీత్యాపరంగా మహిళలపై జరిగే అక్రమాలు,సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని ఉప్పు రాజన్న సూచించారు. మహిళలు ప్రతి రంగంలో ముందుండి విజయం సాధించాలన్నారు. ఈ కార్యక్రమంలో నాగుల ఓదెలు,ఉప్పు రాంచందర్, గట్టయ్య,ఆర్.పి.వనజ,బూత్కూరి నర్సింగం, కుమార్,శ్రీపతి ప్రభాకర్, కొంతం సురేష్,నక్క సుధాకర్,ఆసిఫ్, సలీం,అశోక్,తాళ్ల కళ్యాణ్,మహమ్మద్ అరిఫ్ అలీ,మహిళా సోదరీమణులు మరియు వార్డు ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి



**మంచిర్యాల ప్రతినిధి, మార్చి 8 (నినాదం న్యూస్):** కుటుంబాన్ని తీర్చిదిద్దడం నుండి దేశాన్ని పాలించే వరకు అన్ని రంగాల్లో మహిళలు రాణించాలని కలెక్టర్ కుమార్ దీపక్, ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావు అన్నారు. శనివారం జిల్లాలోని నస్పూర్లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో జిల్లా స్త్రీ, శిశు సంక్షేమశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలలో డి.సి.పి. ఎ.భాస్కర్ లతో హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో మహిళలు సామాజికంగా ఎంతో తోడ్పాటు అందిస్తున్నారని, దేశం ప్రథమ పౌరురాలి స్థానంతో పాటు ముఖ్యమంత్రులు, మంత్రులు, ఐ.ఎ.ఎస్., ఐ.పి.ఎస్., ఆర్మీ, నేవి, ఎయిర్ఫోర్స్, శాస్త్రవేత్తలుగా అన్ని రంగాలలో రాణిస్తున్నారని పేర్కొన్నారు. ప్రతి రంగంలో వారి ఉత్తమ ప్రతిభ కనబ రుస్తున్న మహిళలు సాధిస్తున్న విజయాలకు గుర్తించినిచ్చి మరింత ప్రోత్సాహించాలని అన్నారు. లింగ బేధం లేకుం డా అబ్బాయిలను, అమ్మాయిలను ఒకేలా చూస్తూ సమాన అవకాశాలు కల్పించాలని, తద్వారా మహిళలు ఎదగడానికి ఎక్కువ అవకాశాలు అందించడం జరుగుతుందని తెలిపారు. ఓర్పు, సహనంతో కుటుం బాన్ని తీర్చిదిద్దడంతో పాటు సంస్కారం కలిగిన భావితరాలను అందించడంలో మహిళల పాత్ర ఎంతో ముఖ్యమని అన్నారు.

## బీసీలకు రిజర్వేషన్ కల్పించడం హర్షనీయం



**మంథని మార్చి 8 (నినాదం న్యూస్):** బీసీలకు ఉద్యోగ ఉపాధి రాజకీయ రంగాలలో 42 శాతం రిజర్వేషన్ కల్పించడం హర్షనీయమని పెద్దపెల్లి జిల్లా కాంగ్రెస్ పార్టీ బీసీ సెల్ ప్రధాన కార్యదర్శి గోటికార్ కిషన్ జి శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. బీసీ, ఎస్సీ అభివృద్ధికి చిత్తశుద్ధితో పనిచేస్తున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మేనిఫెస్టో కమిటీ చైర్మన్, ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబుకు ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

## మంథని డివిజన్ మీడియా ప్రెస్ క్లబ్ సర్వసభ్య సమావేశం విజయవంతం




**మంథని టౌన్ మార్చి 08 (నినాదం న్యూస్)** మంథని డివిజన్ మీడియా ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు మోతుకూరి శ్రీనివాస్ అధ్యక్షతన డివిజన్ మీడియా ప్రెస్ క్లబ్ లో సర్వసభ్య సమావేశం శనివారం మంథనిలో నిర్వహించారు. ఈ సమావేశంలో డివిజన్ ప్రెస్ క్లబ్ కార్యవర్గ కమిటీతో పాటు కమాన్ పూర్, ముత్తారం,రామగిరి,మంథని పాత్రికేయులు హాజరయ్యారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు నాలుగు మండలాల సభ్యుల అభిప్రాయాలను తెలుసుకుని ప్రెస్ క్లబ్ విధి విధానాలను సభ్యులకు వివరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మంథని డివిజన్ మీడియా ప్రెస్ క్లబ్ రాజకీయాలకు,కులాలకు, మతాలకు,వర్గాలకు అతీతంగా అన్ని వర్గాల ప్రజల సమస్యలను వార్తలుగా మలిచి ప్రజల కోణం నుంచి అందిస్తుందని అన్నారు. అలాగే పాత్రికేయుల సమస్యలపై అలుపెరుగని పోరాటం చేస్తుందని తెలిపారు. పాత్రికేయులపై అక్రమ కేసులు నమోదు చేస్తే వాటిని ఎత్తి వేసే వరకు న్యాయపోరాటం చేస్తుందని అన్నారు. పాత్రికేయులు విధి నిర్వహణలో ప్రమాదాలకు గురైతే వారికి,వారి కుటుంబాలకు ప్రెస్ క్లబ్ అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. పాత్రికేయ మిత్రులు నాణ్యమైన, ఆలోచన ఆలోచణాత్మకమైన ,విశ్లేషణాత్మకమైన, పరిశోధణాత్మకమైన వార్తలు అందించి ప్రజల అభిమానాన్ని చూరగొనాలని సూచించారు. పాత్రికేయ వృత్తి గౌరవ ప్రధమైనదని దానికి భంగం కలగకుండ ప్రతి ఒక్కరు పని చేయాలని సూచించారు. పాత్రికేయులకు ప్రభుత్వం నుంచి దక్కాల్సినహక్కులనుసాధించుకొనుటకు సమిష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కార్యవర్గ కమిటీ ఉపాధ్యక్షులు జబ్బర్ ఖాన్, బొల్లవరం విజయనంద రావు,ప్రధాన కార్యదర్శి కొడారి మల్లేష్ యాదవ్, సహాయ కార్యదర్శి లు మాదరబోయిన కిషన్, మాటేటి కుమార్, కోశాధికారి గడిపల్లి అజయ్ కార్యవర్గ సభ్యులతో పాటు నాలుగు మండలాలకు చెందిన సుమారు 40 మంది పాత్రికేయసభ్యులు సమావేశంలో పాల్గొన్నారు.

## మహిళా దినోత్సవ సందర్భంగా మహిళ కానిస్టేబుల్స్‌కు సన్మానం



**చెన్నూర్, మార్చ్ 8 ( నినాదం న్యూస్ ):** కోటపల్లి పోలీస్ స్టేషన్ లో శనివారం చెన్నూర్ రూరల్ సీఐ సుధాకర్ ఆధ్వర్యంలో మహిళా దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ముందుగా మహిళా కానిస్టేబుల్స్ మౌనిక, మయూరి, దీక్షిత, రాజేశ్వరి లను సన్మానించి బహుమతులను అందచేశారు. మహిళలు అన్ని రంగాల్లోనూ ఉన్నత స్థాయికి చేరుకుంటున్నారని దేశంలో అన్ని రంగాల్లో పురుషుల కంటే మహిళలు వివిధ రంగాల్లో మెరుగ్గా రాణిస్తున్నారని పేర్కొన్నారు. మహిళలకు పురుషులతో సమానంగా అన్ని రంగాల్లోనూ సమాన హక్కులు ఉన్నాయని, మహిళా అధికారులందరూ తమ పూర్తి శక్తితో పని చేయాలని, తమ కలల సాకారం కోసం అహర్నిశలూ పాటుపడాలని సూచించారు. పురుషుల కంటే స్త్రీలకు నిబద్ధత ఎక్కువ అని, కమీషనరేట్ పోలీసు శాఖలో పలు విభాగాల్లో మహిళ పోలీసు అధికారులు, సిబ్బంది సమర్థవంతంగా పనిచేస్తున్నారని, అన్నారు. మారుమూల ప్రాంతాల్లో సమర్థవంతంగా విధులు నిర్వహిస్తున్న మహిళా కానిస్టేబుల్స్ అందరికి ఆదర్శం అని అన్నారు. ప్రతి ఒక్కరూ ఉన్నత లక్ష్యం తో ముందుకు సాగి మంచి పేరు తెచ్చుకోవాలని చెన్నూరు రూరల్ సీఐ సుధాకర్ కోరారు.



# వేసవి కార్యాచరణ పనులు వేగవంతం

- ఎన్పీడీసీఎల్ ఎస్ఈ షాలియా నాయక్



**మెట్‌పల్లి, మార్చి8 (నినాదం):** జిల్లాలో వేసవి కార్యాచరణ ప్రణాళిక లో భాగంగా చేపట్టిన విద్యుత్ పనులు వేగవంతం చేశామని ఏప్రిల్ నెలాఖరు వరకు వివిధ మండలాల్లో, పట్టణాల్లో నిర్దేశించుకున్న పనులు పూర్తిచేసి లక్ష్యాలు సాధిస్తామని జగిత్యాల ఎన్పీడీసీఎల్ ఎస్ఈ శాలియా నాయక్ అన్నారు. జగిత్యాల జిల్లా మెట్ పల్లి రూరల్ సెక్షన్ పరిధిలో ఆత్మకూరు, మెట్ల చిట్టాపూర్ సబ్ స్టేషన్లలో అదనపు వాక్యూమ్ సర్క్యూట్ బ్రేకర్ లు ఆయన ప్రారంభించారు. తద్వారా సుమారు 1000 మంది రైతులకు నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయగలమని పేర్కొన్నారు. గతంలో ఒకే బ్రేకప్ పై రెండు లేక అంతకంటే ఎక్కువ ఫీడర్లు ఉండడం వలన విద్యుత్ సరఫరా లో తీవ్ర అంతరాయాలు జరిగేవి. కానీ ప్రస్తుతం అన్ని సబ్ స్టేషన్లలో ప్రతి ఫీడర్ కు ఒక ప్రత్యేక బ్రేకర్ నిర్మాణం చేస్తున్నామని తెలిపారు. రైతులు తమ పంప్ సెట్ లకు విధిగా కెపాసిటర్లు బిగించుకోవాలని డీఈ గంగారం సూచించారు. వేసవి తీవ్రత రోజురోజుకు పెరుగుతున్న దృష్ట్యా, వెల్లుల్ల మేజర్ గ్రామపంచాయతీ పరిధిలో ఒకే రోజు మూడు 100కెవిఎ ట్రాన్స్ఫార్మర్లు ప్రారంభించి, గ్రామంలో లోఓల్టేజ్, ఓవర్ లోడ్ సమస్యలను పరిష్కరించగా గ్రామస్తులు విద్యుత్ అధికారులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో డీఈలు గంగారాం, రవీందర్, ఏడీఈ దురిశెట్టి మనోహర్, ఏఈ అజయ్, సిబ్బంది, వీడీసీ సభ్యులు, రైతులు పాల్గొన్నారు.

# ముందడుగే లక్ష్యం వైపు నడిపిస్తుంది

- విజయంలో అందరి ప్రోత్సహం అవసరమే
- జూనియర్ సివిల్ జడ్జి అఖిల





**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (నినాదం):** ప్రతి మహిళ ప్రయత్నలోపం లేకుండా ఒక్క అడుగు ముందుకు వేస్తే అదే లక్ష్యం దిశగా నడిపిస్తుందని భూపాలపల్లి అదనపు కోర్టు జూనియర్ సివిల్ జడ్జి జి. అఖిల అన్నారు. సింగరేణి సంస్థ భూపాలపల్లి ఏరియా ఆద్వర్యంలో ఇల్లెందు క్లబ్‌లో నిర్వహించిన అంతర్జాతీయ మహిళా దినోత్సవం వేడుకల్లో ఆమె పాల్గొని మాట్లాడుతూ ప్రతి మహిళ వంటింటికే పరిమితం కాకూడదని, ఏదో సాధించాలనే తపన ఉండాలన్నారు. ఇంట్లో సాధారణ మహిళగానే ఉన్న ఎంతో మంది మహిళలు తమ లక్ష్యాన్ని సాధించుకున్నారని ఆమె గుర్తు చేశారు. ప్రతి మహిళ విజయానికి కుటుంబసభ్యుల ప్రోత్సహం అవసరమని, తన విజయంలో సైతం తల్లిదండ్రులతో పాటు భర్త ప్రోత్సాహం ఉందని తెలిపారు. డాక్టర్ ఎస్ పద్మజ మాట్లాడుతూ మహిళలు ఆరోగ్యం పట్ల జాగ్రత్త వహించాలని కోరారు. కుటుంబబాధ్యతల్లో మునిగిపోయే ప్రతి మహిళ తన ఆరోగ్యాన్ని పట్టించుకోరని, త్యాగం చేయడంలో మహిళకు సాటి ఎవరూ ఉండరన్నారు. ఎస్ఈడబ్ల్యూఏ భూపాలపల్లి అధ్యక్షురాలు సునీత రాజేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ మహిళల పాత్ర చాలా ఉన్నతమైందని, తల్లిగా, చెల్లిగా, కూతురుగా తన కుటుంబం పట్ల ఎంతో బాధ్యతగా తన జీవితాన్ని అంకితం చేస్తుందని తెలిపారు. పూర్వం రోజుల్లో స్త్రీలను చాలా చిన్న చూపు చూసేవారని కానీ మారుతున్న సమాజానికి అనుగుణంగా నేటి స్త్రీ అన్నీ రంగాలలో ముందంజ వేస్తున్నదని తెలిపారు. ముఖ్యంగా స్త్రీలు తమ కాళ్ల మీద తాము నిలబడే విధంగా ఉండాలని అందుకు ప్రతి మహిళ ఆత్మ విశ్వాసంతో జీవించాలని కోరారు. ప్రతి మహిళ ఆర్థిక స్వావలంబన సాధించాలని కోరారు. అనంతరం మహిళా దినోత్సవం సందర్భంగా నిర్వహించిన పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ వేడుకల్లో ఏరియా జనరల్ మేనేజర్ ఏ,రాజేశ్వర్ రెడ్డి, సీఎంఓఏఐ అధ్యక్షులు టి వెంకటరామిరెడ్డి, గుర్తింపు సంఘం నాయకులు జి. శ్రీనివాస్, ప్రాతినిధ్య సంఘం నాయకురాలు శేష రత్నం, అధికార ప్రతినిధి కావూరి మారుతి–, క్రాంతికుమార్, డీవై పీఎం ఎస్ఎస్ఎస్ కోర్డినేటింగ్ ఆఫీసర్ శ్రవణ్ కుమార్, సెక్రటరీ లక్ష్మి, పర్శ శ్రీనివాస్, స్పోర్ట్స్ సూపర్వైజర్, ప్రవీణ్, మహిళలు అధిక సంఖ్య లో పాల్గొన్నారు.


# మహిళలు అన్ని రంగాలలో రాణించాలి

**- పశ్చిమ ఎమ్మెల్యే నాయిని - కేయూలో ఘనంగా మహిళా దినోత్సవం**

**వరంగల్ బ్యూరో (నినాదం న్యూస్) :** ప్రస్తుత పోటీ ప్రపంచంలో మహిళలు అన్ని రంగాలలో రాణించాలని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం కాకతీయ విశ్వవిద్యాలయంలో యువజన కాంగ్రెస్ ఆధ్వర్యంలో మహిళా దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా హాజరైన పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ రాజకీయాలకు అతీతంగా విద్యా రంగం బలోపేతం కావాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కాకతీయ యూనివర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ రామచంద్రం, హాస్టల్ డైరెక్టర్ రాజ్ కుమార్, డాక్టర్ గోదారెడ్డి, ఈసీ మెంబర్ చిర్ర రాజు గౌడ్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ కాంగ్రెస్ నాయకులు గజ్జెల మల్లేష్, సురాసి కృష్ణ, తీగల ప్రేమ్ చందర్, సోల్తి కిరణ్ కుమార్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



# ఫుల్‌టైమ్ టాలీవుడ్‌కి కేటాయిస్తున్న జాన్వీకపూర్




రాజు తలచుకుంటే దెబ్బలకు కొదవా ఫ్యాన్స్ తలచుకుంటే ట్రెండింగ్‌కి కొదవా అన్నట్టుంది పరిస్థితి. నిన్నటి నుంచి ఏక్‌ధమ్ ట్రెండ్ అవుతూనే ఉన్నారు జాన్వీ కపూర్. ఇంతగా ట్రెండ్ కావడానికి బర్త్ డే సెలబ్రేషన్స్ మాత్రమే రీజనా.. అంటే.. అదేంటి గురూ అలా అంటున్నారు.. నెక్ట్స్ టాలీవుడ్‌ని ఏలేది ఆ అమ్మాయే అని అంటున్నారు ఫ్యాన్స్. చుట్టమల్లే చుట్టేసింది మన జాన్వీ కపూర్. మొన్న మొన్నటిదాకా బాలీవుడ్‌కే పరిమితమైనా.. ఏనాడూ ఆమెని పొరుగమ్మాయిలా చూడలేదు మనవాళ్లు. తెలుగు సినిమాలు చేసేయ్ అమ్మా అని బుజ్జగిస్తూనే ఉన్నారు. ఆ మాటలు విన్న శ్రీదేవి తనయ దేవరతో ఎంట్రీ ఇస్తే సినిమా బ్లాక్‌బస్టర్ టాక్ తెచ్చుకుంది. దేవరలో జాన్వీని చూసి మా తంగం అనుకున్నారంతా. దేవర సెకండ్ పార్టు కోసం ఆల్రెడీ 2026లో కాల్షీట్ కేటాయించేశారు ఈ బ్యూటీ. ఇప్పుడు మాత్రం రామ్‌చరణ్ సినిమా షూటింగ్‌తో యమా బిజీగా ఉన్నారు. ఈ సినిమా నుంచి వచ్చిన జాన్వీ లుక్ అదిరిందంటున్నారు అభిమానులు. ఆర్సీ 16 షూట్ కంప్లీట్ కాగానే అల్లు అర్జున్ – అట్లీ సినిమా యూనిట్‌తో జాయిన్ అవుతారట శ్రీదేవి తనయ. ఐకాన్ స్టార్ పక్కన అద్భుతమైన రోల్ కుదిరిందంటూ హ్యాపీగా ఉన్నారట జాన్వీ. డ్యాన్సుల్లో బన్నీని ఈక్వెల్ చేయడానికి ఇప్పటి నుంచే కాసింత స్పెషల్‌గా శ్రద్ధ పెడుతున్నారట. తెలుగులో ఒకటికి మూడు సినిమాలు చేతిలో ఉన్నాయి జాన్వీకి. ముగ్గురు లీడింగ్ హీరోల మూవీస్‌లో చేస్తున్నారు. సో, అడపాదడపా బాలీవుడ్ మూవీస్ చేసినా, ఫుల్ టైమ్ తెలుగుకే అలాట్ చేసేయాలని ఫిక్స్ అయిపోయినట్టున్నారు సిల్వర్‌స్క్రీన్ తంగం.

# ఆ బాధ ఇప్పటికీ ఉంది : చిరంజీవి




నేడు మహిళ దినోత్సవం సందర్భంగా మెగా ఫ్యామిలీ అంతా ఒక్కదగ్గరే చేరింది. మెగా వుమెన్స్ పేరుతో ఒక ఇంటర్వ్యూలో విడుదల కాగా.. ఈ ఇంటర్వ్యూలో మెగాస్టార్ చిరంజీవితో పాటు అతడి అమ్మ అంజనాదేవి తమ్ముడు నాగబాబు, చెల్లెల్లు పాల్గోన్నారు. ఇందులో మెగా కుంటుంబంకి సంబంధించిన ఎన్నో విషయాలను చిరుతో పాటు అంజనాదేవి తదితరులు పంచుకున్నారు. అయితే ఈ ఇంటర్వ్యూలో చిరు మాట్లాడుతూ.. తన చెల్లి చనిపోయిన క్షణం ఇప్పటికీ గుర్తుకువస్తుందంటూ ఎమోషనల్ అయ్యాడు. అమ్మకు మేము ఐదుగురు సంతానం. అయితే మరో ముగ్గురు తోబుట్టువులు నా చిన్నతనంలోనే చనిపోయారు. నాన్న ఉద్యోగంలో బిజీగా ఉన్న సమయంలో అమ్మనే ఇంట్లో అన్ని పనులు చూసుకోవడంతో పాటు గృహిణిగా అన్ని బాధ్యతలు తన మీదే ఉండేవి. దీంతో చిన్ననాటి నుంచి తనకు సాయం చేసేవాడిని. అయితే నేను ఆరో తరగతి చదువుతున్న సమయంలో నాకు రమ అనే సోదరి ఉండేది. ఒకసారి సడన్‌గా జబ్బుపడింది. దీంతో నేను అమ్మ కలిసి తనను ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకువెళ్లాం. నాన్నకి ఈ విషయం తెలియదు. ఆసుపత్రిలో ఉండగానే రమ కన్నుమూసింది. దీంతో తనను చేతుల్లో ఎత్తుకుని ఇంటికి తీసుకెళ్లాను. ఇంటి చుట్టుపక్కల ఉన్నవారు సాయం చేయడంతో రమ అంతక్రియలు పూర్తి చేశాం. అయితే ఈ విషయం నాన్నకి తర్వాత తెలిసింది. తాను వచ్చేవరకు అంతా అయిపోయింది. కానీ ఆ క్షణాలు నాకు ఇప్పటికీ కూడా గుర్తున్నాయి వాటికి తలచుకున్నప్పుడల్లా ఎమోషనల్ అవుతుంటా అంటూ చిరు చెప్పుకోచ్చాడు.

# జటాధరలో సోనాక్షి సిన్హా



తెలుగు సినిమాల్లో నటించేందుకు బాలీవుడ్ తారలు ఆసక్తి చూపిస్తున్నారు. ప్రియాంకా చోప్రా, అలియాభట్, దీపికా పదుకొణె, జాన్వీకపూర్, అనన్యపాండే వంటి భామలు ఇప్పటికే తెలుగు సినిమాల్లో నటించి అలరించారు. ఇప్పుడు వీరి జాబితాలో సోనాక్షి సిన్హా చేరారు. డిఫరెంట్ కాన్సెప్ట్‌లతో బీటౌన్‌లో హీరోయిన్‌గా గుర్తింపు తెచ్చుకున్నారు సోనాక్షి. ఇటీవల 'హీరామండి'తో అల రించిన ఆమె టాలీవుడ్ ఎంట్రీకి సిద్ధమయ్యారు. సుధీర్‌బాబు హీరోగా నటిస్తోన్న 'జటాధర'తో ఆమె తెలుగులోకి అడుగుపెడుతున్నారు. ఈ విషయాన్ని తెలియజేస్తూ చిత్రబృందం శనివారం పోస్టర్ విడుదల చేసింది. ప్రస్తుతం ఇది ప్రేక్షకుల దృష్టిని ఆకర్షిస్తోంది. పాన్ ఇండియా సినిమాగా ఈ చిత్రం తెరకెక్కుతోంది. వెంకట్ కల్యాణ్ దర్శకత్వం వహిస్తున్నారు. ప్రేరణ అరోరా సమర్పణలో సుధీర్‌బాబు ప్రొడక్షన్స్ పతాకంపై నిర్మితమవుతోంది. 'శాస్త్రీయ, పౌరాణిక అంశాల మేళవింపుతో ఈ కథను రాశారు. ఈ రెండు జానర్స్‌కు చెందిన ప్రపంచాల్ని వెండితెరపై చూస్తున్నప్పుడు ప్రేక్షకులు ఓ సరికొత్త అనుభూతి పొందుతారని సుధీర్‌బాబు తెలిపారు.

# నటి రన్యారావు శరీరంపై గాయాలు



బంగారం అక్రమ రవాణా కేసులో అరెస్టైన నటి రన్యారావు వ్యవహారం దేశవ్యాప్తంగా సంచలనం సృష్టిస్తోంది. ఈ కేసుకు సంబంధించి ముమ్మర దర్యాప్తు కొనసాగుతోంది. ప్రస్తుతం రన్యా రావు డీఆర్ఐ కస్టడీలో ఉంది. డైరెక్టరేట్ ఆఫ్ రెవెన్యూ ఇంటెలిజెన్స్ అధికారులు ఆమెను విచారిస్తున్నారు. ఈ క్రమంలో నటికి సంబంధించిన ఓ ఫొటో ప్రస్తుతం వైరల్ అవుతోంది. కళ్ళు వాచి, ముఖంపై గాయాలతో ఫొటో వైరల్‌గా మారింది. దీంతో కస్టడీలో ఆమెపై అధికారులు దాడి చేసి ఉంటారని చర్చ జరుగుతోంది. దీనిపై మహిళా సంఘాలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. ఈ నేపథ్యంలో కర్ణాటక రాష్ట్ర మహిళా కమిషన్ శుక్రవారం నటి వైరల్ చిత్రంపై స్పందించింది. ఈ అంశంపై ఎవరైనా అధికారికంగా ఫిర్యాదు దాఖలు చేస్తే విచారణ చేపట్టనున్నట్లు పేర్కొంది. లేదంటే దర్యాప్తు నిర్వహించడానికి కమిషన్‌కు అధికారం లేదని పేర్కొంది. 'నటి ఒంటిపై గాయాల విషయంలో ఎవరైనా మాకు ఫిర్యాదు చేయాలి. లేదంటే మహిళా కమిషన్ దర్యాప్తు నిర్వహించడానికి అధికారం లేదు' అని కర్ణాటక రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ నాగలక్ష్మి చౌదరి అన్నారు. అయితే, నటి ఒంటిపై గాయాల అంశంపై డైరెక్టరేట్ ఆఫ్ రెవెన్యూ ఇంటెలిజెన్స్ స్పందించింది. ఆమె శరీరంపై పలుచోట్ల గాయాలున్నాయని పేర్కొంది. అయితే దుబాయ్‌కి వెళ్లడానికి చాలాకాలం ముందే తనకు ఈ గాయాలు అయ్యాయని నటి తెలిపినట్లు అధికారులు వెల్లడించారు. దీంతో అవసరమైన వైద్య సాయం అందించాలని జైలు అధికారులను కోర్టు ఆదేశించినట్లు చెప్పారు. రన్యా రావు దుబాయ్ నుంచి రూ.14 కోట్లకు పైగా విలువైన బంగారం స్మగ్లింగ్ చేస్తూ బెంగళూరు విమానాశ్రయంలో పట్టుబడిన విషయం తెలిసిందే. రూ.2.06 కోట్ల విలువైన బంగారు నగలు, రూ.2.67 కోట్ల నగదు పట్టుబడ్డాయి.

# ఆ విషయంలో ఆలియాభట్ చాలా బెటర్




సినిమా ఎలా ఉన్నా.. సక్సెస్ అని చెప్పుకునే రోజులు లేవిప్పుడు. సినిమా ఫలితాన్ని నటీనటులు ఓపెన్‌గానే చెప్పేస్తున్నారు. రిలీజ్ అయిన వెంటనే వాళ్లకి రిజల్ట్ తెలిసినా బిజినెస్ పరంగా ఏవో లావాదేవీలు ఉంటాయి కాబట్టి అప్పటికైతే సైలెంట్‌గా ఉంటున్నారు. కానీ తర్వాత తర్వాత మాత్రం ఓపెన్ అయిపోతున్నారు... జిగ్రాలో ఆలియా అద్భుతంగా నటించారు. తను ఆల్ఫా లేడీ అంటూ ఈ మధ్య ఆలియా భట్‌ని తెగ పొగిడేశారు సమంత. నటన పరంగా సమంత మాత్రమే కాదు.. చాలా మంది కాంప్లిమెంట్లు ఇచ్చేశారు ఆలియాకు. కానీ, సినిమా రిజల్ట్ అనుకున్నట్టే వచ్చిందా అంటే నో.. దీని గురించి రీసెంట్‌గా మాట్లాడారు ఆలియా. జిగ్రా తన డ్రీమ్ ప్రాజెక్ట్ అని చెప్పారు ఆలియా. దర్శకుడు వాసన్ బాలా ఎంతో కష్టపడి తీసినా, ఫలితం వేరేగా వచ్చింది.. అలాగని నిరాశపడిపోయి కూర్చోలేం కదా.. అన్నది ఆలియా చెబుతున్న మాట. అంతే కాదు.. తనకు నటనంటే ఇష్టమని, సినిమా అంటే ప్రాణమని.. అందుకే జయాపజయాలకు అతీతంగా సినిమాలు నిర్మిస్తున్నాననీ అంటున్నారు ఆల్ఫా లేడీ. ప్రస్తుతం ఆల్ఫాలో నటిస్తున్నారు ఆలియా. జయాపజయాలు ఆమెను ఏమాత్రం ప్రభావితం చేయవట. హిట్ వచ్చిందని ఖుషీ అవ్వడం, ఫ్లాప్ వచ్చిందని కుంగిపోవడం తనకు తెలియదంటారు ఈ లేడీ. ఓటమి ఎదురైనప్పుడు బాధ కచ్చితంగా ఉంటుందని, అయితే దాన్నుంచి చాలా త్వరగా బయటపడతాననీ, ఎవరైనా సరే దీన్ని ప్రాక్టీస్ చేయాలని సలహా ఇస్తున్నారు మిసెస్ రణ్‌బీర్ కపూర్ గతంతో పోలిస్తే ఇప్పుడు కాస్త స్పీడు తగ్గించారు.



# మీ అంచనాలను అందుకోలేనుకుంటే నా సినిమా చూడొద్దు : నాని

నా 16ఏళ్ల సినీ కెరీర్‌లో 'దయ చేసి ఈ సినిమా చూడండి' అని నేనెప్పుడూ అడిగింది లేదు. కానీ, ఈ చిత్ర విషయంలో ఆ మాట అడుగుతున్నా. ఎందుకంటే ఇలాంటి మంచి సినిమాని ప్రేక్షకులెవరూ మిస్సవ్వకూడదని నా కోరిక. ఇది మీ అంచనాలను అందుకోలేదు అనిపిస్తే రెండు నెలల్లో విడుద కానున్న నా 'హిట్ 3'ని ఎవరూ చూడొద్దు అని నాని అన్నారు. ఆయన సమర్పణలో ప్రియదర్శి ప్రధాన పాత్ర నటించిన చిత్రం 'కోర్ట్: స్టేట్ వర్సెస్ ఎ నోబడీ'. రామ్ జగదీశ్ తెరకెక్కించారు. ప్రశాంతి తిపిర్నేని నిర్మాత. హర్ష్ రోషన్, శ్రీదేవి జంటగా నటించారు. ఈ నెల 14న థియేటర్లలో విడుదల కానుంది. శుక్రవారం రాత్రి హైదరాబాద్‌లో జరిగిన ప్రీరిలీజ్ వేడుకలో ఈ చిత్ర ట్రైలర్‌ను నాని విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో దర్శకులు మోహనకృష్ణ ఇంద్రగంటి, నాగ్ అశ్విన్, ప్రశాంత్ వర్మ, శ్రీకాంత్ ఓదెల, శైలేశ్ కొలను, శౌర్యువ్ తదితరులు పాల్గొన్నారు. నాని మాట్లాడుతూ.. ఈ రోజుల్లో సినిమాల్లోకి దూరిపోయి.. అందులోని పాత్రలకు ఎమోషన్‌తో కనెక్ట్ అయిపోయి.. వాటితోపాటు నవ్వి, ఏడ్చి.. ఆ చిత్ర ప్రపంచం లోకి తీసుకెళ్లే కథలు బాగా తగ్గిపోయాయి. కానీ, అలాంటి అనుభూతిని 'కోర్ట్'తో నేను పొందగలిగా. ఇప్పుడా అనుభూతిని ప్రేక్షకులని పొందాలన్నది నా తాపత్రయం. ఎందుకంటే ఇలాంటి మంచి సినిమాని తెలుగు ప్రేక్షకులెవరూ మిస్సవ్వకూడదని నా కోరిక. అందుకే ఇంతగా బతిమలాడుతున్నా. సినిమా చూశాక ప్రతి ఒక్కరూ మంచి సినిమా చూశామనే గర్వంతో బయటకు వస్తారు. ఇది మీ అంచనాల్ని అందుకోలేదు అనిపిస్తే మరో రెండు నెలల్లో విడుదల కానున్న 'హిట్ 3'ని ఎవరూ చూడొద్దు. ఇంతకంటే బలంగా నేనేమీ చెప్పలేను. ఎందుకంటే దీనికన్నా 10రెట్లు ఎక్కువగా 'హిట్ 3'పై ఖర్చు పెట్టా. ఈ నెల 14 వరకే 'ఈ సినిమా చూడమని అందరికీ చెప్పా.

# పరిస్థితుల ప్రభావం అలా తప్పదు



మెగా బ్రదర్ నాగబాబు ముద్దుల కూతురు నిహారిక గురించి ప్రత్యేక పరిచయాలు అక్కర్లేదు. ఈ అమ్మడు యాంకర్‌గా ఇండస్ట్రీకి వచ్చి ఆ తర్వాత హీరోయిన్‌గా పలు సినిమాలు చేసింది.అయితే నిహారికకి ఒక్క సినిమా కూడా మంచి హిట్ అందించలేకపోయింది. ఇక నటిగా మంచి గుర్తింపు రావడం లేదని భావించిన నిహారిక నిర్మాతగా సినిమాలు చేయడం ప్రారంభించింది. ఈ మధ్య కమిటీ కుర్రాళ్లు అనే సినిమా చేయగా, ఈ మూవీ సూపర్ హిట్ అయింది. దీంతో ఒకవైపు సినిమాలు చేస్తూనే మరోవైపు నిర్మాతగా మరి సినిమాలను కూడా నిర్మించాలని నిహారిక భావిస్తుంది. అయితే నిహారిక సినీ బ్యాక్‌గ్రౌండ్ లేని వ్యక్తి అయిన జొన్నలగడ్డ వెంకట చైతన్య అనే కుర్రాడిని వివాహం చేసుకున్న విషయం తెలిసిందే. వీరి పెళ్లి డెస్టినేషన్ వెడ్డింగ్ పద్ధతిలో చాలా అట్టహాసంగా జరిగింది. అయితే వీరి వైవాహిక జీవితం రెండేళ్లకే ముగిసిపోయిందని చెప్పాలి. పెళ్లైన రెండు సంవత్సరాలకి విడాకులు తీసుకుని ఎవరి దారులు వారు చూసుకున్నారు. విడాకుల ప్రకటన తర్వాత వీరి విడాకులకి కారణం ఏమై ఉంటుందా అని పలువురు పలు రకాల చర్చలు జరిపారు. అయితే విడాకులు తీసుకున్న అనంతరం నిహారిక తిరిగి సినిమా ఇండస్ట్రీలో బిజీగా గడుపుతుంది. హీరోయిన్‌గా మంచి హిట్ కొట్టాలనే కసితో ఉంది. తాజాగా నిహారిక తన విడాకులపై ఆసక్తికర కామెంట్స్ చేసింది. సెలబ్రిటీ హోదాతో సంబంధం లేకుండా, విడాకులు ఏ అమ్మాయికైన బాధాకరమైన అనుభవం అంటూ నిహారిక స్పష్టం చేసింది. పెళ్లి బంధంలోకి అడుగుపెట్టేటప్పుడు ఎవరు కూడా విడాకుల గురించి ఆలోచించరు. కొన్ని సార్లు కొన్ని పరిమాణాలు వేరుగా ఉండడం, పరిస్థితులు అదుపు తప్పడం వలన కష్టమైన నిర్ణయాలు తీసుకోవల్సి ఉంటుంది. జీవితంలో సవాళ్ల నుంచి చాలా నేర్చుకునేందుకు ఆస్కారం ఉందని నిహారిక పేర్కొంది. గతంలో చాలా సందర్భాల్లో విడాకుల గురించి స్పందించడానికి ఇష్టపడని నిహారిక ఇప్పుడు మాత్రం భిన్నంగా కామెంట్స్ చేసింది. ఇక నిహారిక వయస్సు 31 ఏళ్లు అని తెలుస్తుండగా, ఆమె త్వరలో రెండో పెళ్లి చేసుకునే అవకాశం ఉంది.

Printed, Published & Owned by B. Srinivas, Printed at Sree Seshasai EnterprisesPlot no. 98/1, Co-operative Industrial Estate,Gandhi Nagar, near Balanagar Medchel -Malkajgiri Dist.Hyderabad 500037 (T.S).
Published at Plot S11, 3rd Floor, Ballard estate Margadarshi building Tarnaka Secundrabad, Hyderabad 500 007 (T.S), Editor : B. Srinivas, RNI NO. APTEL /2003/11288, Gmail: ninadamnews@gmail.com, CELL : +91 80742 79741